RNI No.: TELTEL/2011/47101

అక్షర వార్త

దినపత్రిక

సంపుటి: 14 | సంచిక : 69 | కరీంనగర్ | శనివారం, ఆగష్టు 16, 2025 | వెల : రూ॥1/- | పేజీలు : 8

జలదిగ్బంధంలోనే ఏడుపాయల

వన దుర్గమ్మ ఆలయం

హైదరాబాద్: భారీ వరదల కారణంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయం వరుసగా మూడవ రోజు కూడా జలదిగ్బంధంలోనే ఉంది. వరదల కారణంగా ఆలయ అధికారులు భక్తుల దర్శనం కోసం రాజగోపురం వద్ద అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

కొత్త ప్రదేశంలో ప్రత్యేక అభిషేక ఆచారాలు, అలంకార నైవేద్యాలు నిర్వహిస్తున్నారు. సింగూర్‌లోని నక్క వాగు నుండి వన దుర్గ సరస్సులోకి 25,000 క్యూసెక్కుల వరద నీరు ప్రవేశించడంతో ప్రస్తుతం వన దుర్గ ఒడ్డు పొంగి ప్రవహిస్తోంది. ఫలితంగా, గర్భగుడి ముందు ఉన్న నది రాజగోపురం దాటి వేగంగా ప్రవహిస్తోంది. భక్తుల భద్రతను నిర్ధారించడానికి, అవుట్‌పోస్ట్ సిబ్బంది వన దుర్గ ఆనకట్ట చుట్టూ ఉన్న ప్రాంతాన్ని బారికేడ్ చేసి, గట్టి భద్రతను ఏర్పాటు చేసి, ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశాన్ని పరిమితం చేశారు. వరదలు తగ్గిన తర్వాత గర్భగుడి వద్ద సాధారణ దర్శనం తిరిగి ప్రారంభమవుతుందని ఆలయ కార్యనిర్వాహక అధికారి చంద్రశేఖర్ తెలిపారు. నీటిపారుదల శాఖ పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తోంది.

నాగార్జున సాగర్‌కు పోటెత్తిన పర్యాటకులు

పర్యాటకులతో పోటెత్తిన ప్రాంతం..
సుందర దృశ్యాలను చూసేందుకు తరలివస్తున్న పర్యాటకులు..
ఏపీ.. తెలంగాణ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో పర్యాటకులు..
శనివారం కావడంతో హైదరాబాద్ నుండి సందర్శకులు..

నాగార్జునసాగర్ : నాగార్జున సాగర్‌కు శనివారం పర్యాటకులు పోటెత్తారు. గత వారం రోజులుగా సాగర్ అందాలను చూసేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. 16 గేట్ల ద్వారా కిందికి దూకుతున్న నీటి పరవళ్లను చూసేందుకు జనం క్యూ కడుతున్నారు. దీంతో సాగర్ దగ్గర కిలోమీటర్‌కు పైగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. నాగార్జునసాగర్ డ్యామ్ 16 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తుండడంతో కృష్ణమ్మ అందాలను వీక్షించడానికి పర్యాటకులు పోటెత్తారు. శనివారం విద్యాసంస్థలకు సెలవు కావడంతో లక్ష మందికిపైనే తరలివచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

ఉదయం నుంచి డ్యామ్ వద్ద కొత్త బ్రిడ్జి, జల విద్యుత్ కేంద్రం, శివాలయం పరిసరాలు పర్యాటకులతో కిక్కిరిసిపోయాయి. డ్యామ్ క్రస్ట్ గేట్ల ద్వారా జాలువారుతున్న కృష్ణమ్మ జల సవ్వడులను పర్యాటకులు వీక్షిస్తూ సెల్ఫీలు, ఫొటోలు దిగారు.

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు పైనుంచి భారీగా వరద వస్తున్నది. రిజర్వాయర్ నీటిమట్టం 590 (312 టీఎంసీలు) అడుగులకుగానూ ప్రస్తుతం 588.00 (306.10 టీఎంసీలు) అడుగులు ఉన్నది. శ్రీశైలం నుంచి 1,72,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నాగార్జునసాగర్‌కు కొనసాగుతుండగా అంతే మొత్తంలో దిగువకు వదిలారు. శనివారం 16 గేట్లు 5 అడుగుల ఎత్తి మొత్తం అవుట్ ఫ్లో 1,62,829 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

కనిపించని, రెవెన్యూ మున్సిపల్ సిబ్బంది సేవలు

డ్యామ్ అందాలను తిలకించడానికి లక్షకు పైగా పర్యాటకులు సాగర్‌కు వస్తున్నారు. కానీ పర్యాటకుల కోసం మున్సిపల్, రెవెన్యూ శాఖలు మంచి నీటి వసతులు, మెడికల్ క్యాంప్‌లు, అంబులెన్స్ వంటి సౌకర్యాలు కల్పించలేదు. మల, మూత్ర విసర్జనకు ఏర్పాట్లు చేయలేదు. దాంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే 5 కిలోమీటర్లు దూరంలో ఉన్న దవాఖానకు తరలించే లోపు ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉన్నది. ఇప్పటికైనా స్థానిక అధికారులు దీనిపై దృష్టి పెట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.

సెలవులు కావడంతో డ్యామ్ ను చూసేందుకు భారీగా వస్తున్న యాత్రికులు. వాహనాలు అధిక సంఖ్యలో రావటంతో పోలీసులు అదుపు చేయలేకపోతున్నారు. రద్దీ ఎక్కువ వుండటంతో వాహనాలను రోడ్డు కి ఇరువైపులా పార్కింగ్ చేసి వెళ్ళి పోయిన వాహన దారులు. కిలో మీటర్ల మేర నిలిచిపోయిన ట్రాఫిక్ నిబంధనలు తీవ్రత ఇబ్బందులు పడుతున్న చిన్న పిల్లలు, మహిళలు. నాగార్జునసాగర్ ప్రాంతం సందడిగా ఉన్నది. అందుకు తగ్గట్లుగా ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

హైదరాబాద్‌లో కామిక్ కాన్ ఇండియా 2025-26 సీజన్ ప్రారంభానికి అంతా సిద్ధం

ప్రపంచం నలుమూలల నుంచి అతిథులు రాక. అద్భుతమైన కాస్ప్లే పోటీలు

హైదరాబాద్, :భారతదేశపు అతిపెద్ద పాప్ కల్చర్ వేడుక అయిన కామిక్ కాన్ ఇండియా తన 13వ ఎడిషన్, 2025-26 సీజన్‌ను ప్రారంభించడానికి సిద్ధమైంది. ఈ సీజన్ అక్టోబర్ 31 నుంచి నవంబర్ 2 వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరగనుంది. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పాప్ కల్చర్ హబ్‌లలో ఒకటైన హైదరాబాద్, ఈ సీజన్‌కు ఆతిథ్యం ఇవ్వడం విశేషం. కామిక్ కాన్ ఇండియా చాలా నెలల పాటు దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో జరుగుతుంది. ఇందులో కామిక్స్, కాస్ప్లే, గేమింగ్, సినిమాలు, టీవీ షోలు, యానిమే , ఇతర పాప్ కల్చర్ అంశాలను ఒకేచోట చేర్చి అభిమానులను అలరిస్తారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని అభిమానుల కోసం ప్రత్యేకంగా కొన్ని ఏర్పాట్లు చేశారు. ఇందులో మీరు ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే ప్రముఖ అతిథులను కలవవచ్చు. అలాగే, ప్రత్యేకమైన స్టాండ్-అప్ కామెడీ, మ్యూజిక్ షోలు ఆస్వాదించవచ్చు. అంతేకాకుండా, మార్కెట్‌లో కొత్తగా విడుదలయ్యే వస్తువులను కొనుగోలు చేయవచ్చు. ఇంటరాక్టివ్ ఫ్యాన్ జోన్స్‌లో పాల్గొని, దేశంలోనే అత్యుత్తమ కాస్ప్లేయర్లను చూసే అవకాశం కూడా లభిస్తుంది. ఇదంతా అభిమానులకు ఒక గొప్ప అనుభూతినిస్తుంది.

NODWIN గేమింగ్ కోఫౌండర్, ఎండీ అక్షత్ రాతీ మాట్లాడుతూ.. "హైదరాబాద్‌తో కామిక్ కాన్ ఇండియా కొత్త సీజన్‌ను మొదలుపెట్టడం చాలా సంతోషంగా ఉంది. ప్రతి నగరంలోని అభిమానుల ఆసక్తులకు తగ్గట్లుగా ప్రముఖ సెలబ్రిటీలు, అతిథులను తీసుకువస్తున్నాం. అలాగే, అభిమానులు ప్రత్యేక అనుభూతి పొందేందుకు అద్భుతమైన ఏర్పాటు చేస్తున్నాం. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పాప్ కల్చర్ స్టార్లు, భారతదేశంలోని గొప్ప కాస్ప్లేయర్లు, ఉత్తేజపరిచే ఈ-స్పోర్ట్స్ పోటీలు, ప్రత్యేకమైన ప్యానెల్ డిస్కషన్స్, లాంచ్‌లు ఇలా చాలా అంశాలు ఈ సంవత్సరం కామిక్ కాన్‌లో ఉంటాయి. 2025-26 సీజన్ అభిమానులందరికీ ఒక పండుగలా ఉంటుంది" అని తెలిపారు.

2024లో, హైదరాబాద్‌లో జరిగిన కామిక్ కాన్‌కు 40,000 మందికి పైగా అభిమానులు హాజరయ్యారు. ఇది ఒక రికార్డు. గేమర్స్, కామిక్ బుక్ అభిమానులు, క్రియేటర్స్, పాప్ కల్చర్ ప్రియులందరూ ఒకే చోట కలుసుకోవడం విశేషంగా నిలిచింది. ఈసారి కూడా కామిక్ కాన్ మూడు రోజుల పాటు అద్భుతమైన కార్యక్రమాలతో అభిమానులను అలరించనుంది. ఇందులో ఉత్సాహభరితమైన కాస్ప్లే పోటీలు, లైవ్ మ్యూజిక్ షోలు, దేశంలోని ప్రముఖ కంటెంట్ క్రియేటర్స్‌తో మీట్ అండ్ గ్రీట్ సెషన్స్ వంటివి ఉంటాయి. ఈ వీకెండ్ అభిమానులందరికీ పండుగలా ఉంటుంది. కామిక్ కాన్ ఇండియా సీఈవో షెఫాలీ జాన్సన్ మాట్లాడుతూ.. "హైదరాబాద్ ఇప్పుడు భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంస్కృతిక, సృజనాత్మక నగరాలలో ఒకటిగా మారింది. ఇక్కడ వేగంగా పెరుగుతున్న టెక్నాలజీ రంగం, యువతరం, ప్రపంచ పాప్ కల్చర్‌పై వారికి ఉన్న ఆసక్తి చూస్తుంటే, 2025-26 సీజన్‌ను ప్రారంభించడానికి హైదరాబాదే సరైన వేదిక అని మేము భావిస్తున్నాం. ఈ సీజన్‌లో హైదరాబాద్ నుంచి భారీ స్పందన వస్తుందని మేము ఆశిస్తున్నాం" అని తెలిపారు.

ఈ సంవత్సరం, మూడు రోజుల పాటు జరిగే హైదరాబాద్ ఎడిషన్, పాప్ కల్చర్, ఈ-స్పోర్ట్స్‌ను కలిపి ఒక అద్భుతమైన అనుభూతిని అందించనుంది. యానిమే ప్రదర్శనల నుండి పోటీ గేమింగ్ అరేనాల వరకు, ఇంటరాక్టివ్ ప్రశ్న-జవాబు ప్యానెల్‌ల నుంచి ఫ్యాన్ జోన్‌ల వరకు, అన్ని వయసుల అభిమానులకు ఇది ఒక సరికొత్త అనుభవాన్ని అందిస్తుంది. ఇంతకుముందు జరిగిన కామిక్ కాన్ ఇండియా ఈవెంట్లలో, మార్వెల్, డీసీ వంటి ప్రముఖ కామిక్ బుక్ లెజెండ్స్ నుంచి, ప్రసిద్ధ యానిమే ఆర్టిస్టులు, హాలీవుడ్ స్టార్స్ వరకు చాలా మంది సెలబ్రిటీలు పాల్గొన్నారు. ఒక కొత్త రికార్డు సృష్టించాలని నిర్వాహకులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

మోత్కూరు మండలాన్ని నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలని అడ్డగూడూరు తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా

అడ్డగూడూరు:కేంద్ర ప్రభుత్వం 2026 సంవత్సరంలో చేపట్టనున్న నియోజకవర్గ పునర్విభజనలో మోత్కూరు మండలాన్ని నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నాడు మోత్కూరు మండలాన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ బీసీ రిజర్వేషన్ సాధన సమితి మండల కమిటీ ఆధ్వర్యంలో అడ్డగూడూరు తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ శేషగిరిరావు కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి 20 ఏళ్లకు కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 119 స్థానాలకు అదనంగా 34 నియోజకవర్గాలు ఏర్పాటు కానున్నాయని తెలుస్తోందన్నారు. ఉమ్మడి నల్లగొండ (ప్రస్తుతం) యాదాద్రి జిల్లాలో అభివృద్ధిలో అంత్యంత్య వెనుకబడిన మండలంగా మోత్కూరు ఉందన్నారు. నూతనంగా ఏర్పాటు కానున్న నియోజకవర్గ పునర్విభజన లో భాగంగా గుండాల, అడ్డగూడూరు, ఆత్మకూరు (ఎం) మోటకొండూరు, మండలాలకు అనుసంధానంగా ఉన్నా మోత్కూరు మండలాన్ని నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ 5మండలాలలో 68 రెవెన్యూ గ్రామాలు, 90 గ్రామపంచాయతీ తో పాటు 2011 జనాభా లెక్క ప్రకారం 1.73(ఒక లక్షా 73 వేలు) జనాభా ఉందని, ఈ 14 సంవత్సరాలు జనాభా లెక్క పరిశీలిస్తే మరో 50 వేలు పెరగవచ్చని, తద్వారా మోత్కూరు నియోజవర్గం ఏర్పాటు కావడానికి అన్ని అర్హతలు ఉంటాయని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో పాటు అభివృద్ధికి పెద్దపీట

- సబ్బితం జలపాతానికి రూ.6 కోట్లు మంజూరు - ఎమ్మెల్యే విజయరమణ రావు

పెద్దపల్లి : పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు,పర్యావరణ పరిరక్షణతో పాటు నిరుపేదల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సబ్బితం జలపాతాన్ని అభివృద్ధి చేయడానికి రూ. 6 కోట్ల నిధులు మంజూరు చేయించామని,త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు. అలాగే,జలపాతానికి వెళ్లే రోడ్డు నిర్మాణం కోసం కూడా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో రూ. 55 లక్షల నిధులతో నిర్మించిన ఫారెస్ట్ అధికారుల నివాస గృహ సముదాయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేసి,గృహ నిర్మాణ పనులను ప్రారంభించారు. అంతేకాకుండా, రూ. 32 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపనలు చేశారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి,పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విజయరమణ రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఖాళీ ప్రదేశాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. నిరుపేదలందరికీ గూడు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని,లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. పేదల కళ్లల్లో ఆనందం చూడటానికి

రేవంత్ ప్రభుత్వం అభివృద్ధి,సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని,ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అన్నయ్య గౌడ్,డీఎఫ్ఓ శివయ్య, మార్కెట్ చైర్మన్లు ఈర్ల స్వరూప,ప్రకాష్ రావు,ఎంపీడీఓ శ్రీనివాస్,ఇతర అధికారులు,స్థానిక నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎరువుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

రైతులు ఎవరైనా అధైర్య పడవద్దు -సకాలంలో ఎరువులు అందరికి అందుతాయి
ప్రతి డీలర్ ప్రభుత్వ సంబంధిత లైసెన్స్ కలిగి ఉండాలి -వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగారాజు

(వరంగల్/వర్ధన్నపేట) :వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎరువుల విక్రయ కేంద్రాన్ని కొబ్బరికాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ,ఎరువులను ప్రాథమిక సహకార సంఘాలు, అగ్రో రైతు సేవా కేంద్రాలు, డిసిఎంఎస్ కేంద్రాలు , ప్రైవేటు దుకాణాల ద్వారా రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అందరు డీలర్లు తప్పనిసరిగా లైసెన్సును కలిగి ఉండాలని ఎరువుల నియంత్రణ చట్టం 1985 నియమ నిబంధనలు పాటిస్తూ, పి ఓ ఎస్ మిషన్ ద్వారా మాత్రమే అమ్మకాలు జరపాలని వివరించారు. ప్రతి రైతు దగ్గర నుండి

ఆధార్ కార్డు వివరాలను సేకరించి మాత్రమే ఎరువుల విక్రయాలు జరపాలని ఆదేశించారు,అదే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో రైతులకు ఎరువుల కొరత లేకుండా అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అక్షర వార్త

ఆదివారం, ఆగష్టు 17, 2025

కొత్త భారత్‌ను ఆవిష్కరిద్దాం

దేశవ్యాప్తంగా 79వ స్వాతంత్ర వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఢిల్లీలోని ఎర్రకోటలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జాతీయ జెండా ఎగరవేశారు. ప్రధానమంత్రి హోదాలో జాతీయ జెండాను ఎగరవేయడం ఇది 12వసారి. గతంలో ఏ ప్రధానమంత్రి సాధించని ఘనతను నరేంద్ర మోడీ తన పేరు మీద లిఖించుకున్నారు.. దేశ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు మోదీ స్పష్టం చేశారు. మేడిన్ ఇండియా దేశ శక్తిని ప్రపంచానికి చాటుతుందన్నారు. సెమీకండక్టర్ల రంగంలో భారత్ పురోగతి సాధించిందన్నారు. ఇప్పటికే నాలుగు సెమీకండక్టర్ యూనిట్లు ప్రారంభించినట్లు గుర్తు చేసిన మోదీ.. మరో ఆరు సెమీకండక్టర్ యూనిట్లు రెడీ అవుతున్నట్లు తెలిపారు. మేడిన్ ఇండియా సాయంతోనే ఆపరేషన్ సింధూర్ సక్సెస్ అయ్యిందన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయానికి అతిపెద్ద కారణం మన సాంకేతికత, రక్షణ రంగంలో మేక్ ఇన్ ఇండియా శక్తి అని అన్నారు. ఉగ్రవాదులను రక్షించడానికి వచ్చిన పాకిస్తాన్‌ను కొన్ని గంటల్లోనే మోకరిల్లేలా చేశామన్నారు. గత స్వాతంత్ర వేడుకల్లో తమ ప్రభుత్వం ఏం చేసిందో.. ఏం చేయబోతుందో నరేంద్ర మోడీ చెప్పేవారు. కానీ ఈసారి స్వాతంత్ర వేడుకల్లో పాకిస్తాన్‌ను ఉతికి ఆరేశారు. అమెరికాకు పరోక్ష హెచ్చరికలు పంపించారు. కొద్దిరోజులుగా దేశంలో ఓటు చోరీ అంటూ హడావిడి చేస్తున్న రాహుల్ కు చురకలు అంటించారు. ఉగ్రవాదానికి సహకరించే వారికి గట్టి సమాధానం చెబుతాం. మన సైన్యానికి పూర్తిస్థాయిలో స్వేచ్ఛనిచ్చాం. న్యూక్లియర్ బెదిరింపులకు భయపడేది లేదు. ఎవరో హెచ్చరిస్తే వణికిపోయేది లేదు. దేశ సౌభాగ్యం కోసం ఎట్టి పరిస్థితుల్లో వెనుకడుగు వేసేది లేదు.. మన దేశం జోలికి వస్తే ఎవరినైనా వదిలిపెట్టేది లేదు. దాయాది దేశం మనల్ని కవ్విస్తే.. వారి దేశంలోకి వెళ్లి.. ఉగ్రవాదులను మట్టుపెట్టాం. రక్తం, నీళ్లు ఎప్పుడూ కలిసి ప్రవహించవు. డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ దేశ రాజ్యాంగం అమలు కోసం తన ప్రాణాన్ని త్యాగం చేశారు. సింధు నది మీద భారతదేశానికి పూర్తిస్థాయిలో హక్కులు ఉన్నాయి. ఉగ్రవాదులకు, వారికి మద్దతు ఇచ్చే వారిని వేరువేరుగా చూడము.. డాలర్ల మీద, పౌండ్ల మీద భారతదేశం ఆధారపడదు. ఆత్మ నిర్భర్ భారత్ ద్వారా స్వీయ సమృద్ధి సాధించామని" నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. "కొంతమంది వ్యక్తులు మన దేశ రాజ్యాంగాన్ని కించపరుస్తున్నారు. మన దేశ వ్యవస్థలను ప్రపంచ వేదికల మీద విమర్శిస్తున్నారు. ఇటువంటి విధానాలను భారత్ చూస్తూ ఊరుకోదు. దేశ ఔన్నత్యాన్ని.. దేశ సౌభాగ్యాన్ని కాపాడే బాధ్యతను మేం తీసుకున్నాం. ఆదే దిశగా అడుగులు వేస్తాం. అంతేతప్ప అడ్డగోలుగా ప్రవర్తిస్తే దానికి తగ్గట్టుగానే ఈ దేశ ప్రజలు సమాధానం చెబుతారు. బ్లాక్ మెయిల్ రాజకీయాలకు భయపడే రోజుల పోయాయి. భారత్ హితం కోసం ఎటువంటి నిర్ణయాలైనా తీసుకుంటాం. ఒక పట్లగా వెనుకంజ వేసే రోజులు కావు ఇవి. ఈ దేశం కోసం ఏం చేయాలో మాకు తెలుసు. ఈ దేశం కోసం ఎలాంటి అడుగులు వేయాలో కూడా మాకు తెలుసు అని'' నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు.. అణుబాంబు బెదిరింపులకు భారత్ భయపడదని మోదీ అన్నారు. అది గతంలో నడించిందని.. ఇప్పుడు అటువంటి బ్లాక్‌మెయిల్స్‌కు భారత్ భయపడే ప్రసక్తే లేదని పరోక్షంగా పాక్ ఆర్మీ చీఫ్‌కు మోదీ కౌంటర్ ఇచ్చారు. ఉగ్రవాదం మానవాళి మనుగడే ముప్పు అని వ్యాఖ్యానించారు. సింధూ నీళ్లు కేవలం మన దేశ రైతులకు మాత్రమేనని తేల్చి చెప్పారు. ఎప్పటికీ నీరు, రక్తం కలిసి ప్రవహించవని అన్నారు. " సింధూ నది విషయంలో మరో మాట లేదు. వాటిని పాక్ కు ఇచ్చే ప్రసక్తే లేదు. దేశంలో నీటి కొరత ఉన్న ప్రాంతాలకు ఆ నీటిని తరలిస్తాం. సింధూ నదిపై సంపూర్ణ అధికారం భారత్‌దే. దీనిపై ఎప్పటికీ చర్చలు జరిపేది లేదు" అని మోదీ స్పష్టం చేశారు. భారత్ ఏ దేశానికి తీసిపోకూడదని ప్రధాని మోదీ అన్నారు. ఎవరినీ తక్కువ చేయడానికి మన శక్తిని వృథా చేయకూడదు. మనం మన మార్గాన్ని మరింత విస్తృతం చేసుకోవాలని దేశ ప్రజలకు సూచించారు. మనం మన మార్గాలను పెంచుకుంటే, ప్రపంచం కూడా మనల్ని గౌరవిస్తుంది. ప్రపంచంతో పోటీ పెరుగుతున్నప్పుడు, ఆర్థిక స్వార్థం పెరుగుతుందన్నారు. మనం సంక్షోభాల సమయంలో కుంగిపోకుండా ధైర్యంగా ముందుకు సాగాలని మోదీ పిలుపునిచ్చారు. మనం ఓ మార్గాన్ని ఎంచుకుంటే, ఏ స్వార్థం మనల్ని వెనక్కి లాగలేదన్నారు. గత దశాబ్దంలో సంస్కరణ, పనితీరు బాగా రూపాంతరం చెందింది, కానీ ఇప్పుడు మరింత ఎదగాలంటే, అభివృద్ధి చెందాలంటే మనం మరింత కొత్త శక్తితో ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు 'నయా భారత్' అనే థీమ్‌తో జరుగుతున్నాయి. ఇది 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధించాలనే భారత ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆపరేషన్ సిందూర్ విజయాన్ని హైలైట్ చేస్తున్నాయి. జ్ఞానపథ్‌లో, వ్యూ కట్టర్‌లో ఆపరేషన్ చిహ్నం ఉంది. దాని థీమ్‌తో ప్రేరణ పొందిన ఫ్లవర్ ప్రజెంటేషన్ ప్రదర్శనలతో ఇది పూర్తి చేస్తారు. ఎర్రకోటలో ప్రసంగించే ముందు, ప్రధాని మోదీ కూడా చీలో పోస్ట్ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 'వికసిత్ భారత్' కోసం ఒక విజన్‌ను షేర్ చేసుకుంటూ ప్రధాని మోదీ ఇలా రాసుకొచ్చారు. "అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. ఈ రోజు మనం స్వాతంత్ర్య సమరయోధుల కలలను సాకారం చేయడానికి, 2047 నాటికి వికసిత్ భారత్‌ను నిర్మించడానికి మరింత కష్టపడి పనిచేయాలి. అమరవీరుల త్యాగాలు మనల్ని ప్రేరేపించాలని కోరుకుంటున్నాను. జై హింద్!" అని మోదీ పోస్ట్ చేశారు.

స్వల్పకాలిక విద్యుత్ కొనుగోళ్లకు ఈపీఎంఎస్ విద్యుత్ కొనుగోళ్ల వ్యయం తగ్గించేలా కొత్త విధానం

ఎనర్జీ పోర్ట్ ఫోలియో మేనేజ్మెంట్ సిస్టంపై సమీక్షించిన సీఎం చంద్రబాబు

పీఎం సూర్యఘర్ అమలులో నారావారిపల్లెకు స్కోచ్ అవార్డు

అమరావతి : తక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ చేసినప్పుడే వినియోగదారులకు ప్రయోజనం కలుగుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో తక్కువ వ్యయంతో నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా ఎనర్జీ పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలుపై సీఎం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. స్వల్పకాలిక విద్యుత్ కొనుగోలుకు సంబంధించి ఈపీఎంఎస్ విధానం సమర్థంగా పనిచేస్తుందని అధికారులు సీఎంకు వివరించారు. తద్వారా విద్యుత్ కొనుగోళ్లలో డిస్కంలు గణనీయంగా ఆదా చేయగలుగుతాయని తెలిపారు. ఇంట్రా డే, బ్లాక్ వైజ్ కొనుగోళ్ల ద్వారా డిస్కంలకు నిధులు ఆదా అవుతాయని సీఎస్ విజయానంద్ పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సీఎం ఏఐ ఆధారిత డిమాండ్ ఫోర్‌క్యాస్టింగ్, కెపాసిటీ ప్లానింగ్ టూల్స్‌ను ఉపయోగించి ఖచ్చితమైన అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. అలాగే రాష్ట్రంలోని వేర్వేరు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ ప్రణాళికలు రూపొందించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. గత ఏడాది విద్యుత్ కొనుగోళ్లు, వచ్చే ఏడాది అవసరాల అంచనాలను విశ్లేషించి, మార్కెట్ కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహించాలని సీఎం స్పష్టం చేశారు. ఈపీఎంఎస్ ద్వారా డిస్కంలు చేసే కొనుగోలు వ్యయంలో భారీగా ఆదా చేసే అవకాశం ఉన్నట్టు అధికారులు వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , మెషిన్ లెర్నింగ్ లాంటి అధునాతన సాంకేతికత పరిజ్ఞానం ద్వారా డిమాండ్ ఫోర్‌కాస్టింగ్, యూనిట్ కమ్మిట్‌మెంట్, ధరల ఫోర్‌కాస్టింగ్, మార్కెట్ విశ్లేషణ, బిడ్ నిర్వహణ వంటి కీలక అంశాలలో ఈపీఎంఎస్ పరిష్కారాన్ని అందిస్తుందని తెలిపారు.

త్రిశక్తి మాత ఆలయంలో దుర్గా మాత అమ్మవారికి అభిషేకం

కోరుట్ల : జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ఝాన్సీ రోడ్ లో గల గణేశ నవదుర్గా మండలి ఆధ్వర్యంలో శ్రీ త్రిశక్తి మాత ఆలయంలో శ్రావణమాసం నాలుగవ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి విశేష ద్రవ్యాలతో అభిషేకం మరియు చండీ హోమం, అనంతరం శివపార్వతుల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించి,కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణేశ నవదుర్గా మండలి అధ్యక్షులు కటుకం గణేష్ మాట్లాడుతూ శ్రావణమాసం మహిళలకు అతి పవిత్రమైన మాసంగా పిలవబడుతుందని, అందులో భాగంగానే శ్రావణమాసం నాలుగవ శుక్రవారం సందర్భంగా ఆలయంలో లలిత సహస్రనామ పారాయణం నిర్వహించి, అనంతరం శివపార్వతుల కళ్యాణం చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రతి శ్రావణమాసంలో మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో అమ్మవారికి నోములను నోచుకోవడం ఆనవాయితీగా వస్తుందని ఆయన అన్నారు. దేవతలకు అత్యంత ప్రీతికరమైన మాసం. లక్ష్మీదేవి ఎంతో ఇష్టమైన ఈ మాసంలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం దీపారాధన చేయడం వల్ల దీర్ఘ సుమంగళి ప్రాప్తంతో పాటు అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని పెద్దల ఉవాచ: – తిథిలతో కూడా సంబంధం లేకుండా అష్టమి, నవమి, అమావాస్య రోజుల్లో కూడా పూజలు, పండుగలు చేసే మాసం ఈ శ్రావణమాసం మాత్రమే. అందుకే దీన్ని అత్యంత శుభప్రదమైన మాసంగా భావిస్తారు. ఈ శ్రావణమాసంలో శివకేశవులను నిష్టతో అత్యంత భక్తి శ్రద్ధలతో పూజిస్తారని ఆయన అన్నారు. శ్రావణ సోమవారం, శ్రావణ

మంగళవారం, శ్రావణ శుక్రవారం, శ్రావణ శనివారం ఇలా ఈ మాసంలో ప్రతిరోజు విశిష్టతతో కూడుకున్నదే. ఈ మాసంలో చేసే పూజలు విశేషమైన ఫలితాలు ఇస్తాయని భక్తుల నమ్మకం. ఈ శ్రావణమాసంలోనే వ్రతాలు, నోములు, ఉపవాసాలు పూజలు ఆచరిస్తారు. అందుకే ఈ మాసాన్ని ఆధ్యాత్మిక మాసం అని కూడా అంటారని కటుకం గణేష్ వివరించారు. అంతేకాకుండా శ్రావణమాసం మహిళలకు ఎంతో ప్రీతికరమైన పవిత్రమైన మాసం. ఎందుకంటే మహిళలు చేసే వ్రతాలు ఈ నెలలో ఎక్కువగా ఉంటాయి. అందుకే ఈ నెలను వ్రతాల మాసం అని, సౌభాగ్యాన్ని అందించే మాసమని పెద్దలు చెబుతారని కటుకం గణేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గణేశ నవదుర్గా మండలి అధ్యక్షులు కటుకం గణేష్, ఉపాధ్యక్షులు ఎలిగేటి సుమన్, ప్రధాన కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్, సహాయ కార్యదర్శి మామిడిపల్లి రమేష్, కోశాధికారి అడువాల ప్రభాకర్, గజ్జల శంకర్, గాజుల రమేష్, చింతకింది సత్యనారాయణ, ముల్క గంగాధర్ కార్తీక్, అర్చకులు శివ, అధిక సంఖ్యలో మహిళా భక్తులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఆ ప్రాంతాల్లో భూముల ధరలు రెట్టింపు

హైదరాబాద్ : భూముల మార్కెట్ విలువ పెంపుపై తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ ఓఆర్ఆర్ పరిధిలో ఉన్న స్థిరాస్తుల మార్కెట్ విలువను సవరించాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయించింది. ప్రభుత్వ మార్కెట్ విలువకు, బహిరంగ మార్కెట్ ధరకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసాన్ని తగ్గించడమే ఈ సవరణ ప్రధాన లక్ష్యం. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖపై సమీక్ష నిర్వహించిన వెంటనే ఈ ప్రక్రియను ప్రారంభించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజీవ్ గాంధీ హన్మంతు జిల్లా రిజిస్ట్రార్లు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ మార్కెట్ విలువ సవరణ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), సికింద్రాబాద్ కంటోన్మెంట్, ఇరవై మున్సిపాలిటీలు, ఏడు నగర పాలక సంస్థల పరిధిలో జరగనుంది. జిల్లా రిజిస్ట్రార్ల నివేదిక అందిన వెంటనే కొత్త మార్కెట్ విలువలను అమల్లోకి తీసుకురానున్నారు. నివాస ప్రాంతాల మార్కెట్ విలువ ఒకే తరహాలో నిర్ణయించబడుతుంది. ప్రధాన రహదారుల పక్కన ఉన్న కాలనీలు, బజార్లలోని స్థిరాస్తులను వాణిజ్యపరంగా పరిగణిస్తారు. స్థానిక సంస్థల పరిధిలోకి కొత్తగా వచ్చిన గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి సవరణపై నిర్ణయం తీసుకుంటారు. కొన్నిచోట్ల బహిరంగ మార్కెట్ విలువ కన్నా ప్రభుత్వ మార్కెట్ విలువ ఎక్కువగా ఉందని ఫిర్యాదులు రావడంతో, అటువంటి ప్రాంతాల్లో వాస్తవ విలువను నమోదు చేయాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశించారు. ఓఆర్ఆర్ లోపల, వెలుపల ప్రాంతాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు 60 శాతం రాబడి వస్తోంది. ఈ మార్కెట్ విలువ సవరణ ద్వారా ప్రభుత్వానికి అదనంగా దాదాపు రూ.2 వేల కోట్ల వరకు ఆదాయం పెరిగే అవకాశం ఉందని అంచనా. మేడ్చల్, నాగారం, పోచారం, తూముకుంట, ఆదిభట్ల, జల్‌పల్లి, దమ్మాయిగూడ, దుండిగల్, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, కొంపల్లి, మణికొండ, నార్సింగి, పెద్ద అంబర్‌పేట, శంషాబాద్, అమీన్‌పూర్, బొల్లారం, తెల్లాపూర్, తుక్కుగూడ, తుర్కయాంజల్ మున్సిపాలిటీల్లో మార్కెట్ విలువ పెంచనున్నారు. నిజాంపేట, ఫీర్జాదిగూడ, బోడుప్పల్, జవహర్‌నగర్, బడంగ్‌పేట, మీర్‌పేట, బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్లలోనూ పెంపు ఉంటుంది.

మరో 6 నెలలు పొడిగింపు

కరీంనగర్ : ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పొడగించిన పదవీకాలం ముగిసింది. ప్రభుత్వం మరోమారు ఆరు నెలలపాటు పొడగిస్తూ జీవో ఎంఎస్ నెం. 836ను జారీ చేసింది. కరీంనగర్ సహకార కేంద్ర బ్యాంకు పరిధిలో ఉన్న నాలుగు జిల్లాల్లోని 131 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పదవీకాలం మరో ఆరు నెలలు కొనసాగుతుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 131 పీఏసీఎస్లకు 2020 ఫిబ్రవరి 12న ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత సహకార సొసైటీల పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వీటి ఐదేళ్ల గడువు ఈ సంవత్సరం ఫిబ్రవరి 13న ముగియగా, ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లకుండా ఆరు నెలల పదవీకాలం పొడగించింది. ఈ ఆరు నెలల పదవీకాలం గురువారం ముగియగా మరోమారు పొడగించడంతో సహకార సంఘాల ఎన్నికలను ప్రభుత్వం ఇప్పట్లో నిర్వహించే ఆలోచనలో లేనట్లు స్పష్టమయింది. కరీంనగర్ జిల్లాలో 30, జగిత్యాల జిల్లాలో 51, రాజన్న సిరిసిల్లలో 22, పెద్దపల్లి జిల్లాలో 28 పిఎసిఎస్ లు ఉన్నాయి. జిల్లాల పునర్విభజన అనంతరం కూడా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉమ్మడి జిల్లా పరిధిలో కొనసాగుతుంది. జిల్లా పరిషత్, మండల పరిషత్ ల విభజన జరిగింది కానీ, అప్పటి ప్రభుత్వం ఆర్బీఐ నుండి ప్రత్యేక చట్టం తీసుకురాకపోవడంతో ఉమ్మడి జిల్లా పరిధిలోనే నేటికి కొనసాగుతూ వస్తుంది. అయితే సొసైటీల బలోపేతం, సహకార సంఘాల వ్యవస్థ పటిష్టతకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిన నేపథ్యంలో ఎన్నికలు ఇప్పుడే నిర్వహించే ఆలోచన చేయకుండా పదవీకాలం పొడగించింది. ఈ పదవీకాలం పొడగింపు ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్న ఎక్కువ మంది పీఏసీఎస్ చైర్మన్లు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డైరెక్టర్ల పదవులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వారే కొనసాగనున్నారు. కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధ్యక్షునిగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన గంభీరావుపేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ కొండూరి రవీందర్ రావు కొనసాగుతున్నారు. ఆయన బీఆర్ఎస్ హయాంలో టెస్కాబ్ తెలంగాణ సహకార సంఘం అధ్యక్షునిగా కొనసాగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులు కొనసాగిన అనంతరం ఆయనపై అవిశ్వాసానికి టెస్కాబ్ డైరెక్టర్లు సిద్ధం కావడంతో ఆయన ఆ పదవికి రాజీనామా చేశారు. ఆయన ప్రస్తుతం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధ్యక్షునిగా సేవలు కొనసాగిస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి ఉన్నప్పటికి ప్రభుత్వ ఉత్తర్వు ద్వారా ఆయనకు మరో ఆరు నెలలు చైర్మన్ గా పనిచేసే అవకాశం దక్కింది. ప్రస్తుతం 42 శాతం బీసీ రిజర్వేషన్ల వ్యవహారం నడుస్తుండడు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ రిజర్వేషన్ అమలుచేసి కాంగ్రెస్ జెండా ఎగురవే యాలని చూస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో తొలుత సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికలు నిర్వహించి తదనంతరం సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకే పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడగించింది

అంబేద్కర్ కోనసీమలో అరుదైన ఆనంద ఘట్టం

- ఒకే కాన్పులో ముగ్గురు శిశువులకు జన్మ

కొత్తపేట : అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలోని భాస్కరా పిల్లల ఆసుపత్రిలో అరుదైన సంఘటన చోటుచేసుకుంది. అమలాపురం ఈదరపల్లికి చెందిన కుంపట్ల దుర్గ – సతీష్ దంపతులకు పెళ్లయి రెండు సంవత్సరాలైనా సంతానం కలగలేదు. తదుపరి, వారు కొత్తపేటలోని భాస్కరా చిల్డ్రన్స్ ఐవీఎఫ్ ఆసుపత్రి డాక్టర్ ప్రదీప్తి కరణను సంప్రదించగా, ఆమె వైద్యంతో గర్భధారణ సాధ్యమైంది. స్కానింగ్లో ఒకే గర్భంలో ముగ్గురు పిల్లలు ఉన్నట్లు గుర్తించి, ఇది కొంత ప్రమాదమని వైద్యులు హెచ్చరించారు. అయితే తల్లిదండ్రులు ధైర్యంగా ముందుకు వచ్చారు. ఎనిమిదో నెలలో నొప్పులు రావడంతో, డాక్టర్ ప్రదీప్తి కరణ బృందం ఆపరేషన్ చేసి సురక్షితంగా ముగ్గురు పసికందులను బయటకుతీశారు. మొదట అమ్మాయి. తరువాత అబ్బాయి. చివరిగా అమ్మాయి పుట్టింది. ప్రస్తుతం తల్లి, పిల్లలు క్షేమంగా ఉన్నారు. పిల్లలను అదే ఆసుపత్రిలోని పిల్లల వైద్యులు మెంటే శ్రీధర్ ప్రత్యేక పర్యవేక్షణలో పరిశీలిస్తున్నారు. ఇదే ఆసుపత్రిలో గతంలో కూడా ఒకే కాన్పులో ముగ్గురు అమ్మాయిలు పుట్టిన సంఘటన చోటుచేసుకుంది. తాజాగా ముగ్గురు పిల్లలు పుట్టడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొండపల్లిలో ఉపముఖ్యమంత్రి భట్టి పర్యటన

మైలవరం : మైలవరం నియోజకవర్గం కొండపల్లిలోని ఏపీహెచ్ఎంఈఎల్ ను తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సందర్శించారు. ఇరు రాష్ట్రాల ప్రయోజనాల కోసం సంస్థను ఎలా సద్వినియోగం చేయాలో చర్చించారు. సంస్థ అభివృద్ధికి కన్సల్టెన్సీని నియమించి, స్థానిక పరిస్థితులపై నివేదిక తెప్పించుకుని నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. థర్మల్ పవర్ స్టేషన్లకు అవసరమైన యంత్రాలు, మరమ్మత్తుల కోసం మార్పులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఏపీహెచ్ఎంఈఎల్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు కొండపల్లిలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఘన స్వాగతం పలికారు. ఆయనకు శాలువా కప్పి, శ్రీవారి బొమ్మను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించి, వరద బాధితులకు సహాయక చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. పునరావాస ఏర్పాట్లు పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించి, వరద బాధితులకు సహాయక చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. పునరావాస ఏర్పాట్లు పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులతో పరిస్థితిని సమీక్షించారు.

కిసాన్ డ్రోన్లను పంపిణి చేసిన మంత్రి డోలా

ఒంగోలు : ఒంగోలు కొండపి నియోజకవర్గం, టంగుటూరు మండలం తూర్పు నాయుడు పాలెం గ్రామంలో మంత్రి డోలావీరాంజనేయ స్వామి కిసాన్ డ్రోన్ లను పంపిణీ చేశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జరుగుమల్లి మండలం, చతుకుపాడు గ్రామంలోని తారక రామ సి.హెచ్.సి గ్రూపుకు కిసాన్ డ్రోన్ ను అందించారు. ఈసందర్భంగా డ్రోన్ పనితీరును మంత్రి పరిశీలించారు. కిసాన్ డ్రోన్ తో అనేక ప్రయోజనాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీసుల అదుపులో జాయ్ జమీనా

విశాఖపట్నం : జాయ్ జమీమా కేరాఫ్ వైజాగ్. అందంతో వల వేసి లోకల్ నుంచి ఎన్ఐఆర్ల వరకు ఉచ్చులో దింపి వసూళ్లకు పాల్పడే జమీమా మళ్లీ అరెస్ట్ అయింది. ఇప్పుడు పోలీసుల రిమాండ్‌లో ఉంది. విశాఖలోని నాలుగు వేర్వేరు పీఎస్‌లలో జమీమాపై కేసులు నమోదయ్యాయి. ఈ మధ్యే బెయిల్‌పై విడుదలైన జమీమాను, మరోసారి అరెస్ట్ చేశారు పోలీసులు. జమీమా బాధితులు విశాఖతోపాటు ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల్లో కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ఆమె వల్ల జీవితాలు నాశనం అయ్యాయని.. కొందరు ఆత్మహత్యయత్నాలు కూడా చేసినట్లు తమ వద్ద సమాచారం ఉందంటున్నారు పోలీసులు. సమాజంలో మర్యాద పోతుందని ఇంకా చాలామంది బాధితులు ఫిర్యాదు చేసేందుకు జంకుతున్నారని.. వారు బయటకు వస్తే వివరాలు గోప్యంగా ఉంచి.. ఆమెపై కేసు నమోదు చేస్తామని.. విశాఖ సీపీ శంకబ్రత బాగ్చి వెల్లడించారు.

గురుకుల విద్యార్థులకు ఫుడ్ పాయిజన్

హిందూపురం : శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో గురుకుల విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయింది. హాస్టల్‌లో అల్పాహారం తిన్న 10 మంది విద్యార్థులకు వాంతులు, విరోచనాలు అయ్యాయి. తీవ్ర అస్వస్థతకు గురైన విద్యార్థులను హాస్టల్ సిబ్బంది అంబులెన్స్‌లో హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులకు చికిత్స అందిస్తున్నారు. విద్యార్థులకు క్వాలిటీ ఫుడ్ అందించాలని ప్రభుత్వానికి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

జగన్-అమిత్‌షాల మధ్యే హాట్‌లైన్: మాణిక్యం మాట

కడప : ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్యం ఠాకూర్‌పై వైసీపీ అధినేత జగన్ చేసిన విమర్శలు తెలిసిందే. రాష్ట్రంలో చంద్రబాబు పాలన, అవినీతి, అక్రమాలు ఆయనకు కనిపించడం లేదని.. తాను మాత్రమే మాణిక్యానికి కనిపిస్తున్నారని బుధవారం జగన్ విమర్శించారు. అంతేకాదు.. రాష్ట్రంలో ఓటు బ్యాంకు పై కూడా వారు ప్రశ్నించడం లేదన్నారు. రాహుల్‌గాంధీకి- చంద్రబాబుకు మధ్య హాట్‌లైన్ కొనసాగుతోందని, అందుకే మౌనంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. అయితే.. ఈవ్యాఖ్యలపై మాణిక్యం ఠాకూర్ తాజాగా రియాక్ట్ అయ్యారు. అసలు హాట్‌లైన్ సంభాషణలు.. హాట్‌లైన్ వ్యవహారాలకు కేంద్రం వైసీపీనేనని వ్యాఖ్యానించారు. అమిత్ షాతో జగన్ అనేక సార్లు హాట్‌లైన్‌లో సంభాషించారని చెప్పుకొచ్చారు. తమకు, తమ నాయకుడు రాహుల్ కు హాట్‌లైన్ తో పనిలేదని వ్యాఖ్యానించారు. ఏదైనా ధైర్యంగా ప్రశ్నించే తత్వం తమకు మాత్రమే ఉందన్నారు. కేంద్రంలోని మోడీ, అమిత్‌షాలు ఎన్నికల సంఘంతో కుమ్మక్కయ్యారని తాము చేస్తున్న విమర్శలకు స్ప

కిష్వార్‌లో 50కు చేరిన మృతులు

సిమ్లా : హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ తరువాత ఇప్పుడు జమ్మూ కాశ్మీర్‌లో మేఘాల విస్ఫోటనం పెద్ద విపత్తును సృష్టించింది. గురువారం జమ్మూ కాశ్మీర్‌లోని కిష్వార్‌లోని చషోటి ప్రాంతంలో మేఘాల విస్ఫోటనం కారణంగా సంభవించిన వరదలో 46 మంది మరణించారు. ఇందులో ఇద్దరు అమాఈ జవాన్లు కూడా ఉన్నారు. దీనితో పాటు, 200 మంది తప్పిపోయినట్లు సమాచారం. కిష్వార్‌లో మేఘాల విస్ఫోటనం సంభవించింది. రెండు నిమిషాల్లోనే మచైల్ మాతా ఆలయ తీర్థయాత్ర మార్గంలో రాళ్ళు , శిధిలాల వరద వచ్చింది. ఎక్కడ ఉన్న వారు అక్కడే సమాధి అయ్యారు లేదా శిధిలాల కింద చిక్కుకున్నారు. ప్రజలు ఆలోచించడానికి, అర్థం చేసుకోవడానికి ఎటువంటి అవకాశం రాలేదు.పోలీసు-పరిపాలన నిరంతరం సహాయక చర్యలు చేపడుతోంది. మచైల్ మాతా మందిరం సమీపంలోని అనేక మందిని విపత్తు నిర్వహణ బృందాలు రక్షించాయి. ఈ ప్రమాదంలో 100 మంది గాయపడ్డారు. వారిలో 37 మంది పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిని కిష్వార్ జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. పద్దర్ ఉప జిల్లా ఆసుపత్రిలో దాదాపు 70 నుంచి 80 మంది చికిత్స పొందుతున్నారు. సంఘటన స్థలం నుంచి పెద్ద రాళ్ళు, కూలిపోయిన చెట్లు, విద్యుత్ స్తంభాలను తొలగించడానికి ఎక్స్కవేటర్ల యంత్రాల సహాయం తీసుకుంటున్నారు.ఈ ఆలయం 9500 అడుగుల ఎత్తులో ఉంది. మచైల్ మాతా ఆలయానికి వెళ్లే దారిలో చషోటి గ్రామంలో మధ్యాహ్నం ఈ విపత్తు సంభవించింది. ప్రమాదం జరిగిన సమయంలో మచైల్ మాతా యాత్ర కోసం భారీ సంఖ్యలో భక్తులు చేరుకున్నారు. కిష్వార్ అదనపు ఎస్పీ ప్రదీప్ సింగ్ మాట్లాడుతూ.. ఇది చాలా దురదృష్టకర సంఘటన అని చెప్పారు. ఉదయం నుంచి మేము సహాయక చర్యలు చేపట్టామని చెప్పారు. ఇప్పటివరకు 45 మందికి పైగా మరణించారు. 100 మందికి పైగా గాయపడ్డారు. దాదాపు 200 మంది ఇప్పటికీ కనిపించడం లేదు. 9500 అడుగుల ఎత్తులో ఉన్న మచైల్ మాతా ఆలయానికి చేరుకోవడానికి భక్తులు మోటారు వాహనం ద్వారా మాత్రమే చషోటి గ్రామానికి చేరుకోవాలి. ఆ తర్వాత వారు 8.5 కి.మీ. కాలినడకన ప్రయాణించాలి. పరిపాలన శాఖ అధికారులు ప్రజలకు హెచ్చరిక జారీ చేశారు. సెర్చ్ లైట్లు, తాళ్లు, తవ్వకం సాధనాల రూపంలో సహాయ సామగ్రిని ముందుకు తీసుకెళ్తున్నారు.ఈ విపత్తు ఎప్పుడు సంభవించింది? గురువారం మధ్యాహ్నం 12:25 గంటలకు మచైల్ మాతా మందిర్‌కు వెళ్లే దారిలో చషోటి గ్రామంలో ఈ విషాదం సంభవించింది. ప్రమాదం జరిగిన సమయంలో మచైల్ మాతా మందిర యాత్ర కోసం భారీ సంఖ్యలో ప్రజలు ఆ ప్రదేశంలో చేరుకున్నారు. జూలై 25న ప్రారంభమైన ఈ

యాత్ర సెప్టెంబర్ 5న ముగియాల్సి ఉంది.కిష్వార్ నగరానికి దాదాపు 90 కి.మీ దూరంలో ఉన్న చాషోటి గ్రామంలో మాత భక్తుల కోసం లంగర్ ఏర్పాటు చేశారు. ఈ విపత్తు లంగర్‌లోని కమ్యూనిటీ కిచెన్‌ను ఎక్కువగా ప్రభావితం చేసింది. మేఘావృతం కారణంగా, అకస్మాత్తుగా వరదలు సంభవించాయి. దుకాణాలు, భద్రతా పోస్టుతో సహా అనేక భవనాలు కొట్టుకుపోయాయి.ఆకస్మిక వరదల కారణంగా 16 నివాస గృహాలు, ప్రభుత్వ భవనాలు, మూడు దేవాలయాలు, నాలుగు విండ్‌మిల్లులు, 30 మీటర్ల పొడవైన వంతెన, డజనుకు పైగా వాహనాలు దెబ్బతిన్నాయి.కార్యక్రమాలను రద్దు చేసుకున్న ఒమర్ అబ్దుల్లా ఈ విషాదం తర్వాత జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా 15వ తేదీన జరగాల్సిన ఎట్ హోమ్ టీ పార్టీని రద్దు చేసుకున్నారు. దీనితో పాటు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఆయన రద్దు చేశారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం, పోలీసులు, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం, సైన్యం, స్థానిక స్వచ్ఛంద సేవకులు సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నారు. సెర్చ్ లైట్లు, తాళ్లు, తవ్వకం సాధనాల రూపంలో సహాయ సామగ్రిని ముందుకు పంపుతున్నారు.పరిస్థితిపై అరా తీసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా కిష్వార్‌లో జరిగిన మేఘాల విస్ఫోటనం ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా విచారం వ్యక్తం చేశారు. జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్, ముఖ్యమంత్రితో ఆయన మాట్లాడి, సాధ్యమైనంత సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. పరిపాలన సహాయమ కార్యకలాపాలను చేపడుతోంది. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. కిష్వార్ జిల్లాలో జరిగిన మేఘాల విస్ఫోటనం ఘటనపై లెఫ్టినెంట్ గవర్నర్, జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రితో మాట్లాడినట్లు షా 'చీ'లో తెలిపారు. స్థానిక పరిపాలన సహాయ కార్యకలాపాలను నిర్వహిస్తోంది. ఔఆఖీఈ బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నాయి.

పాలేరు పొంగింది

ఖమ్మం : కొద్దిరోజులుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విపరీతంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎగువ ప్రాంతాలలో కూడా భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరద నీరు విపరీతంగా వస్తున్నది. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని చెరువులు, వాగులు, కుంటలు నిండుగా నీటితో కనిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అయితే మత్తళ్లు దునుకుతున్నాయి. దీంతో రైతులు ఉత్సాహంగా వరి నాట్లు వేస్తున్నారు. వరి నాట్లు పూర్తయిన చోట కలుపులు తీస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రధాన నీటి వనరులలో ఒకటి పాలేరు రిజర్వాయర్. కృష్ణా నీటిని నిల్వ చేసేందుకు ఈ రిజర్వాయర్ నిర్మించారు. ఈ రిజర్వాయర్ కు నాగార్జునసాగర్ నుంచి నీరు వస్తుంది. ఈ నీటి ద్వారా పాలేరు, ఖమ్మం, మధిర నియోజకవర్గాలకు తాగునీరు అందుతుంది. కల్లూరు, బోనకల్, పాలేరు, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, పెనుబల్లి, తల్లాడ, కొణిజర్ల వంటి మండలాల్లోని పంట పొలాలకు సాగునీరు అందుతుంది. ఈ రిజర్వాయర్ కు కృష్ణానది నుంచి మాత్రమే కాకుండా.. చుట్టుపక్కల ప్రాంతాల్లో వర్షాలు కురిస్తే వచ్చే వరదతో కూడా నిండుతుంది.. పాలేరు రిజర్వాయర్ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నిండింది. నిండడం మాత్రమే కాదు అలుగు కూడా పారుతోంది. ఈ రిజర్వాయర్ పరిధిలో వేలాది ఎకరాల ఆయకట్టు ఉంది. ఆ ఆయకట్టుకు ఈ సంవత్సరం ఢోకా లేకుండా పోయింది.రిజర్వాయర్ అలుగుపడుతున్న నేపథ్యంలో పక్కనే ఉన్న నాయకన్ గూడెం ఏరులో ఆ నీరు ప్రవహిస్తోంది. దీంతో ఖమ్మం జిల్లా పోలీసులు అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎందుకంటే నాయకన్ గూడెం నుంచే సూర్యాపేట, దాని మీదుగా హైదరాబాద్ వెళ్లాల్సి ఉంటుంది. గతంలో నాయకన్ గూడెం ఏరు పారుతున్న సమయంలో ప్రమాదాలు జరిగాయి. ఈసారి అటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండడానికి అక్కడి పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.. పాలేరు అలుగు పోస్తున్న నేపథ్యంలో.. ఆ దృశ్యాలను చూసేందుకు పర్యాటకులు వస్తున్నారు.

పులివెందుల ఒంటిమిట్ట జడ్పిటిసి ఉప ఎన్నికల్లో

ప్రజాస్వామ్యాన్ని కుని చేశారు

- విలేకరుల సమావేశంలో బుట్టా రేణుక

ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు పట్టణంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ నియోజకవర్గ ఇంచార్జ్,మాజీ పార్లమెంట్ సభ్యురాలు బుట్టా రేణుక మీడియా సమావేశంలో మాట్లాడుతూ, పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా ఖుని చేసిన విధానంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.శ్రీ, ఎన్నికలను సజావుగా నిర్వహించాల్సిన ఎలక్షన్ కమిషన్, శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు, నిష్పాక్షికంగా వ్యవహరించాల్సిన పోలింగ్ సిబ్బంది అంతా కలిసి అధికార పక్షానికి మద్దతుగా వ్యవహరించారని ఆరోపించారు. పోలింగ్ బూత్‌లలో జరిగిన వెబ్‌కాస్టింగ్, సీసీ ఫుటేజ్ ఇవ్వాలని పదే పదే కోరినా, పట్టించుకోవడం లేదని, ఇది ఎన్నికల్లో జరిగిన అక్రమాల స్థాయిని స్పష్టంగా చూపిస్తుందని పేర్కొన్నారు.న్యూట్రల్ మీడియా ప్రతినిధులను పోలింగ్ గ్రామాల్లోకి అనుమతించకపోవడమే కాకుండా, అధికార పక్షం చేసిన రిగ్గింగ్‌ను ప్రభుత్వ విడుదల చేసిన వీడియోలు, ఫొటోలు స్పష్టంగా రుజువు చేస్తున్నాయని చెప్పారు.

పులివెందులలో వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల హేమంతరెడ్డి కి ఓటు వేయనివ్వకపోవడం, అభ్యర్థిని తెల్లవారుజామునే గృహనిర్బంధం చేయడం వంటి చర్యలు ప్రజాస్వామ్యంపై దాడికి నిదర్శనమని విమర్శించారు.కడప ఎంపీ వై.ఎస్. అవినాష్ రెడ్డి ని కూడా అనారోగ్యం ఉన్నా, చెప్పులు వేసుకునే సమయం కూడా ఇవ్వకుండా, బలవంతంగా ఇంటి నుండి లాక్కెళ్లారని, దీనిపై డీఐజీ కోయ ప్రవీణ్ ఇచ్చిన సమాధానం అత్యంత బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. పులివెందులలో వైయస్సార్ కాంగ్రెస్ నాయకులపై దాడులు, హత్యాయత్నాలు జరిగి కూడా పోలీసులు కేవలం చూశారే తప్ప చర్యలు తీసుకోలేదని, గాయపడిన వారిపైనే కేసులు పెట్టారని విమర్శించారు.ఒంటిమిట్టలో కూడా విపక్ష ప్రచారాన్ని అడ్డుకోవడం, ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల్లోకి రానివ్వకపోవడం, అభ్యర్థులకే ఓటు వేయనివ్వకపోవడం వంటి ఘటనలు జరిగినట్లు ఆమె తెలిపారు. మంత్రి రాంప్రసాదరెడ్డి గారు పోలింగ్ నియమావళి ఉల్లంఘిస్తూ అన్ని కేంద్రాలు తిరగడం, ఆయన సమక్షంలోనే వైయస్సార్ కాంగ్రెస్ ఏజెంట్లపై దాడులు జరగడం, పోలీసులు మౌనం వహించడం ప్రజాస్వామ్యానికి నల్ల మచ్చ అని అన్నారు.ఫలితాలను ప్రకటించడంలో హడావిడి చేయడం, హైకోర్టు విచారణకు ముందే వేగంగా కౌంటింగ్ ముగించడం కూడా అనుమానాస్పదమని పేర్కొన్నారు. సీసీ ఫుటేజ్, వెబ్‌కాస్టింగ్ బయట పెట్టడానికి ఎందుకంత భయమని ప్రశ్నించారు.

సింగిల్ విండో ఎన్నికలెప్పుడు?

నిజామాబాద్ : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గాల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో ఆ పాలకవర్గ పోస్టులను నామినేటెడ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయాలని భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.రాష్ట్రవ్యాప్తంగా 905 సొసైటీలో ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలు నిర్వహించి, చైర్మన్ తో పాటు డైరెక్టర్లను ఎన్నుకుంటారు. ప్రస్తుతం నడుస్తున్న పాలకవర్గం పదవీకాలాన్ని ఇదివరకే పొడిగించారు. అయితే ఈ పదవీకాలం మరో 6 నెలల పాటు పొడిగించే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ లోపు నామినేటెడ్ పద్ధతిలో పాలక ఏర్పాటుకు అవసరమైన చర్యలకు ఉపక్రమించవచ్చని తెలుస్తోంది. ఈ పద్ధతి ఏపీ లో ఇదివరకే కొనసాగిస్తున్నారు. ఎన్నికల ద్వారా పాలకవర్గాన్ని గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. వారే ప్రస్తుతం కొసాగుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం పాలకవర్గ చైర్మన్లు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి చేరారు. సొసైటీ ఎన్నికల్లో పోటీ చేసి గెలవడం కన్నా, నామినేటెడ్ పోస్టుల ద్వారా పదవి దక్కించుకోవడమే మంచిదని వారిలో కొంతమంది అభిప్రాయపడుతున్నారు. నామినేటెడ్ ద్వారా అయితే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎక్కువ కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు అవకాశముంటుందని పార్టీ నాయకులు సైతం సూచిస్తున్నారు. మార్కెట్ కమిటీ ల మాదిరిగా సొసైటీలకు కూడా రిజర్వేషన్ పద్ధతిలో పదవులను పంపిణీ చేయడం వల్ల పార్టీ నాయకులకు, మద్దతుదారులకు లాభం చేకూరుతుందని భావిస్తున్నారు. నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్న వారితో పాలకవర్గాన్ని భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే ఆ పదవులను పొందేందుకు సొసైటీలలో సభ్యత్వం ఉన్న విపక్ష మద్దతుదారులు కాంగ్రెస్ గడప తొక్కేందుకు ఆస్కారం ఉంటుందని భావిస్తున్నారు. ఆ విధంగా కూడా విపక్షాలకు మద్దతు పలికే వారిని తనవైపుకు తిప్పుకోవచ్చని వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఏదో రూపంలో ఎన్నికలు రావాలని ఎదురుచూస్తున్న విపక్షాలు మాత్రం ఈ విషయంలో ఏ రకంగా స్పందించాలి అనే విషయంలో తర్జనభర్జన పడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న విపక్షాలు పీఏసీఎస్ గురించి ప్రస్తుతం పట్టించుకునే స్థితిలో లేరని తెలుస్తోంది.రుణాలు చెల్లించని కారణంగా దాదాపు 14 లక్షల మంది ఓటర్లు ఓటు వేసే, పోటీ చేసే హక్కును కోల్పోయారు. రాష్ట్రవ్యాప్తంగా 905 సొసైటీలో ఉన్న 32,99,088 మంది ఓటర్లలో, 13,98,257 మంది ఓటర్లు బకాయిలు చెల్లించని కారణంగా ఓటు వేసే లేదా పోటీ చేసే హక్కులను కోల్పోయారు. దీని ఫలితంగా ఓటర్ల సంఖ్య గణనీయంగా 43% తగ్గి 19,00,831కి చేరుకుంది.

ఆర్థిక ఇబ్బందులు కాకుండా, లక్షలాది మంది రైతులు రుణ బకాయిలు తిరిగి చెల్లించకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన రుణమాఫీ కోసం ఎదురుచూడటమే కారణమని, అప్పటి అధికార పార్టీ కేవలం తమ అభ్యర్థులను నామినేట్ చేయడం ద్వారా ఎన్నికల్లో గెలవడంపై మాత్రమే దృష్టి పెట్టిందనే విమర్శలు వచ్చాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఏవిధంగా వ్యవహరిస్తుందో వేచి చూడాలి.

మూసీకి పోటెత్తిన వరద

వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు హైదరాబాద్‌లోని జం ట జలాశయాల్లో ఒకటైన హిమాయత్ సాగర్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరు తోంది. గురువారం ఉదయం నుంచి వరద ప్రవాహం అంతకంతకూ పెరగడంతో, అధికారులు మొదట 11 గేట్లను ఎత్తి నీటిని మూసీ నదిలోకి వదిలారు.సాయంత్రానికి ఇన్‌ఫ్లో 9000 క్యూసెక్కులు కొద్దిగా తగ్గడం తో రెండు గేట్లను మూసివేశారు. ప్రస్తుతం 9 గేట్లను నాలుగు అడుగుల మేర ఎత్తి, 12,042 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో మూసీ నదికి ఒక్కసారిగా వరద పోటెత్తింది. ఉగ్రరూపం దాల్చి న మూసీ పరివాహక ప్రాంతాలను ముంచెత్తింది. దీంతో ముసారాంబాగ్, జియాగూడ ప్రాంతాల్లోని ప్రధాన రహదా రులను మూసివేశారు.మూసీ ఉధృతికి మూసానగర్, శంకర్ నగర్ బస్తీలు నీట మునిగాయి. ఈ రెండు ప్రాంతాల్లో కలిపి 127 ఇళ్లలోకి వరద నీరు చేరింది. జీహెచ్ ఎంసీ, రెవెన్యూ, డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి సహాయ క చర్యలు చేపట్టాయి. ముసానగర్‌లోని 110 మందిని, శంకర్ నగర్‌లోని 290 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.వీరి కో సం సమీపంలోని కమ్యూనిటీ హాళ్లు, ప్రభు త్వ పాఠశాలల్లో మొత్తం ఆరు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంకా వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నవారు ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు రావాలని అధికారులు మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

రహదారుల మూసివేత

మూసీ వరద ప్రవాహం కారణంగా అధికారులు ముందు జాగ్రత్త చర్యగా పలు ప్ర ధాన రహదారులను మూసివేశారు. మూసీ పై ఉన్న ముసారాంబాగ్ బ్రిడ్జిని పూర్తిగా మూసివేసి, వాహనాలను దారి మళ్లించారు. జియాగూడ నుంచి పురానాపూల్‌కు వెళ్లే రహదారిని కూడా మూసివేశారు. హిమాయత్‌సాగర్ నీటి విడుదల కారణంగా రాజేంద్రనగర్ వద్ద ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపైకి వరద నీరు చేరడంతో, పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి వాహన రాకపోకలను నిలిపివేశారు.మూసీ నదిలో ఉన్న దోభీఘాట్‌లను కూడా మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇదిలా ఉండగా.. నగరంలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, బోరబండ, ఎస్ఆర్ నగర్, సనత్‌నగర్‌తో సహా పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 గేట్లు ఎత్తిన అధికారులు

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నాగార్జునసాగర్ డ్యామ్‌కు జాతీయ జెండాను ప్రతిబింబించేలా మూడు రంగుల రూపంలో విద్యుత్ బల్బులను అమర్చి, నీటిని విడుదల చేశారు. 26 గేట్ల నుంచి మువ్వన్నెల జెండా రంగులతో గురువారం రాత్రి నీటిని విడుదల చేశారు. కాగా నాగార్జునసాగర్‌కు శ్రీశైలం జలాశయం నుంచి 1,72,774 క్యూసెక్కుల వరద ఉధృతి కొనసాగుతున్నది.అధికారులు 26 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 2,03,502 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదలచేస్తున్నారు. పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 587.40 అడుగులవద్ద నీరు నిల్వవుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 305.7464 టీఎంసీల నీరు నిల్వ ఉంది. తెలంగాణలో అత్యంత ప్రసిద్ధి చెందిన మెదక్ జిల్లాలోని ఏడుపాయల వన దుర్గభవాని ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణం శాఖ హెచ్చరికతో పాటు సింగూరు ప్రాజెక్టు నుంచి నీటి విడుదల చేయడంతో మంజీరా నదిలో వరద ప్రవాహం విపరీతంగా పెరిగింది. దీంతో ఆలయం ముందు పాయలో వరద భారీగా ప్రవహిస్తున్నది. దీంతో గురువారం ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. భక్తుల కోసం ఆలయ ప్రధాన ద్వారం వద్ద రాజగోపురంలో దుర్గాభవాని అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్టించారు. ప్రధాన ఆలయం వైపు ఎవరు వెళ్లకుండా బారీకేడ్లు ఏర్పాటు చేశారు.

నిండుకుండలా మారిన ఉస్మాన్ సాగర్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రంగారెడ్డి జిల్లాలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. జిల్లాలో ప్రధానమైన మూసీ, ఈసీ వాగులు ఉధృతంగా పారుతున్నాయి. ఈసీ మొయినాబాద్ మండలం వెంకటపూర్ వద్ద బ్రిడ్జికి ఆనుకొని పారుతోంది. ఉస్మాన్ సాగర్ జలాశయంలోకి కూడా భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. పూర్తిస్థాయి నీటి మట్టం 1,790 అడుగులు కాగా ప్రస్తుతం 1,784.6 అడుగులకు చేరింది. మరో 5.4 అడుగులు చేరితే పూర్తిస్థాయి(3.9 టీఎంసీలు) నీటిమట్టానికి చేరుకుంటుంది.

ప్రస్తుతం మూసీ నుంచి 6,800 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోంది. ఈ వరద ఇలాగే కొనసాగితే నేడో రేపో గేట్లు ఎత్తే అవకాశం కనిపిస్తోంది. చేవెళ్ల డివిజన్ పరిధిలో వాగులు, చెక్ డ్యాములు పొంగిపొర్లుతున్నాయి. కొత్తూరు మండలం గూడూరు గ్రామంలోని రామయ్య చెరువు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంది. కాశన కుంట, చింత్ చెరువు, ఉప్పరవాని కంట, బేస్తవాని కుంట ఇప్పటికే అలుగు పారుతున్నాయి.వరద ఉధృతికి కొందుర్గు గంగన్న గూడెం రహదారిపై పెద్దపెద్ద గుంతలు పడటంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అయ్యవారిపల్లి వాగు ప్రమాదకరం ప్రవహిస్తుండటంతో పలు గ్రామలకు రాకపోకలు స్తంభించాయి. షాద్ నగర్ పరిధిలోని నాగులవల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో వరద పొంగుతుండటంతో ఈ ప్రాంతాలకు కనెక్షన్ కట్ అయ్యింది. వాగుల వద్ద పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి, ప్రజలు వెళ్లకుండా పోలీసులు కాపలా ఉంటున్నారు.ఆమనగల్, కడ్తల, తలకొండపల్లి,మాడుగుల, ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్మెట్, మహేశ్వరం లో ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి. మీర్పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ లో పలు లోతట్టు కాలనీలో నీట మునిగాయి. తుక్కుగూడ శ్రీశైలం,హైదరాబాద్ జాతీయ ప్రధాన రహదారిపై అర్ధరాత్రి నుంచి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది

జూబ్లీహిల్స్ ఎన్నిక గులాబీకే మొగ్గు

హైదరాబాద్ : తెలంగాణలో త్వరలో మరో ఉప ఎన్నిక రాబోతోంది. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. దీంతో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. గతేడాది కూడా కంటోన్‌మెంట్‌కు ఉప ఎన్నిక జరిగింది. ఇది కూడా బీఆర్ఎస్ స్థానమే. కానీ, ఉప ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ గెలిచింది. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్‌ను కూడా తన ఖాతాలో వేసుకోవాలని కాంగ్రెస్ చేస్తోంది. నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా మూడ్ ఆఫ్ ది పబ్లిక్ అండ్ పాపులేషన్ సంస్థ నిర్వహించిన సర్వేలో సంచలన విషయాలు వెలుగు చూశాయి. ఈ సర్వే ప్రకారం, ప్రజల అభిప్రాయాలు, పాలక పార్టీపై సంతృప్తి, అభ్యర్థులు ఎవరే ఆసక్తిని చాలా మంది కనబర్చారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గత 18 నెలలుగా అధికారంలో ఉంది. సర్వే ప్రకారం, రేవంత్ రెడ్డి పరిపాలన, సంక్షేమం, అభివృద్ధి విషయంలో 28.40% మంది మాత్రమే మద్దతు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు మహిళలకు రూ.2500, విద్యార్థులకు స్కూటీ, తులం బంగారం, రూ.4 వేల పెన్షన్, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 2 లక్షల ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇళ్లు అమలులో లోపాలు ఉన్నాయని ప్రజలు భావిస్తున్నారు. 'అప్పులు' అనే సాకుతో ఈ హామీలను నెరవేర్చడంలో విఫలమవుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. జూబ్లీహిల్స్‌లో విద్యుత్ కోతలు, తాగునీటి కొరత, రోడ్ల గుంతలు, వీధి లైట్ల సమస్యలు, పారిశుద్ధ్య లోపాలు ప్రజల అసంతృప్తికి కారణాలుగా నిలుస్తున్నాయి.సర్వే ప్రకారం, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా మాగంటి సునీతమ్మకు 46.60% మంది మద్దతు తెలిపారు. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కుటుంబ సభ్యురాలిగా సునీతమ్మకు సానుభూతి ఓట్లు లభించే అవకాశం ఉంది. గోపీనాథ్ గతంలో ఈ నియోజకవర్గంలో మూడుసార్లు విజయం సాధించడం, స్థానికంగా ఆయనకు ఉన్న పట్టు ఈ అనుకూలతకు కారణం.కాంగ్రెస్ నుంచి అజారుద్దీన్, నవీన్‌యాదవ్ టికెట్ ఆశిస్తున్నారు. ఈ సర్వేలో అజారుద్దీన్‌కు 22.72%, నవీన్ యాదవ్‌కు 15.90% మద్దతు లభించింది. అజారుద్దీన్‌కు ముస్లిం సామాజిక వర్గం నుంచి బలమైన మద్దతు ఉంది, అయితే నవీన్ యాదవ్ కుల, మత, పార్టీలకు అతీతంగా స్థానికంగా మంచి సంబంధాలు కలిగి ఉన్నారు. కాంగ్రెస్‌లోఇద్దరి మధ్య టికెట్ కోసం పోటీ ఉండటంతో కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక కీలకం కానుంది. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి 4.54% మద్దతు ఉండగా, 12.5% మంది తమ అభిప్రాయం వెల్లడించకపోవడం గమనార్హం.సర్వేలో 65.90% మంది బీఆర్ఎస్ మేనిఫెస్టో హామీలను అమలు చేయగల సామర్థ్యం కలిగి ఉందని భావించారు. కాంగ్రెస్‌కు 17.04%, బీజేపీకి 3.40% మద్దతు లభించగా, 13.65% మంది ఈ అంశంపై నిర్ణయానికి రాలేదు. బీఆర్ఎస్ పాలనలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసిన నేపథ్యం ఈ అభిప్రాయానికి బలం చేకూర్చింది. కాంగ్రెస్ హామీలపై ప్రజల్లో నమ్మకం తగ్గడం ఈ ఫలితాల్లో స్పష్టమవుతోంది. ఇక పార్టీల పరంగా చూస్తే బీఆర్ఎస్‌కు 44.91%, కాంగ్రెస్‌కు 37.33% మద్దతు ఉంది. ఇతర పార్టీలకు 0.55%, నోటాకు 0.85% మద్దతు తెలిపారు. కానీ 13.02% మంది తమ అభిప్రాయాన్ని తెలపలేదు. బీఆర్ఎస్‌కు సానుభూతి ఓట్లు, గత పాలన ఘనతలు అనుకూల కారకాలుగా ఉన్నాయి. అయితే, కాంగ్రెస్ అధికారంలో ఉండటం, స్థానిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించుకునే అవకాశం దానికి బలం చేకూర్చుతోంది. ప్రజల్లో ఒక వర్గం 'అధికార పార్టీకి ఓటు వేస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయి' అనే భావనలో ఉంది.

వినూత్న పథకంతో సిక్కిం ప్రభుత్వం

గ్యాంగటక్ : వృద్ధ తల్లిదండ్రుల బాగోగులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న కుమారులు, కుమార్తెలను సిక్కిం ప్రభుత్వం అవార్డుతో సత్కరించనున్నట్లు ప్రకటించింది. ఈ క్రమంలో 77వ స్వాంతంత్ర దినోత్సవం వేడుకలకు ఆ రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 199 మందిని ఎంపిక చేసింది. వీరందరికీ శుక్రవారం 'శ్రవణ్ కుమార్' పేరిట అవార్డులు ప్రదానం చేయనుంది. అలాగే ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున నగదు బహుమతి కూడా అందజేయనున్నట్లు సిక్కిం రాష్ట్ర ముఖ్యమంత్రి తమంగ్ తెలిపారు.ఈ రోజు పాల్జోర్ స్

మాదక ద్రవ్యాలను నిరోదించడంలో ప్రతి ఒక్కరు బాగస్వాములు కావాలి

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ

జగిత్యాల : మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటం కేవలం ఒక వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాక, సామాజిక కర్తవ్యంగా గుర్తిస్తూ, మాదకద్రవ్యాల రహిత సమాజం నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం మేరకు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల పై జరుగుతున్న పోరాటంలో క్రియశిలా భాగస్వామి అవుతానని, డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ, నాతో పాటు ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, మరియు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తాను అని డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేశారు .అంతకుముందు కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమంలో కలెక్టర్ సత్య ప్రసాద్ తో కలిసి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో శశికళా,డీసీఆర్బీ,ఎస్బీ,ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ లు శ్రీనివాస్,ఆరీఫ్ అలీ ఖాన్, రఫిక్ ఖాన్,ఆర్ఐ లు కిరణ్ కుమార్, సైదులు,ఇతర పోలీసు అధికారులు పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, శ్రీ ఆంజనేయ స్వామి

ఆలయాలల్లో సమగ్ర తనిఖీలు

జగిత్యాల : భద్రత చర్యలో భాగంగా జిల్లాలోని ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలలో డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టీమ్ సమగ్ర తనిఖీలు చేశారు.జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడం కోసం ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోంది. ఈ క్రమంలో ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో,కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ (బీడీ) టీమ్ సహకారంతో భద్రతా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సమయంలో ఆలయ ప్రధాన ద్వారం , మండపాలు, భక్తుల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్ స్థలాలు, వసతి గృహాలు మరియు పరిసర ప్రాంతాలను ఒక్కొక్కటిగా పరిశీలించారు.అనుమానాస్పద వస్తువులు, ప్యాకేజీలు, సంచులు లేదా భద్రతకు ముప్పు కలిగించే అంశాలపై ప్రత్యక తనికి నిర్వహించారు.భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాలలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొని తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమైన ఆలయాలు,పుణ్యక్షేత్రాలు,పండుగలు, ప్రత్యేక రోజుల్లో భద్రతా చర్యలు మరింత కట్టుదిట్టం చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజల సహకారంతోనే భద్రతా చర్యలు సమర్థవంతంగా కొనసాగుతాయని అన్నారు.ఎవరైనా అనుమానాస్పద వస్తువులు, వాహనాలు లేదా వ్యక్తులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా 100 నంబర్ కి సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టీమ్‌తో పాటు, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

గణేశ నవదుర్గా మండలి నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

కోరుట్ల : పట్టణంలోని త్రిశక్తి మాత దేవాలయంలో గణేశ నవదుర్గా మండలి కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి దగ్గుల నర్సయ్య బుధవారం ప్రమాణస్వీకారం చేయించారు. గణేశ నవదుర్గా మండలి అధ్యక్షులు కటుకం గణేష్ మాట్లాడుతూ అందరి సంపూర్ణ సహకారంతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. గౌరవ అధ్యక్షులు కట్ట నారాయణ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సభ్యులు ఆలయ అభివృద్ధికి అంకిత భావంగా కృషి చేస్తూ, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గణేశ నవదుర్గా మండలి అధ్యక్షులు కటుకం గణేష్, ఉపాధ్యక్షులు ఎలిగేటి సుమన్, ప్రధాన కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్, సహాయ కార్యదర్శి మామిడిపల్లి రమేష్, కోశాధికారిగా అడువాల ప్రభాకర్, ఎన్నికల అధికారి దగ్గుల నర్సయ్య, సహాయ ఎన్నికల అధికారులు సంకు అశోక్, కటుకం గంగారాం, భోగ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎండి సమీర్ అహ్మద్ ఖాన్, తహసిల్దార్ కోహెడ

కోహెడ : కోహెడ మండలం ప్రజలకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని,అవసరం అయితే తప్ప బయటకు రావద్దని, రైతులు పొలాల దగ్గరకి వెళ్ళినప్పుడు కరెంట్ వైర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలి,భారీ వర్షాలు కురుస్తున్నందున విద్యుత్ స్తంభాలు,వైర్లకు తాకకుండా తగు జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలని ఎండి సమీర్ అహ్మద్ ఖాన్, తహసిల్దార్, కోహెడ తెలిపారు. భారీ వర్షాల వల్ల ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు,వంకలు,చెరువులు వద్ద వరద ప్రవాహం అధికంగా ఉన్న చోట వద్దకి ఎవరు వెళ్లవద్దన్నారు. వర్షం నీటి వల్ల రోడ్డుపై వాహనాలు స్కిడ్ అయ్యే ప్రమాదం ఉన్నందున,పరిమిత వేగంతో వాహనాలు నడపాలని సూచించారు. పిల్లలు,యువకులు చెరువులు,కాలువల దగ్గరకు సెల్ఫీలు తీసుకోవడానికి,ఈత కొట్టడానికి వెళ్లకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఉండకూడదు,వర్షం సమయంలో చెట్ల కింద ఉండటం వల్ల పిడుగుపాటుకు గురయ్యే అవకాశం ఉంది అందువల్ల చెట్లకింద ఉండరాదు,చేపలు పట్టుటకు,పశువులను మేపడానికి బయటకి వెళ్లకూడని తెలిపారు ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు మండల రెవెన్యూ యంత్రాంగం సిద్ధంగా ఉందని ఇందుకోసం తహసిల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపినారు కావున ప్రజలు ఎవరు కూడా ఎలాంటి భయభ్రాంతులకు లోనుకాకుండా ఏ విషయమైనా కంట్రోల్ రూమ్ సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారం తెలపాలని తెలిపినారు.

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పిడుగురాళ్ల : పల్నాడు జిల్లా పిడుగురాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రమాదేవి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితులలో వర్షాలు పడు తుండటంతో సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉందన్నారు. ఈ సీజనల్ వ్యాధుల నుండి తీసుకోవలసిన జాగ్రత్తలు, వర్షాకాలంలో దగ్గు, జలుబు, దోమ కాటు వలన మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కలుషిత నీరు త్రాగటం వలన డయేరియా, వాంతులు వచ్చే అవకాశం ఉంది అన్నారు. ఇంటి పరిసరాలలో నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. దోమకాటు కు గురికాకుండా దోమ తెర, మస్కిటో కాయిల్స్ వాడాలన్నారు. ఇల్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలి అన్నారు. త్రాగునీరు కలుషితం కాకుండా పరిశుభ్రమైన కాచి వడపోసిన త్రాగునీరు మాత్రమే త్రాగాలన్నారు. ఏదైనా వ్యాధి సోకిన వెంటనే డాక్టర్ ను సంప్రదించి సలహాలు, సూచనలు పాటిస్తూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని డాక్టర్ రమాదేవి కోరారు.

అమరావతిలో బసవతారకం హాస్పిటల్ నిర్మాణం శుభపరిణామం

అమరావతి : కేశినేని ఫౌండేషన్ ద్వారా నిర్వహించిన ఫ్రీ మెడికల్ క్యాంపు ల్లో బసవతారకం క్యాన్సర్ హాస్పటల్ సహకారంతో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎంతోమందికి క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించటం జరిగింది. హైదరాబాద్ లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ రాజధాని అమరావతి ప్రాంతంలో అత్యాధునిక క్యాన్సర్ కేర్ క్యాంపస్ ను ఏర్పాటు చేయటం శుభపరిణామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. తుళ్లూరు లో బసవతారకం క్యాన్సర్ హాస్పటల్ భూమి పూజ కార్యక్రమం జరిగింది. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణ పనులకు బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ చైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ భూమి పూజ నిర్వహించారు.

బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి

-ఎస్సీ జాతీయ కమిషన్ సభ్యుడు రాంచందర్

కాగజ్‌నగర్ : షెడ్యూల్ కులాల జాతీయ కమిషన్ ద్వారా దళితులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేస్తామని ఎస్సీ జాతీయ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ అన్నారు. కుమురం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన ప్రైవేట్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి సజీవన్, తహసీల్దార్ మధూకర్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్సీ జాతీయ కమిషన్ సభ్యుడు మాట్లాడుతూ దళితుల భూములను ఎవరు అక్రమించకూడదని, ఆక్రమణ జరిగితే సంబంధిత దళిత బాధితులు కమిషన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. షెడ్యూల్ కులాల జాతీయ కమిషన్ ద్వారా దళితులకు సత్వర న్యాయం జరుగుతుందని, అణగారిన సంక్షేమం కోసం కమిషన్ కృషి చేస్తోందన్నారు. అణగారి నవర్గాలకు ఎలాంటి అన్యా యం జరిగిన కమిషన్ సత్వరమే స్పందించి దళితుల పక్షాన అండగా నిలుస్తోందన్నారు. జిల్లానుంచి భూమికి సంబంధించిన ఫిర్యాదులే అధికంగా వస్తున్నాయని, ఈ ప్రాంతంలో ఎక్కువగా లావుణి పట్టాలున్నందున ఇతరులు అక్రమిస్తున్నారని తెలిపారు. ఈ కారణంగా సంబంధిత బాధితులు కమిషన్‌ను ఆశ్రయిస్తున్నట్టు వివరించారు. దళితుల సంక్షేమం కోసం నిరంతరంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వినతి పత్రాల అందజేత...

కాగజ్‌నగర్‌కు ఎస్సీ జాతీయ కమిషన్ సభ్యుడు రాంచందర్ దళిత సంఘం వ్యవస్థాపకుడు ఈర్ల సునీల్, బెల్లంపల్లి ఏరియా ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రసిడెంట్ బి గోపాలకృష్ణ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ధర్మయ్య మాదిగ కులస్థుల సమస్యలను పరిష్కారించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళిత సంఘం వ్యవస్థాపకుడు ఈర్ల సునీల్ మాట్లాడుతూ కాగజ్‌నగర్ ఎస్పీఎం మిల్లులో స్థానికులకు ఉద్యోగ అవకాశాలివ్వటం లేదని, సర్‌సిల్క్ మిల్లు మూతబడిందని, యువతకు ఉపాధి మార్గాలు లేకుండా అనేక అవస్థలు పడుతున్నట్టు వివరించారు. బెల్లంపల్లి ఏరియా ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రసిడెంట్ బి గోపాలకృష్ణ మాట్లాడుతూ తిర్యాణి మండలం దేవాయిగూడలో 130 మంది మాదిగ కుటుంబసభ్యులకు చెందిన భూములను సింగరేణి సంస్థ తీసుకుందని, ఇంతవరకు మాదిగలకు న్యాయం చేయటం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ మధూకర్, ఎంపీడీవో కోట ప్రసాద్, డీఎస్పీ రామానుజం, రాష్ట్ర కార్యదర్శి శనిగారం మాదిగ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు వేమూర్ల సంతోష్ మాదిగ, శేఖర్, ఆశోక్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికీ 'అమృత' జలాలు

చౌటుప్పల్ : చౌటుప్పల్ మునిసిపాలిటీలోని ప్రతీ ఇంటికీ కృష్ణాజలాలు అందనున్నాయి. రూ. 21-00 కోట్ల అంచనాతో అమృత 2.0 పథకం పనులు కొనసాగుతున్నాయి. ఆరు నెలల్లో పూర్తి చేసి ప్రజలకు కృష్ణా జలాలను అందించాలన్న లక్ష్యంతో ప్రజారోగ్య శాఖ అధికారులు పనులను వేగవంతం చేశారు. ఈ పథకం క్రింద మూడు ఓహెచఎస ట్యాంకుల నిర్మాణం జరుగుతుండగా, స్థల సమస్యతో ఒక ట్యాంక్ నిర్మాణ పనులు నిలిచి పోయాయి. ప్రజారోగ్య శాఖ డీఈఈ మనోహర వారానికి రెండు, మూడు సార్లు ఈ పనుల నాణ్యతా ప్రమాణాలను పరిశీలిస్తూ వేగవంతం చేస్తున్నారు. మిషన భగీరథ పథకం ద్వారా వచ్చే కృష్ణా జలాలను ఈ ట్యాంకుల్లోకి పంపించి, ఈ ట్యాంకుల నుంచి ఏర్పాటు చేసే ప్రత్యేక పైప్‌లైన్ల ద్వారా ప్రజలకు తాగు నీటిని అందించనున్నారు. మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖల క్రింద కృష్ణా జలాలను ఇంటింటికి అందించాలన్న లక్ష్యంతో కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమృత 2.0 పథకం పనులను ప్రజారోగ్య శాఖ కు అప్పగించారు. ఈ పథకం పనులకు 2024 ఆగస్టు 5న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రెండు సంవత్సరాల కాల పరిమితిలో పనులను పూర్తి చేయవలసి ఉండగా, ఇప్పటికే ఒక సంవత్సరం గడిచి పోయింది. కొన్ని సాంకేతిక సమస్యలతో ట్యాంకుల నిర్మాణ పనులు కొంత ఆలస్యంగా మొదలు పెట్టవలసి వచ్చింది. మొద టి దశలో ట్యాంకుల నిర్మాణ పనులను చేపట్టారు. చౌటుప్పల్ పట్టణంలోని 10వ వార్డు (శివాజీ నగర్) , మునిసిపల్ పరిధిలోని 6వ వార్డు (తంగడపల్లి), 13 వ వార్డు (జయభూమి వెంచర్) , 8 వ వార్డు (లక్కారం) లలో ఈ పథకం క్రింద నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులను చేపట్టారు. ఇందులో భూ సమస్య కారణంగా లక్కారం లోని ట్యాంక్ నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

ట్యాంకుల సామర్థ్యం..వ్యయం

చౌటుప్పల్ పట్టణంలోని జయభూమి వెంచర్, మునిసిపాలిటీలోని తంగడపల్లిలలో ఒక్కొక్కటి 7 లక్షల లీటర్ల సామర్థంగల రెండు ఓహెచఎసఆర్ ట్యాంకులు, చౌటుప్పల్‌లోని శివాజీనగర్, లక్కారం లలో ఒక్కొక్కటి 5 లక్షల లీటర్ల సామర్థం గల రెండు ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మిస్తున్నారు. 7 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంక్ ఒక్క ట్యాంకుకు రూ. 1.50 కోట్లు, 5 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంక్ ఒక్కంటికి రూ.1.20 కోట్ల ను వెచ్చించి నిర్మిస్తున్నారు. నాలుగు ట్యాంక్‌ల నిర్మాణానికి రూ. 5.40 కోట్ల వ్యయం జరగనుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో..

కృష్ణా జలాల సరఫరా ను మెరుగు పరిచేందుకు అమృత 2.0 పథకం కింద నిర్మాణ పనులను కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపట్టారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.9.66 కోట్లు (46శాతం), రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.6.93కోట్లు(33 శాతం), స్టేట్ పైనాన్స కార్పొరేషన వాటా రూ.2.94 కోట్లు (14 శాతం), మునిసిపాలిటీ వాటా రూ.1.47కోట్లు (7శాతం)గా విభజించారు. ఈ నిష్ప త్తి ప్రకారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను విడుదల చేస్తున్నాయి.

పైప్‌లైన్ల ఏర్పాటుపై సర్వే పూర్తి

నాలుగు ట్యాంకుల నుంచి కృష్ణా జలాలను ప్రజలకు అందించేందుకు చేపట్టిన పైప్‌లైన ఏర్పాటు సర్వే పనులు దాదాపుగా పూర్తయినట్టు అధికారులు తెలిపారు. పైప్‌లైన్లు పూర్తిగా లేని ప్రాంతాలతో పాటు గతంలో వేసిన పైప్‌ల సైజు తక్కువగా ఉన్న వాటిని తొలగించి కొత్తగా పైప్ లైన లను ఏర్పాటు చేయనున్నారు. కేఎనఆర్‌సీ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో పైప్ లైన ఏర్పాటు సర్వే పనులను చేపట్టారు. సుమారు 30 కిలోమీటర్ల పొడవునా పైప్‌లైన ఏర్పాటు చేయవలసి ఉంటుందని ప్రాథమిక అంచనా.

తాళ్లసింగారం వాసుల ఆగ్రహం

మునిసిపాలిటీలోని తాళ్లసింగారంలో నిర్మించవలసిన ఓహెచఎసఆర్ ట్యాంకును రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న జయభూమి వెంచర్‌లోకి మార్చడం పట్ల ఆ ప్రాంత ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. మునిసిపాలిటీకి చెందిన అప్పటి ప్రజా ప్రతినిధులు సాగించిన లాలూచీ వ్యవహారంతోనే ట్యాంకు నిర్మాణాన్ని తాళ్ల సింగారం నుంచి జయభూమి వెంచర్‌లోకి మార్పిడి చేశారన్న ఆరోపనలు వినిపిస్తున్నాయి.

కృష్ణా జలాలు ఎక్కడినుంచి వస్తాయంటే..

నాంపల్లి మండలం ఎస్. లింగోటంలోని కృష్ణా జలాల శుద్ధి కేంద్రం నుంచి చౌటుప్పల్‌కు గ్రిడ్ పైప్ లైన నుంచి మునిసిపాలిటీలోని నాలుగు ట్యాంకులకు ప్రత్యేక పైప్‌లైన్లను ఏర్పాటు చేయవలసి ఉంటుంది. ఈ పైప్‌లైన్ల ఏర్పాటుపై గ్రిడ్, ప్రజారోగ్య శాఖ అధికారుల మధ్య చర్చలు సాగుతున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారంగా కృష్ణా జలాలను సరఫరా చేస్తున్నారు. అప్పుడు 25వేల జనాబా ఉండగా, అది ఇప్పుడు లక్ష దాటింది. కొత్తగా నిర్మిస్తున్న ఈ ట్యాంకుల్లోకి కృష్ణా జలాలను పంపించాలంటే అదనంగా లింగోటం శుద్ధి కేంద్రం నుంచి పంపింగ్ చేయవలసి ఉంటుంది. ఇందుకోసం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే సహకారంతో త్వరిత గతిన పనులను పూర్తి చేయించి ప్రజలకు కృష్ణా జలాలను అందించాలన్న లక్ష్యంతో ప్రజారోగ్య శాఖ డీఈఈ మనోహర ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

ఉపాధి హామీకి తూట్లు

మహబూబ్‌నగర్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కేంద్రం పని దినాలను 50 శాతం తగ్గించింది. దాంతో పథకాన్ని కొనసాగిస్తారా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 32.43 లక్షల పనిదినాలు కల్పించగా, 32.69 లక్షల పని దినాలు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం 2025-26కు గాను కేవలం 17.78 లక్షల పనిదినాలు మాత్రమే కల్పించడం గమనార్హం. గడిచిన ఐదేళ్లలో ఇంత తక్కువ పని దినాలు కల్పించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. అదే 2023-24లో 31.05 లక్షల పని దినాలు కేటాయించగా 35.13 లక్షల పని దినాలు చేశారు. 2022-23లో 28.06 లక్షల పని దినాలకు 31.68 లక్షలు, 2021-22లో 35.97 లక్షల పనిదినాలకు 36.89 లక్షలు, 2020-21లో 41.86 లక్షల పనిదినాలకుగాను 40.44 లక్షల పనిదినాలు చేశారు.

ఇప్పటికే సగానికిపైగా పూర్తి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభమై 4 నెలలు గడిచింది. ఇప్పటికే కేటాయించిన పని దినాల్లో 12.54 లక్షల పని దినాలు అంటే 70.52 శాతం పూర్తి చేశారు. మరో ఎనిమిది నెలల సమయం ఉండగా మిగిలిన 5 లక్షల పని దినాలు సరిపోవన్న విషయం స్పష్టమవుతోంది. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడంతో పనులు తక్కువగానే జరుగుతాయి. సమ్మర్ సీజన్ జనవరి, ఫిబ్రవరి, మార్చిలో పెద్ద ఎత్తున పనులు సాగుతాయి. అప్పుడు వ్యవసాయ పనులు ఉండవు. కాబట్టి కూలీలు ఎక్కువ సంఖ్యలో పనులకు వస్తారు. ఇక మిగిలిన 5 లక్షల పని దినాల్లో జనవరి నాటికి మరో 2-3 లక్షల పనిదినాలు చేస్తే వేసవికి ఇక పనిదినాలేవీ మిగలవని కూలీలు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూ డా ఈ సమస్యను గుర్తించి పనిదినాలు పెంచాలని కేంద్రానికి లేఖ కూడా రాసింది.

అధికారులకు విధించని టార్గెట్‌లు

పథకంలో గతంలో సిబ్బందికి గ్రామానికి 100 మందికి తగ్గకుండా పని చేయాలని లక్ష్యాలను నిర్దేశించేవారు. ఈ లెక్కన జిల్లాలో రోజూ 40-50 వేల మంది పని చేయాల్సి ఉం డగా ప్రస్తుతం 1,200 నుంచి 1,500 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ నెలకు 3,000 పనిదినాలు, టెక్నికల్ అసిస్టెంట్ తన పరిధిలోని 7,500 పని దినాలు చేయిస్తేనే జీతాలు చెల్లించాలన్న నిబంధన ఉం డేది. ఫీల్డ్ అసిస్టెంట్‌లు తక్కువ పనిదినాలు చేస్తే ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి సీనియర్ మే ట్‌కు డిమోట్ చేసేవారు. ఇప్పుడవన్నీ బుట్టదాఖలయ్యాయి. కేవలం వన మహోత్సవం కార్యక్రమాలకే పథకాన్ని పరిమితం చేశారు. కావాల్సిన పనులు చేయడానికి వీలు లేకుండా కోత విధిస్తోంది. భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా పనులు చేయిస్తున్నారు. ఫాంపాండ్, ఫీడర్ ఛానల్, ఫీల్డ్ చానల్, షిల్ట్, పశువుల షెడ్ల పనులకే పరిమితం చేశారు.

టీడీపీ కార్యక్రమంలో అపశృతి

అలమూరు : టీడీపీ సంబరాల్లో ఎడ్లు రంకెలు వేసాయి. సూపర్ సిక్స్ సూపర్ హిట్, అన్నదాత సుఖీభవ అనగానే ఎడ్లు బెదిరిపోయాయి. దాంతో బండి పైనుంచి పడిన టీడీపీ ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు కు స్వల్ప గాయాలు అయ్యాయి. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరులో నిర్వహించిన రైతు సంబరాల్లో ఘటన జరిగింది. ఎమ్మెల్యేతోపాటు టీడీపీ నాయకులకు స్వల్ప గాయాలయ్యాయి

బురద రోడ్డుపై నాటు వేసి నిరసన తెలిపిన గ్రామస్థులు

మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రం నుండి అనేక ఏజెన్సీ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి బురదమయంగా మారింది.. కాస్త వర్షం పడితే చాలు నీళ్లు చేరి చెరువును తలపిస్తోంది. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాధుడు కరువయ్యాడు... దీంతో జనం ఆగ్రహం కట్టలు తెంచుకొని బురద రోడ్డుపై గ్రామస్థులందరు కలసి వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం దున్నపోతు మీద వానపడినట్టు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా రన్ ఫర్ శ్రీకాకుళం

శ్రీకాకుళం : శ్రీకాకుళం జిల్లా ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా రన్ ఫర్ శ్రీకాకుళం మారథాన్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ మహేశ్వర రెడ్డి, శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్, పలువురు ప్రజాప్రతినిధులు కలిసి జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ పురుషుల కళాశాల నుండి ఏడు రోడ్ల కూడలి వరకు కొనసాగిన ఈ ర్యాలీ దేశభక్తి నినాదాలతో, జాతీయ జెండాల అలంకరణతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.మారథాన్ అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ, "దేశభక్తి అనేది శ్రీకాకుళం వారసత్వంలోనే నాటుకుపోయింది. శ్రీకాకుళం అంటే దేశభక్తి దేశభక్తి అంటే శ్రీకాకుళం అని గర్వంగా తెలిపారు. జిల్లా చరిత్రలో మహనీయుల త్యాగం, సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. జాతీయ జెండాను పట్టుకోవడమే గుండె పులకరించిపోతుందని, ఈ రోజు కార్యక్రమం ప్రజల్లో ఆ భావనను మరింత బలపరిచిందని అన్నారు.

వర్షాకాలం దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

కోరుట్ల : వర్షాకాలం దృష్ట్యాఇటీవల కురుస్తున్న భారీ వర్షాలు నైపద్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవీందర్ ఆన్నారు.తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపల్ కమిషనర్ రవీందర్ వర్షాకాలం దృష్ట్యా పట్టణంలోని పలు వార్డులలోని శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి అందులో ఉన్న వారిని వెంటనే ఖాళీ చేయించారు.. అలాగే రిపేరు చేసుకొనవలసినదిగా లేదా కూల్చి వేసుకోవాలని కోరారు.ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టము జరగకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ కోరుట్ల మున్సిపాలిటీ లో శిథిలావస్థలో ఉన్న భవనాలను వెంటనే ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతానికి తరలించడం జరిగిందని తెలిపారు, రిపేరు చేసుకొనవలసినదిగా లేదా కూల్చి వేసుకోవాలని నోటిసులు జారీ చేసినట్టు తెలిపారు. కోరుట్ల మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 9100039255 అత్యవసర సమయంలో సహాయం కొరకు ఈ నెంబర్ కి కాల్ చేయాలని కోరారు. ఎందుకు పట్టణ ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు.

భారత్, పాకిస్థాన్‌తో సంబంధాల్లో ఎలాంటి మార్పు ఉండదు : అమెరికా

వాషింగ్టన్ : భారత్, పాకిస్థాన్ సంబంధాల్లో ఎలాంటి మార్పు ఉండబోదని, ఆ రెండు దేశాలతోనూ తమకు సత్సంబంధాలు కొనసాగుతున్నాయని అమెరికా పేర్కొంది. పాకిస్థాన్ సైనిక నాయకత్వంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్

యర్రవరం జలపాతం మూసివేత

చింతపల్లి : మండలంలోని గొందిపాకలు పంచాయతీ యర్రవరం జలపాతాన్ని రెవెన్యూ అధికారులు మూసివేశారు. వర్షాలు తగ్గే వరకు పర్యాటకులు ఇక్కడికి రావద్దని స్థానిక తహశీల్దార్ జి.ఆనందరావు తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల రాగల ఐదు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించింది. దీంతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా, మండల స్థాయి అధికారులను అప్రమత్తం చేసింది. గిరిజన ప్రాంతంలో ఉన్న జలపాతాలు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, పర్యాటకుల సందర్శనలు నిలిపివేయాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు గురువారం తహశీల్దార్ సిబ్బందిని యర్రవరం జలపాతానికి పంపించారు. జలపాతానికి వెళ్లే మార్గాన్ని మూసివేస్తూ కంచె కట్టేశారు. వర్షాలు తగ్గే వరకు జలపాతాన్ని సందర్శించేందుకు ఎవరినీ పంపించవద్దని స్థానిక గిరిజనులకు తెలియజేశారు. కాగా ప్రస్తుతం జలపాతం ఉధృతంగా ప్రవహిస్తున్నది.

వెండి వితరణలపై తేలని లెక్కలు

విశాఖపట్నం : కనకమహాలక్ష్మీ ఆలయంలో వెండి తాపడం లెక్కలు తేల్చడంలో దేవదాయ శాఖ అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. నగరంలో ప్రముఖ షాపింగ్ మాల్ అధినేత గత నవంబరులో తనకు జరిగిన అన్యాయంపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఇంతవరకూ దానిని పట్టించుకోలేదు. అమరావతిలో దేవదాయ శాఖ కమిషనర్ నుంచి విశాఖలో ఆలయ ఈఓ వరకూ ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు. దీని నుంచి ఎవరినో కాపాడాలని అంతా యత్నిస్తున్నట్టుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జ్యోతి మాధవి ఆలయ ఈఓగా ఉన్న సమయం (2021)లో అమ్మవారి విగ్రహం వెనుక వెండి తాపడం (మకర తోరణం) కొత్తది చేయిస్తామని ప్రకటించగా, అనేకమంది దాతలు ముందుకు వచ్చారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు 6.3 కిలోల వెండి బిస్కెట్లు ఈవో జ్యోతి మాధవి ఇచ్చారు. ఈ అంశం పత్రికల్లో కూడా ప్రచురితమైంది. ఆ తరువాత మరికొందరు కూడా వెండి విరాళంగా ఇచ్చారు. షాపింగ్‌మాల్ అధినేత వెండి తాపడాన్ని 60.830 కిలోలతో తయారుచేయించారు. అందుకోసం ఆయనకు ఆలయ వర్గాలు 28.500 కిలోలు వెండిని వివిధ రూపాల్లో ఇచ్చాయి. ఇంకా 38.413 కిలోల వెండి తమకు రావాలని ఆ షాపింగ్ మాల్ అధినేత దఫదఫాలుగా కోరారు. ప్రతి స్పందన లేకపోవడంతో గత ఏడాది నవంబరు ఆరో తేదీన షాపింగ్ మాల్ లెటర్ హెడ్‌పై ఆలయ ఈఓకు సవివరంగా లేఖ రాశారు. బకాయి వెండితో పాటు తయారీ చార్జీలుగా రూ.6,08,300 ఇవ్వాల్సి ఉందని, దీనిని నిర్ణయించి వీలైనంత త్వరగా చెల్లించాలని కోరారు. దీనిపై సమాధానం లేదు. వెండి లెక్కలు తేలడం లేదని చర్చ ప్రారంభం కావడంతో ఈ నెల మొదటి వారంలో ఆలయ మాజీ ధర్మకర్త ఒకరు దేవదాయ శాఖ కమిషనర్‌కు ఆలయంలో జరిగిన వెండి కుంభకోణంపై లేఖ రాశారు. అందులో యూనియన్ బ్యాంక్ ఇచ్చిన 6.3 కిలోల వెండి బిస్కెట్ల గురించి పేర్కొన్నారు. వారికి కూడా అధికారులు రశీదు ఇవ్వలేదని ఆరోపించారు. ఆలయ సిబ్బందిలో ముగ్గురికి పదేళ్లు సర్వీసు పూర్తయినందుకు వారిని రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని, వారికి ఎరియర్స్ రూపంలో రూ.30 లక్షల వరకు రాగా, వారికి తలా కొంత ఇచ్చి, మిగిలింది అప్పుడు పనిచేసిన ఆలయ అధికారులు పంచుకున్నారని ఆరోపించారు. దీనిపై డిప్యూటీ కమిషనర్ విచారణ చేసి ఐదు నెలలైనా ఎటువంటి చర్యలు చేపట్టలేదని కూడా పేర్కొన్నారు. వీటిపై విచారణ వేగవంతం చేసి కారకులపై చర్యలు తీసుకోవడమే కాకుండా, వెండిని రికవరీ చేయాలని కోరారు. ఆలయ అధికారులు, దేవదాయ శాఖ అధికారులు ఈ వెండి విషయంపై పెదవి విప్పడం లేదు. విచారణ జరుగుతున్నని చెబుతున్నారే తప్ప దానిని ఎప్పటికి ముగిస్తారో వెల్లడించడం లేదు. డిప్యూటీ కమిషనర్ ఐదు నెలల క్రితమే విచారణ చేపట్టినట్టు మాజీ ధర్మకర్త ఫిర్యాదు ద్వారా వెలుగులోకి వచ్చింది. అదేవిధంగా షాపింగ్‌మాల్ అధినేత ఫిర్యాదు చేసి పది నెలలైందని తేలింది. పాత ఈఓల ద్వారా వెండి లెక్కలు ప్రస్తుత ఈఓ శోభారాణికి వారం క్రితం అప్పగించారు గానీ ఈ మకర తోరణం లెక్కలు తేల్చకపోవడం గమనార్హం. ఎవరినో ఈ కేసు నుంచి తప్పించడానికి అంతా కలసి యత్నిస్తున్నారనేది మాత్రం వాస్తవం.

గంజాయి శాశ్వత నిర్మూలన అందరి బాధ్యత

పాడేరు : జిల్లాలో గంజాయిని శాశ్వతంగా నిర్మూలించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో 'గంజాయి– ప్రత్యామ్నాయ పంటల'పై జిల్లా ఎస్‌పీ అమిత్‌బర్ధార్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గంజాయి సాగు, వినియోగంపై అధికారులకు పక్కా సమాచారం ఉండాలన్నారు. గంజాయి సాగుతో కలిగే నష్టాలపై ప్రజలకు, వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. గిరిజనులను గంజాయి సాగు నుంచి విముక్తి చేసి, వారికి ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సహించాలన్నారు. డిగ్రీ, జూనియర్ కాలేజీల్లో, ఇతర విద్యాలయాల్లోనూ గంజాయి వల్ల కలిగే నష్టాలపై ప్రణాళికాబద్ధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అలాగే గంజాయిని వీడిన గిరిజన రైతులకు స్వయం ఉపాధి కల్పన, బ్యాంకు రుణాలు మంజూరు చేయాలన్నారు. గంజాయి సాగు, రవాణా చేస్తున్న వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్‌పీ అమిత్‌బర్ధార్ మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నామని, సమాజంలోనూ మార్పు రావాలన్నారు. గంజాయి ద్వారా సంపాదించిన ఆస్తులను జప్తు చేయడం వంటి చర్యలు చేపడుతున్నామని, గంజాయి స్మగ్లర్లకు గ్రామాల్లో ఆశ్రయం కల్పించవద్దని ప్రజలకు సూచించారు. గంజాయి రవాణాను అరికట్టేందుకు ప్రతి చోటా పటిష్ట నిఘా పెట్టామన్నారు. విద్యాలయాల్లోనూ గంజాయి వల్ల కలిగే నష్టాలను తెలుపుతూ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు గిరిజన సంక్షేమ శాఖ డీడీ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ, పాడేరు, రంపచోడవరం సబ్‌కలెక్టర్లు శుభంనొక్వల్, శౌర్యమన్‌పటేల్, డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి, డీఈవో పి.బ్రహ్మజీరావు, ఐసీడీఎస్ పీడీ ఝాన్సీబాయి, టీడబ్ల్యూ డీడీ పి.క్రాంతికుమార్, ఎల్‌డీఎం మాతునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పీ-4కు 4,000 మంది మార్గదర్శకులు గుర్తింపు

విశాఖపట్నం: జిల్లాలో పీ–4 పథకం కోసం ఇప్పటివరకూ నాలుగు వేల మంది మార్గదర్శకులను గుర్తించామని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. తన ఛాంబర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో తొలుత 73 వేల బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. తరువాత సర్వే చేస్తే వారిలో సుమారు 10 వేల మంది అన్వరులు ఉన్నారని తేలిందన్నారు. మిగిలిన 63 వేల మందితో మార్గదర్శకులను అనుసంధానం చేసే కార్యక్రమం చురుగ్గా సాగుతుందన్నారు. ఇప్పటివరకూ గుర్తించిన నాలుగు వేల మంది మార్గదర్శకులను 38 వేల మంది బంగారు కుటుంబాలను మ్యాపింగ్ చేశామన్నారు. పెద్ద కంపెనీలకు ఎక్కువ స్థాయిలో బంగారు కుటుంబాలతో మ్యాపింగ్ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 607 సచివాలయాల పరిధిలో కనీసం 10 మంది చొప్పున మార్గదర్శకులను గుర్తించే పని చురుగ్గా సాగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈనెల 19వ తేదీన పీ–4 ప్రారంభం కానున్నదని, ఆలోగా మరింత మంది మార్గదర్శకులను గుర్తిస్తామన్నారు. నగరంలో ఇన్ ఆర్బిట్ మాల్ నిర్మిస్తున్న రహేజా గ్రూపు ఐటీ పార్కు అభివృద్ధికి పలుచోట్ల స్థలాలను పరిశీలించిందన్నారు. రుషికొండ ఐటీ హిల్స్ వద్ద 20 ఎకరాలు చూసిందన్నారు. కాగా, కాగ్నిజెంట్‌కు మధురవాడలో హరిత ప్రాజెక్టు పక్కన 22 ఎకరాలు, ఐటీ పార్కు అభివృద్ధి కోసం సిఫీ కంపెనీకి పరదేశిపాలెంలో 25 ఎకరాలు గుర్తించామన్నారు. ఇప్పటివరకూ ఐటీ కంపెనీలకు 100 ఎకరాలు కేటాయించామని వివరించారు. కాగ్నిజెంట్ సొంత క్యాంపస్ నిర్మాణం పూర్తయ్యేసరికి కొంత సమయం పడుతుందని, అప్పటివరకూ నగరం నుంచి కార్యకలాపాలు చేపట్టాలని యోచిస్తోందన్నారు. త్వరలో సుమారు రెండు వేల మందితో కార్యకలాపాలు ప్రారంభించేందుకు అద్దెకు భవనాలను అన్వేషిస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ జిల్లాలో మూడు బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నారు. ఆరిలోవలో ఆటోడ్రైవర్, దొండపర్తిలో భర్త లేని మహిళ కుటుంబం, ఆనందపురంలో తల్లిలేని ఇద్దరు పిల్లలను కలెక్టర్ దత్తత తీసుకున్నారు. ఆరిలోవ వాసికి సొంతంగా ఆటో లేకపోవడంతో అద్దె ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. డిగ్రీ పాసైన పెద్దకుమార్తెకు ఉద్యోగం, పదో తరగతితో చదువు ఆపేసిన చిన్న కుమార్తెకు టైలరింగ్‌లో శిక్షణ ఇప్పించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. అలాగే దొండపర్తిలో భర్త లేని మహిళకు ఒక కుమారుడు ఉన్నాడు. అతను డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. తనకు పింఛన్ ఇవ్వాలని ఆమె కోరుతున్నారు.

కేసీఆరే బెటర్.. మూడ్ ఆఫ్ ది సర్వే..

హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటింది. సీఎంగా రేవంత్‌రెడ్డి పాలన తొలి ఏడాది వరకు బాగానే సాగినట్లు అనిపించింది. కానీ, ఇప్పుడు పెద్దగా పనులేమీ చేసినట్లు కనిపించడం లేదు. పథకాలు ముందుకు సాగడం లేదు. హామీలు అమలు కావడం లేదు. ఈ భావన ప్రజల్లో కనిపిస్తోంది. ఈ తరుణంలో మూడ్ ఆఫ్‌ది పీపుల్స్ అండ్ పబ్లిక్ సంస్థ నిర్వహించిన తాజా సర్వేలో సంచలన నిజాలు వెల్లడయ్యాయి. ఈ సర్వేలో ఏ సీఎం పాలన బాగుందని అడిగిన ప్రశ్నకు మెజారిటీ ప్రజలు కేసీఆర్‌కే ఓటు వేశారు. సర్వేలో ప్రజలు కేసీఆర్ పాలనకు 55.68% మద్దతు ఇవ్వగా, రేవంత్ రెడ్డికి 28.40% మాత్రమే మద్దతు లభించింది.కేసీఆర్ నాయకత్వంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పాలన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి రాష్ట్ర అభివృద్ధికి గణనీయమైన కృషి చేసిందని చాలా మంది భావిస్తున్నారు. అందుకే సర్వేలో 55.68% మంది కేసీఆర్‌కు మద్దతు ఇచ్చారని తెలుస్తోంది. కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. ఈ భావోద్వేగ కారణం ఇప్పటికీ ప్రజల మనసుల్లో బలంగా నాటుకుంది. కాళేశ్వరం ప్రాజెక్ట్, మిషన్ భగీరథ వంటి పెద్ద ఎత్తున నీటిపారుదల తాగునీటి పథకాలు, 24 గంటల విద్యుత్ సరఫరా వంటివి ప్రజల్లో సానుకూల ఆలోచన కలిగించాయి. రైతు బంధు, దళిత బంధు, ఆసరా పెన్షన్లు వంటి పథకాలు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించాయి. అవినీతి ఆరోపణలు మరియు పరిపాలనలో కొన్ని వివాదాలు కూడా ఉన్నప్పటికీ, సర్వే ఫలితాలు కేసీఆర్‌కు ఇప్పటికీ బలమైన మద్దతు ఉందని సూచిస్తున్నాయి.రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చింది. సర్వేలో 28.40% మద్దతు మాత్రమే రేవంత్ పాలనకు లభించింది. ప్రజల్లో ఒక విభాగం సానుకూల దృక్పథం ఉన్నప్పటికీ, ఇంకా చాలా మంది ఆయన పాలనను ఆమోదించలేదు. రేవంత్ రెడ్డి యువ నాయకుడిగా, డైనమిక్ నాయకత్వ శైలితో ప్రజలను ఆకర్షించారు. రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు కొంత మద్దతు తెచ్చిపెట్టాయి. కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం, కుల గణన వంటి అంశాలపై దృష్టి సారించడం ద్వారా వెనుకబడిన వర్గాల మద్దతు పొందే ప్రయత్నం చేస్తోంది. అయితే కేసీఆర్‌తో పోలిస్తే, రేవంత్ రెడ్డి పాలన ఇంకా కొత్తగా ఉంది, కాబట్టి ప్రజలు దీర్ఘకాలిక ఫలితాలను అంచనా వేయడానికి సమయం కావాలి. ఆర్థిక సవాళ్లు, వాగ్దానాల అమలులో జాప్యం వంటివి రేవంత్ ప్రభుత్వంపై వ్యతిరేకతకు కారణంగా భావిస్తున్నారు.సర్వేలో కేసీఆర్‌కు 55.68% మరియు రేవంత్‌కు 28.40% ఓట్లు రావడం వెనుక రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలు కీలక పాత్ర పోషించాయి. తెలంగాణ ఉద్యమ నాయకుడిగా కేసీఆర్‌కు ఉన్న బలమైన గుర్తింపు ఇప్పటికీ ప్రజల మనసుల్లో ఉంది. రేవంత్ రెడ్డి ఈ స్థాయి భావోద్వేగ కనెక్షన్‌ను ఇంకా సృష్టించలేదు. కేసీఆర్ పాలన దీర్ఘకాలంగా (2014?2023) ఉండడం వల్ల, ఆయన ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు సుపరిచితం. రేవంత్ పాలన ఇంకా పూర్తిగా స్థిరపడలేదు, దీని వల్ల ప్రజలు ఆయన పట్ల ఇంకా సంశయంతో ఉన్నారు. ఇటీవల కాంగ్రెస్ నిర్వహించిన ఒక సోషల్ మీడియా పోల్‌లో కూడా కేసీఆర్ పాలనకు 67% మద్దతు లభించిందని, రేవంత్‌కు తక్కువ మద్దతు లభించిందని సమాచారం. ఇది సర్వే ఫలితాలను బలపరుస్తుంది.

గ్రామాల్లో యూరియా కష్టాలు

మెదక్ : పంటల సాగు ప్రారంభం నుంచే రైతులు ఎరువుల కోసం పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకుల సహకార కేంద్రం వద్ద యూరియా కోసం రైతులు ప్రతి రోజు భారీగా సంఖ్యలో బారులు తీరుతున్నారు. నంగునూరు మండలంలో గత వానాకాలంలో 25,878 ఎకరాల్లో సాగు చేయగా, అప్పట్లో 2600 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయ్యింది. కానీ, ఈసారి 25,750 ఎకరాలకు సాగు అంచనా వేసి, 1800 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అయితే, ఇప్పటివరకు కేవలం 1100 మెట్రిక్ టన్నులు మాత్రమే నంగునూరు మండల కేంద్రానికి సరఫరా అయ్యింది.యూరియా సరఫరాలో ఎంత జాప్యం జరుగుతోందో స్పష్టమవుతోంది. రైతులకు సరిపడా యూరియాను సకాలంలో అందించకుండా, నిబంధనలతో ఇబ్బందులకు గురిచేయడంపై రైతులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.నంగునూరు మండలంలో రైతులు యూరియా కోసం పడుతున్న పాట్లు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. గతంలో యూరియా పంపిణీ ఇంతటి గందరగోళానికి దారితీయలేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. నాటి కేసీఆర్ ప్రభుత్వం రైతుల అవసరాలను గుర్తించి, యూరియాను నేరుగా ఇంటికే సరఫరా చేసేదని, ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేకపోవడంపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.యూరియా పంపిణీలో ప్రభుత్వం ఓటీపీ విధానం మాకు తలనొప్పిగా మారింది. బస్తాలు మాకు నేరుగా ఇవ్వకుండా, ఓటీపీ విధానం ద్వారా ఇస్తున్నారు. ఒక్కరికి సుమారు 20 నిమిషాల సమయం పడుతుంది. చాలా సందర్భాల్లో సర్వర్ పనిచేయకపోవడం వల్ల గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తుంది. ఓటిపి విధానం తక్షణమే రద్దు చేయాలి.

పిల్లి కలవ్వ, రైతు, కోనాయిపల్లి.

గడిచిన 10 సంవత్సరాలలో పొలం పనులు వదిలి ఎరువుల కోసం పరుగులు పెట్టాల్సిన అవసరం ఉండేది కాదు. ఏ ఇబ్బంది లేకుండా సకాలంలో యూరియా దొరికేది, అందుకే పంటలు కూడా మంచిగ పండేవి. యూరియా మస్తుగ దొరికేది. ఇప్పుడు ఎరువుల కోసం ఎంత తిరిగినా దొరకతలేవు. నాటి ప్రభుత్వం మంచిగ చేసేది, ఇప్పుడైతే మమ్మల్ని మస్తు బాధ పెడుతున్నారు.యూరియా దళారులకు చేరోద్దని ఉద్దేశంతో ఓటీపీ విధానం ప్రభుత్వం అమలు చేసింది. ఈసారి అగ్రికల్చర్ కి మాత్రమే 1800 మెట్రిక్ టన్నుల యూరియా నివేదిక పంపించాం. మండలంలో ప్రస్తుతానికి వరి 18,500 ఎకరాల్లో సాగు చేశారు.రైతులు యూరియా వినియోగంపై స్పష్టమైన సమాచారం కోసం ఒక పాస్ బుక్కు రెండు యూరియా సంచులు మాత్రమే ఇవ్వాలని ఆదేశాలున్నాయి. యూరియా ఏ రోజు వస్తుందని ఒక రోజు ముందస్తుగానే రైతులకు సమాచారం అందిస్తున్నాము. యూరియా నిల్వ లేకుండా రైతులకు వెంటనే సరఫరా చేస్తున్నాము.

మేడ్చల్‌లో అక్రమ సరోగసి

హైదరాబాద్ : అక్రమ సరోగసీ, ఎగ్ ట్రేడింగ్ సెంటర్ ముఠాగుట్టు రట్టు చేశారు మేడ్చల్ ఝూ, పేట్ బషీరాబాద్ పోలీసులు. పిల్లలు లేని జంటల ఆవేదనను డబ్బు కోసం వాడుకున్న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మేడ్చల్ జిల్లా పెట్ బషీరాబాద్‌లోని మేడ్చల్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ప్రధాన నిందితురాలు నర్రెద్దుల లక్ష్మిరెడ్డి ఏ లక్ష్మి, గతంలోనే ఎగ్ డోనర్, సరోగేట్ మదర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ఆమె కుమారుడు నరేందర్ రెడ్డి (ఏఐఐజలో కెమికల్ ఇంజనీరింగ్ చదివాడు). ఈ అక్రమ వ్యాపారంలో తల్లికి తోడుగా పనిచేస్తున్నాడని పోలీసులు గుర్తించారు.డబ్బు అవసరం ఉన్న పేద మహిళలను ఎగ్ డోనర్ లేదా సరోగేట్ మదర్‌గా చేయించి, లక్ష్మిరెడ్డి గ్యాంగ్ భారీ లాభాలు పొందింది. ఈ క్రమంలో, పోలీసులు నిందితుల వద్ద నుండి నగదు, ల్యాప్‌టాప్, ప్రామిసరీ నోట్లు, బాండ్ పేపర్లు, సిరంజీలు, గర్భధారణ మందులు, స్మార్ట్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలో మానవ అక్రమ రవాణా కేసులో లక్ష్మి నిందితురాలని పోలీసులు గుర్తించారు. సృష్టి ఫర్టిలిటీ హాస్పిటల్ ఉదంతంతో నగరంలో నకిలి ఫర్టిలిటీ సెంటర్లపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో సరోగసి, ఐవీఎఫ్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న తల్లీకొడుకును అదుపులోకి తీసుకున్నారు. సరోగసీ రెగ్యులేషన్ యాక్ట్, అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ యాక్ట్, మరియు ఃజూ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లోని చిలకలూరిపేటకు చెందిన లక్ష్మి రెడ్డి, ఆమె కుమారుడు నరేందర్ రెడ్డి సుచిత్ర, పద్మా నగర్ ప్రాంతాల్లో నివాసం ఉంటూ అక్రమంగా సరోగసీ ఉ ఎగ్ ట్రేడింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. వివిధ రాష్ట్రాల నుండి పిల్లలు లేని మహిళలను తీసుకువచ్చి, తన ఇంట్లో ఉంచి, సరోగసీ ఎఎఈ పద్ధతి ద్వారా గర్భం దాల్చేలా చేసి, చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. జేఎన్టీయూలో కెమికల్ ఇంజనీరింగ్ చదివిన నరేందర్ రెడ్డి, తల్లికి తోడుగా ఈ అక్రమ క్లినిక్ నడపడంలో సహకరించాడు.లక్ష్మి రెడ్డికి గతంలోనే ఎగ్ డోనర్, సరోగేట్ మదర్‌గా పనిచేసిన అనుభవం ఉండటంతో, మాధాపూర్‌కు చెందిన హెగ్డే, లక్స్ ఆసుపత్రులతో సంబంధాలు పెంచుకుని ఈ రహస్య క్లినిక్‌ను నడిపినట్లు విచారణలో తేలింది. పోలీసులు నిందితులైన తల్లి కొడుకులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి ?6.47 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. లెనోవో ల్యాప్‌టాప్, ప్రామిసరీ నోట్లు, బాండ్ పేపర్లు, సిరంజీలు, గర్భధారణ మందులు, హార్మోన్ ఇంజెక్షన్లు, హెగ్డే హాస్పిటల్ కేస్ షీట్లు, 5 స్మార్ట్‌ఫోన్లు, 1 కీప్యాడ్ మొబైల్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులకు సహకరించిన వారిని గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అర్హులు మళ్లీ ఓటింగ్ చేసుకానే అవకాశం

పాట్నా : బీహార్‌లో ఎన్నికల సంఘం నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో దాదాపు 65 లక్షల ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ నుండి తొలగించారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు ఇచ్చింది. బీహార్ డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ నుండి తొలగించిన సుమారు 65 లక్షల ఓటర్ల జాబితాను జిల్లా ఎన్నికల అధికారుల వెబ్‌సైట్‌లలో జిల్లాల వారీగా ప్రచురించాలని ఆదేశించింది. ఈ జాబితా బూత్ వారీగా ఉండాలి, ఓటర్లు తమ ఎలక్టోరల్ ఫోటో ఐడెంటిటీ కార్డ్ నంబర్ ఆధారంగా పరిశోధించేలా ఉండాలని సూచించింది. అదే విధంగా తొలగింపు కారణాలను అంటే మరణం, వలస, డబుల్ రిజిస్ట్రేషన్ వంటివి జాబితాలో స్పష్టంగా పేర్కొనాలని.. ఈ జాబితా బీహార్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వెబ్‌సైట్‌లో కూడా ప్రచురించబడాలని ఆదేశాలు జారీ చేసింది. తొలగించిన ఓటర్లు తమ పేర్లను తిరిగి చేర్చడానికి దాఖలు చేసే క్లెయిమ్‌లలో ఆధార్ కార్డ్‌ను కూడా సమర్పించవచ్చని ప్రజలకు తెలియజేయాలని సుప్రీంకోర్టు చెప్పింది. ఇఐఎ గతంలో పేర్కొన్న 11 డాక్యుమెంట్ల జాబితాలో ఆధార్ కార్డ్ చేర్చనప్పటికీ, సుప్రీంకోర్టు దీనిని స్పష్టంగా చేర్చమని ఆదేశించింది. ఆధార్ , ఇఖఎఐ కార్డులు సాధారణంగా ఓటర్లకు సులభంగా అందుబాటులో ఉంటాయని అందుకే వాటిని అనుమతించాలని ఆదేశించింది. తొలగించిన ఓటర్ల జాబితా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని బీహార్‌లో విస్తృతంగా ప్రచారం చేయాలి. ఇందుకోసం స్థానిక వార్తాపత్రికలు, టీవీ, రేడియో, జిల్లా ఎన్నికల అధికారుల సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించాలని అత్యున్నత న్యాయస్థానం సూచించింది. ఈ జాబితా బూత్ లెవెల్ ఆఫీసర్ల నోటీసు బోర్డులలో కూడా ప్రదర్శించాలని.. తద్వారా ఓటర్లు మాన్యువల్‌గా సమాచారాన్ని తెలుసుకోగలరని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. తమ ఆదేశాలను రాబోయే మంగళవారం అంటే ఆగస్టు 19, 2025 నాటికి అమలు చేయాలని సుప్రీంకోర్టు ఇఐఎని నిర్దేశించింది. తదుపరి విచారణ ఆగస్టు 22కు వాయిదా వేసింది. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, ఇఐఎ జూన్ 24, 2025న ఖఎఖీ ప్రక్రియను ప్రకటించింది. ఈ ప్రక్రియ ద్వారా అనర్హులైన ఓటర్లు అంటే మరణించినవారు, వలస వెళ్లినవారు, డబుల్ రిజిస్ట్రేషన్ ఉన్నవారు, చట్టవిరుద్ధ వలసదారుల పేర్లను తొలగించి, ఓటర్ల జాబితాను కొత్తగా సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రక్రియలో 7.24 కోట్ల ఓటర్లతో డ్రాఫ్ట్ రోల్ ప్రచురించారు. అంతకు ముందు జాబితాలో ఉన్న 65 లక్షల పేర్లు తొలగించారు.వీరిలో 22.34 లక్షల మంది చనిపోయారని, 36.28 లక్షల మంది శాశ్వతంగా వలసపోయారని, మరో ఏడు లక్షల మంది రెండు ఓట్లు కలిగి ఉన్నారని ఈసీ చెబుతోంది. సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రకటించే జాబితాలతో నిజంగా అర్హులైన ఓటర్ల ఓట్లు తొలగిస్తే ఆ విషయం బయటపడే అవకాశం ఉంది. వారు మళ్లీ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

గృహ నిర్మాణాలు పూర్తికాకపోతే రద్దు

పెనగలూరు : మండలంలో మంజూరు చేసిన పీఎం ఆవాస్ యోజన పక్కా గృహాలు పొందిన లబ్ధిదారులు నిర్మాణాలు పూర్తి చేసుకోకపోతే రద్దవుతాయని, దాని ఫలితంగా లబ్ధిదారులు ఇప్పటివరకు తీసుకున్న ప్రభుత్వ సొమ్ము వెనక్కు ఇచ్చేయాల్సి వస్తుందని మండల ప్రత్యేక అధికారి పవన్‌కుమార్‌రెడ్డి లబ్ధిదారులకు సూచించారు. పెనగలూరు జగనన్న లేవుట్‌ను ఆయన తనిఖీ చేసి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇదిలా ఉండగా జగనన్న కాలనీలోకి వచ్చే రహదారి చాలా దుర్భరంగా ఉందని, కనీసం చిన్న చిన్న వాహనాలైన హౌసింగ్ మెటీరియల్ తీసుకొని వచ్చేందుకు అనువుగా రోడ్డుకు మరమ్మతులు చేయాలని లబ్ధిదారులు కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ హరిప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుజ్ఞాని, గ్రామ కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ గుప్పిట్లో ఎన్నికల కమిషన్

పత్తికొండ : ప్రధాని మోదీ గుప్పిట్లో ఎన్నికల కమిషన్ ఉందని, దీంతో దేశంలో ప్రజాస్వామ్యానికే ప్రమాదం ఏర్పడిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. పత్తికొండకు వచ్చిన ఆయన సీపీఐ కార్యాలయంలో మాట్లాడారు ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బీహార్ ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ఓట్లు వేస్తారని గుర్తించిన మోదీ ఈసీతో కుమ్మక్కై 60 లక్షల ఓట్లు తొలగిం చారని ఆవేదన వ్యక్తం చేశారు. ప

టీడీపీ పుట్టిన తర్వాత ఫస్ట్ టైమ్

కడప : పులివెందులలో వైసీపీకి డిపాజిట్ గల్లంతు.. అసలు వినడానికి ఏమాత్రం నమ్మశక్యంగా లేని ఈ పరిణామం నిజంగానే జరిగింది. పులివెందులలో పసుపు జెండా ఎగిరింది. పూల అంగళ్లలో తెలుగుదేశం సంబరం చేసింది. జగన్ ప్రెస్‌మీట్ సాక్షిగా తెలుగుదేశం విజయం నిన్ననే ఖరారు అయిపోయినా.. ఇవాళ అధికారిక ఫలితాల్లో టీడీపీ జగన్ పార్టీని చిత్తు చిత్తు చేసింది. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ 6033 ఓట్ల మెజార్టీతో గెలుపొందింది. తెలుగుదేశం అభ్యర్థి బీటెక్ రవి భార్య, మారెడ్డి లతారెడ్డి 6716ఓట్లు పొందగా.. వైసీపీ అభ్యర్థి హేమంత్ రెడ్డి 683 ఓట్లు సాధించారు. 1978 నుంచి పులివెందుల నియోజకవర్గం వైఎస్ ఫ్యామిలీ అడ్డా. 78లో వైఎస్ రాజశేఖరరెడ్డి.. రెడ్డి కాంగ్రెస్ తరపున గెలిచినప్పటి నుంచి ఇప్పటి వరకూ 12 సార్లు పులివెందులకు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే అన్నిసార్లూ వైఎస్ కుటుంబ సభ్యులే గెలిచారు. వైఎస్, ఆయన భార్య విజయమ్మ, ఆయన సోదరుడు వివేకానందరెడ్డి, ఆయన కుమారుడు , మాజీ సీఎం జగన్ మోహనరెడ్డి గెలిచారు. 2019లో అక్కడ జగన్ మెజార్టీ 90వేల మార్క్‌ను కూడా దాటింది. దీనిని బట్టే ఆ కుటుంబానికి పులివెందులలో ఉన్న పట్టు అర్థం చేసుకోవచ్చు. 1983లో తెలుగుదేశం పుట్టిన దగ్గర నుంచి అక్కడ జెడ్పీ ఎన్నికల్లో టీడీపీ గెలవలేదు. 30ఏళ్లుగా పులివెందుల మండలంలో అసలు ఎన్నికలే జరగలేదు. వైసీపీ ఏకగ్రీవంగా గెలుస్తోంది. అలాంటి చోట వైసీపీని తెలుగుదేశం మట్టికరిపించింది. అసలు ఇవి ఎన్నికలే కాదు.. జరిగింది రిగ్గింగ్? అని వైఎస్సార్సీపీ ముందే రిజల్ట్ తేల్చేసింది. స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూలంగా ఉండటం కొత్త విషయమేం కాదు. మంత్రాంగంలో మందుంటారు. యంత్రాంగం వాళ్ల కంట్రోల్‌లో ఉంటుంది. ఇప్పుడూ అదే జరిగింది. ఏదైనా రిజల్ట్ అనేదే ఫైనల్ కాబట్టి ఈ ఎన్నికలో వైఎస్సార్సీపీని తెలుగుదేశం చావుదెబ్బ కొట్టినట్టే.. ఫస్ట్ టైమ్ జగన్ ఇలాకాలో ఆయన పార్టీని దెబ్బతీయడం నిజంగా టీడీపీకి పొలిటికల్‌గా పెద్ద మైలేజ్. పులివెందుల ఎన్నికలను టీడీపీ చాలా సీరియస్‌గా తీసుకుంది. మరో ఏడాదిలో జెడ్పీ పదవీకాలం పూర్తవుతుంది. మామూలుగా పదవి పూర్తైతేనే స్థానిక ఎన్నికలు చంద్రబాబు అంత తొందరగా నిర్వహించరు అనే పేరుంది. అలాంటిది తప్పకుండా గెలిచి తీరతామన్న నమ్మకంతోనే? ఈ సారి వీళ్లు రంగంలోకి దిగారు. పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీటెక్ రవి భార్య లతారెడ్డినే అభ్యర్థిగా రంగంలోకి దించారు. జమ్మలమడగు నుంచి ఆదినారాయణ రెడ్డి మొత్తం ఎన్నిక బాధ్యతను తనపై ఉంచుకుని పనిచేశారు. మంత్రి సవిత కూడా నియోజకవర్గంలోనే ఉండి గెలుపుకోసం ప్రయత్నాలు చేశారు. జగన్‌పై అగ్రెసివ్‌గా వెళ్లడం ద్వారా బీటెక్ రవి పులివెందులలో కొద్ది కొద్దిగా ఆదరణ పెంచుకుంటున్నారు. 2017 స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీటెక్ రవి.. వైఎస్ వివేకానందరెడ్డిపై గెలుపొందడం మొదటి మలుపు.. 2024లో రవి జగన్ మెజార్టీ తగ్గించడంలో సక్సెస్ అయ్యారు. 2024 ఎన్నికల్లో జగన్ మెహనరెడ్డి మెజార్టీ ఏకంగా 30వేలకు పైగా తగ్గింది. ఇప్పుడు తన భార్యను నించోబెట్టి ? తానే అభ్యర్థిగా మండలంలో తిరిగారు..వైనాట్ 175 పేరుతో కుప్పంను కూడా కొట్టేస్తామంటూ సాధారణ ఎన్నికలకు ముందు వైసీపీ చూపించిన అత్యుత్సాహం కూడా టీడీపీ శ్రేణులు ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవడానికి ఓ కారణం. అప్పట్లో కుప్పంలో నాలుగు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మునిసిపాలిటీలను కూడా గెలుచుకున్న ఊపులో వైసీపీ కుప్పం అసెంబ్లీ స్థానాన్ని కొడతామని చెప్పింది. దానికి పోటీగా చంద్రబాబు పులివెందుల వచ్చి వైనాట్ పులివెందుల అన్నారు. రెండు అసెంబ్లీల్లో రిజల్ట్ మారలేదు కానీ.. కుప్పం స్థానిక ఎన్నికల్లో జరిగిన పరాభవానికి టీడీపీ ప్రతీకారం తీర్చుకుంది. అది కూడా డిపాజిట్ రానంత రేంజ్‌లో వైసీపీని ఓడించింది. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు తానే ఎమ్మెల్సీగా గెలిచిన బీటెక్ రవి.. ఇప్పుడు మరోసారి తన భార్యను గెలిపించుకున్నారు.

పాశర్లపూడిలో మళ్లీ గ్యాస్ ఉత్పత్తి

కాకినాడ : ఓఎన్జీసీ అంటే భారీ యంత్రాలు, భారీ వాహనాలు, ఎత్తైన రిగ్‌లు.. భూమి నుంచి ఆయిల్ , గ్యాస్ తవ్వి తీస్తాయట.. అనేంతవరకు తెలుసు. కానీ కోనసీమ ప్రాంతంలో జరిగిన ఓ ఘటనతో నేటికి అక్కడి ప్రజలను భయకంపితులను చేస్తుంది. అంతవరకు అసలు పాశర్లపూడి అనే ఊరు ఎక్కడ ఉందో తెలియని వారికి సైతం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కనీవినీ ఎరుగని భయాన్ని కోనసీమ ప్రాంత ప్రజలు ప్రత్యక్షంగా చవి చూశారు. ఓఎన్జీసీ పేరు చెబితేనే నేటికీ వణికిపోతారు. 80 దశకంలో పుట్టిన వారిని, పెద్దలను ఎవ్వరినైనా అడిగితే ఇట్టే కళ్లల్లో భయం కనిపిస్తుంది. నాడు పాశర్లపూడిలో జరిగిన దుర్ఘటన గురించి చెబుతారు. ఓఎన్జీసీ చాలా ఆపరేషన్లు నిర్వహించినప్పటికీ పాశర్లపూడి బ్లో అవుట్ మాత్రం ఓఎన్జీసీ చరిత్రలో అతిపెద్ద రెండో ప్రమాదంగా చెబుతారు.. అటువంటి సంచలనానికి కేంద్రంగా మారిన అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని పాశర్లపూడిలో ఇప్పుడు మళ్లీ ఓఎన్జీసీ కార్యకలాపాలు విస్తృతంగా నిర్వహిస్తుండగా గ్యాస్ నిక్షేపాల వెలికితీతలో సక్సెస్ అయినట్లు తెలుస్తోంది..కృష్ణా గోదావరి బేసిన్ పరిధిలో ఆన్‌షోర్ కార్యకలాపాలను ఓఎన్జీసీ మళ్లీ విస్తృతంగా నిర్వహిస్తోంది. గతంలో చేపట్టిన సిస్మిక్ సర్వేలో లభించిన సోర్స్ ఆధారంగా ఇందులో కొత్త ప్రాంతాల్లో చమురు, సహజవాయు నిక్షేపాల వెలికితీత కోసం రిగ్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. పాశర్లపూడి ఓఎన్జీసీ క్షేత్రం శ్రీరామపేట సమీపంలో డ్రిల్లింగ్ నిర్వహిస్తున్న బావిలో ఆశాజనకంగా సహజ వాయువుతో కూడిన చమురు నిక్షేపాలు లభ్యమయ్యాయి. దీంతో ఉత్పత్తి పరీక్షలకు పాసర్లపూడి సెక్టార్‌లో ఓఎన్జిసి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.. గత నెల 9న డ్రిల్లింగ్ 2,860 మీటర్లకు చేరుకున్న చివరి సమయంలో ఒక్కసారిగా గ్యాస్ పైకి రావడంతో అప్రమత్తమైన సాంకేతిక సిబ్బంది గ్యాస్‌ను అదుపు చేశారు. గ్యాస్ లీకేజీ అవ్వడంతో స్థానిక ప్రజలు భయాందోళనలకు గురై నిరసనలు వ్యక్తం చేయడంతో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, అమలాపురం ఆర్డీవో మాదవి, రెవెన్యూ అధికారులు సంబంధిత ఓఎన్జీసీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు..1995 జనవరి 8న సాయంత్రం సుమారు 6:50 గంటల సమయం.. అంతా ప్రశాంతంగా ఉన్న సమయంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో ఆకాశాన్ని తాకేలా అగ్ని జ్వాలలు సుమారు 100 మీటర్లు మేరకు పైకి ఎగదన్నాయి. చుట్టుపక్కల కొబ్బరి చెట్లన్నీ మాడి మసైపోయాయి. అక్కడున్నవారు ఏమయ్యారో తెలియదు. అసలు ఏం జరుగుతుందో, ఏం జరిగిందో తెలియదు. 50 కిలో మీటర్లు దూరం వరకు ఆకాశం ఎర్రగా మారింది. కాసేపటికి అధికారులు ద్వారా అసలు విషయం వెల్లడైంది. ఓఎన్జీసీ గ్యాస్ నిక్షేపాల వెలికితీత ప్రయత్నంలో ఉండగా ఒక్కసారిగా బ్లోఅవుట్ అయ్యిందని. బోడసకుర్రు గ్రామ పరిధిలో ఉండే ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జిసి)కు చెందిన ఈ పాశర్లపూడి గ్యాస్ వెల్ నంబర్ 19లో ఈ ప్రమాదం సంభవించిందని తెలిసింది. పాసర్లపూడి బ్లో అవుట్ అనేది భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన ఒక ప్రధాన పారిశ్రామిక ప్రమాదంగా చెబుతుంటారు.

నాటి తూర్పు గోదావరి జిల్లాలోని అమలాపురం సమీపంలోని పాసర్లపూడి గ్రామంలో చోటుచేసుకోగా సుమారు 62–65 రోజుల పాటు అగ్నికీలలు ఎగసిపడ్డాయి. బ్లో అవుట్ సంభవించిన తర్వాత మిగిలిన పైపులు గ్యాస్ బయటికి పంపేశాయి. డ్రిల్లింగ్ టవర్లు అగ్నిజ్వాలలకు మైనంలా కరిగిపోయాయి. చుట్టుపక్కల సామగ్రి నాశనమైంది. బ్లో అవుట్ వల్ల రోజుకు 1 మిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ బయటికి వెలువడింది. మంటలు 10 కి.మీ.దూరం నుంచి కనిపించాయి. భారీ శబ్దం రెండు కిలోమీటర్ల దూరం వరకు వినిపించింది. ఉష్ణోగ్రత 50లీఅకు మించి పెరిగింది. సమీప గ్రామాల నుంచి సుమారు 6000 కుటుంబాలను ఖాళీ చేయించి రిలీఫ్ క్యాంపులను ఏర్పాటు చేశారు. చివరకు 65 రోజుల అనంతరం విదేశీ నిపుణుల సహకారంతో మంటలను అదుపు చేసి గ్యాస్ ను కంట్రోల్ చేసి క్యాప్ ఏర్పాటు చేయగలిగారు. అలాంటి ప్రాంతంలో ఇప్పుడు మళ్లీ గ్యాస్ తీసే ప్రయత్నాలు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

రేణుకకు కలిసి రాని కాలం

కర్నూలు : ఆర్థికంగా బలమైన ఫ్యామిలీ. సామాజికవర్గం పరంగా కూడా జిల్లాలో పట్టున్న కుటుంబం. అయినా సరే ఒకే ఒక చిన్న తప్పు రాజకీయ జీవితాన్ని ఇబ్బందుల పాలు చేసింది. ఆమె బుట్టా రేణుక. 2014 ఎన్నికలకు ముందు బుట్టా రేణుక ఎవరో తెలియదు. ఆ ప్రాంతంలో కొందరికే పరిచయం. అయితే వైసీపీ అధినేత వైఎస్ జగన్ 2014లో కర్నూలు ఎంపీ టిక్కెట్ ఇచ్చారు. దీంతో ఆమె తొలిసారి పార్లమెంటు గడప తొక్కారు. అయితే ఆ ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రాకపోవడంతో మనసు టీడీపీ వైపునకు మళ్లింది. దీంతో బుట్టా రేణుక వైసీపీ ఎంపీ పదవికి రాజీనామా చేయకుండానే టీడీపీ మద్దతుదారుగా కొనసాగారు. దీంతో పార్టీ ఆమెను 2019 ఎన్నికల్లో పక్కన పెట్టింది. కానీ తాను పార్టీ మారిన టీడీపీ 2019 ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వలేదు. అదే సమయంలో రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రావడంతో బుట్టా రేణుక మరోసారి మనసు మార్చుకున్నారు. తిరిగి వైసీపీలో చేరారు. అయితే ఈసారి ఎమ్మిగనూరు అసెంబ్లీ టిక్కెట్ ను ఆశించారు. అనుకున్నట్లుగానే బుట్టారేణుకకు 2024 ఎన్నికల్లో ఎమ్మిగనూరు టిక్కెట్ లభించింది. కానీ ఈసారి జనం ఆదరించలేదు. గత ఎన్నికలలో వైసీపీ అభ్యర్థులందరూ ఓడిపోవడంతో ఆమె కూడా ఓటమి పాలయ్యారు. మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు బుట్టా రేణుక రెడీ అవుతున్నారు. ఈసారి ఎన్నికల్లోనూ ఎమ్మిగనూరు నుంచి పోటీ చేయాలని భావించి అక్కడే ఎక్కువగా తిరుగుతూ ప్రజల్లో ఉంటూ మమేకమై వారి సమస్యలను అడ్రెస్ చేస్తున్నారు.. బుట్టా రేణుక కుర్మి సామాజికవర్గానికి చెందిన . ఆమె మొత్తం 300 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో ఓటమి పాలయి జనం ఆదరణను పొందలేకపోయారు. కానీ కూటమి ప్రభుత్వంపై ప్రస్తుతం అసంతృప్తి ఎక్కువగా ఉందని భావించి బుట్టారేణుక తిరిగి నియోజకవర్గంలోనే కాదు పార్టీలోనూ యాక్టివ్ గా మారారు. ఈసారి కూడా ఎమ్మిగనూరు నియోజకవర్గం టిక్కెట్ తనకే ఇవ్వాలని గట్టిగా ప్రయత్నిస్తున్నారు. మరొకవైపు ప్రస్తుతం ఎమ్మిగనూరు టీడీపీలో అసంతృప్తులు ఎక్కువ కావడంతో పాటు ఎమ్మెల్యేకు, ప్రధాన నేతలకు మధ్య గ్యాప్ పెరగడంతో వారిని ఆకట్టుకునేందుక ప్రయత్నిస్తున్నారు. మొత్తం మీద నాలుగేళ్ల ముందే బుట్టా రేణుక ఎన్నికలకు సిద్ధమయి గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారన్న టాక్ ఎమ్మిగనూరులో వినపడుతుంది.. ఎమ్మిగనూరులో తరచూ సమావేశాలు నిర్వహించడం పాటు కార్యకర్తలతో భేటీ అయి వారి వ్యక్తిగత సమస్యలను తీర్చడంలోనూ బుట్టా రేణుక ముందున్నారని చెబుతున్నారు. అక్కడే తన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడంతో పాటు అక్కడ సిబ్బందిని నియమించి కార్యాలయానికి వచ్చిన ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఆమె కృషి చేస్తున్నారని అంటున్నారు. ఇక సోషల్ మీడియాలో కూడా బుట్టా రేణుక ముందున్నారని అంటున్నారు. పార్టీ మారిన బుట్టా రేణుక పదేళ్ల పాటు చట్ట సభలకు దూరమయి తిరిగి పుంజుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరి బుట్టా రేణుకకు ఈసారి టిక్కెట్ వస్తుందా? రాదా? అని పక్కన పెడితే ఆమె నాలుగేళ్ల ముందు నుంచే ప్రయత్నాలు మొదలు పెట్టడం కర్నూలు జిల్లా పాలిటిక్స్ లో హాట్ టాపిక్ గా మారింది.

ఇప్పుడు నియోజకవర్గం...

కడప : పులివెందులలో టీడీపీ జెండా ఎగిరింది. ..రాజశేఖర రెడ్డి హయాం నుంచి వైఎస్ ఫ్యామిలీకి కంచుకోటగా ఉన్న పులివెందులలో టీడీపీ గెలవడం మాత్రమే కాదు.. వైసీపీకి డిపాజిట్లు కూడా రాకపోవడం నిజంగా ఆశ్చర్య పరిచే విషయమే. అధికార పార్టీ ఈ ఎన్నికను ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందో దీన్ని బట్టే అర్థం చేసుకోవచ్చు. పులివెందులలో జెండా పాతడం కోసమే కాదు.. జగన్ పార్టీ మూలాలు పెకిలించాలనే బలమైన కసితో టీడీపీ శ్రేణులు పని చేశాయని వచ్చిన ఫలితాలను బట్టి భావించాల్సి ఉంటుంది. నిజంగానే పులివెందుల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఈ స్థాయిలో టీడీపీకి ఓటేసి ఉంటే గనుక రాష్ట్ర రాజకీయాల్లో ఇది కీలక మలుపు అని చెప్పొచ్చు. జగన్ సొంత జిల్లాలో టీడీపీ ఘన విజయం సాధించడంతో.. ఇక వైఎస్సార్సీపీ పని అయిపోయిందని, పార్టీని కాంగ్రెస్ విలీనం చేస్తారేమోనని తెలుగుదేశం శ్రేణులు ఎద్దేవా చేస్తున్నాయి. జగన్ కంచుకోటకు బీటలు.. అంటూ ప్రచారం మొదలైంది. మరి నిజంగానే ఈ విజయం టీడీపీకి, కూటమికి గొప్ప బూస్ట్‌ను ఇస్తుందా..? వైసీపీ పని ఇక అయిపోయినట్టేనా? అనేది చూద్దాం. అలాంటప్పుడు తన పార్టీ పనితీరును, తన మాట తీరును, ఎన్నికల వ్యూహాలను జగన్ ఓసారి సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే జగన్ అక్రమాస్తుల కేసుల్లో బెయిల్ మీద ఉండగా.. కొత్త కేసులు కూడా ఆయన కోసం ఎదురు చూస్తున్నాయి. వివేకా హత్య కేసు కూడా వైసీపీని వెంటాడుతోంది. రానున్న రోజుల్లో జగన్‌ను అధికార పార్టీ మరింతగా ఉక్కిరిబిక్కిరి చేసే అవకాశాలు ఉన్నాయి. పులివెందుల జెడ్పీటీసీ విజయం పట్ల తెలుగుదేశం పార్టీ స్పందిస్తూ.. '30 ఏళ్ల తరువాత, పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచింది. ప్రజలు స్వేచ్ఛగా ఓటేసి, ప్రజాస్వామ్యాన్ని గెలిపించారు' అని పేర్కొంది. పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలో టీడీపీ అభ్యర్థి విజయాన్ని.. కూటమి ప్రభుత్వ ఏడాది సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన బహుమతిగా ఆ పార్టీ చెబుతోంది. పులివెందుల, ఒంటిమిట్టల్లో జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో అధికార తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించింది. పులివెందులలో బీటెక్ రవి సతీమణి లతా రెడ్డి.. వైసీపీ అభ్యర్థి హేమంత్ రెడ్డిపై 6033 ఓట్ల భారీ తేడాతో విజయం సాధించారు. పులివెందులలో లతా రెడ్డికి 6716 ఓట్లు పడగా.. వైసీపీ అభ్యర్థి డిపాజిట్లు కోల్పోయారు. వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గంలో జరిగిన ఈ ఎన్నికలో టీడీపీ భారీ మెజార్టీతో గెలవడంతో తెలుగుదేశం శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు చేసుకుంటున్నాయి. పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచిందని టీడీపీ చెబుతుండగా.. రిగ్గింగ్ చేసి గెలిచారని వైఎస్సార్సీపీ ఆరోపిస్తోంది. పులివెందులతో పోలిస్తే ఒంటిమిట్టలో వైఎస్సార్సీపీ కాస్త గట్టిపోటీనే ఇచ్చిందని చెప్పొచ్చు. ఇక్కడ టీడీపీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డికి 6270 ఓట్లు రాగా.. వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసిన ఇరగం సుబ్బారెడ్డి 3165 ఓట్లు సాధించారు. దీంతో 3105 ఓట్లతేడాతోటీడీపీ అభ్యర్థి గెలుపొందారు. .సాధారణంగా ఇలాంటి ఎన్నికల్లో ప్రజలు అధికారంలో ఉన్న పార్టీ వైపే మొగ్గు చూపుతారు. టీడీపీ దాదాపు మరో నాలుగేళ్లపాటు రాష్ట్రంలో అధికారంలో ఉండనుంది. దీంతో ఆ పార్టీని గెలిపిస్తే.. తమ ప్రాంతానికి మేలు జరుగుతుందని జనం భావిస్తారు. అందుకే అధికారంలో ఉన్న పార్టీవైపే మొగ్గు చూపుతారు.

2017లో జరిగిన నంద్యాల అసెంబ్లీ ఉపఎన్నికలను పరిశీలిస్తే.. జనం అధికార పార్టీ వైపు మొగ్గు చూపుతారని స్పష్టమవుతోంది. కానీ పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ రిగ్గింగ్‌కు పాల్పడిందని, జనాలను ఓట్లు వేయనీయకుండా మధ్యలోనే బెదిరించి వెళ్లగొట్టి.. అధికార పార్టీ వాళ్లే దొంగ ఓట్లు వేశారని వైసీపీ ఆరోపిస్తోంది. పులివెందులలో తమ వాళ్లెవరూ ఓటేయలేదని.. తమ పార్టీకి పడిన ఆ 683 ఓట్లనూ టీడీపీ వాళ్లే వేశారని మాజీ మంత్రి పేర్ని నాని ఎద్దేవా చేశారు. 2021లో జరిగిన కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో 25 వార్డులకు గానూ తమ పార్టీ 19 వార్డులు గెలుపొందగా.. టీడీపీ 6 వార్డులు గెలిచిందని నాని గుర్తు చేశారు.

నిన్న ఎమ్మార్వో... ఇవాళ ఎస్ఐ

నీ అందం మత్తెక్కిస్తోంది... న్యూడ్ కాల్ మాట్లాడు - బరి తెగిస్తున్న అధికారం

అనంతపురం : "నీ అందం నన్ను కవ్విస్తోంది. నీ వయసు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఏం చేస్తే నువ్వు నా సొంత మవ్వుతావు.. రోజు నీతో వీడియో కాల్ మాట్లాడుతున్న కదా.. నువ్వు కూడా నాతో నగ్నంగా మాట్లాడొచ్చు కదా.. నేను చూస్తుండగా నువ్వు బట్టలు విప్పేయచ్చు కదా.. ప్లీజ్ నన్ను సుఖపెట" ఇదీ ఓ కేసు నిమిత్తం పోలీస్ స్టేషన్ కు వచ్చిన మహిళతో ఓ ఎస్సై మాట్లాడిన మాటలు. అతడి పేరు రాజశేఖర్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సత్యసాయి జిల్లా ముదిగిబ్బ మండలంలోని పట్నం పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా పనిచేస్తున్నారు. ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ తన భర్త నుంచి విడాకులు తీసుకుంది. ఈ కేసులో భరణం ఇప్పించాలని ఆమె తరపున గిరిజన మహిళ పోలీస్ స్టేషన్ కు వెళ్ళింది. ఆ గిరిజన మహిళ చూసేందుకు అందంగా ఉండడంతో.. దీనిని అదునుగా తీసుకున్న రాజశేఖర్ ఆమెను ఇబ్బంది పెట్టడం మొదలుపెట్టాడు. తన కోరిక తీర్చాలని.. అప్పుడే న్యాయం చేస్తానని .. ఆలా చేయకపోతే తన నుంచి ఇబ్బందులు తప్పవని ఆమెను వేధింపులకు గురిచేసాడు. ఆమె నంబరు తీసుకుని రాత్రిపూట పదేపదే కాల్స్ చేసి ఇబ్బంది పెట్టేవాడు. అతడు నగ్నంగా మారి.. ఆమెను కూడా అలానే మారిపోవాలని ఒత్తిడికి గురి చేసేవాడు. తన భార్యను వదిలిపెట్టాలని ఆ గిరిజన మహిళ భర్త వేడుకున్నప్పటికీ ఎస్సై వినిపించుకునేవాడు కాదు. ఓసారి ఆమె అనంతపురం వెళ్ళింది. ఆమెను ఎస్ఐ వెంబడించాడు. తన వాహనంలో ఎక్కాలని ఒత్తిడికి గురిచేసాడు. రాజశేఖర్ వేధింపులు అంతకంతకు పెరిగిపోవడంతో ఆ మహిళ తనకు వీడియో కాల్ చేసినప్పుడు.. దానిని రికార్డ్ చేసింది. ఆ వీడియోలో ఎస్ఐ రాజశేఖర్ టవల్ తో ఉన్నాడు. ఆ మహిళతో అత్యంత అసభ్యకరంగా మాట్లాడాడు. అంతేకాదు తన ప్రైవేట్ పార్ట్స్ బయటికి తీసి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ వీడియో బయటికి రావడంతో ఎస్ఐ బాగోతం బయటకు వచ్చింది. ఈ విషయం ఉన్నతాధికారులు దృష్టికి వచ్చింది. దీంతో అతని వేకెన్సీ రిజర్వ్ కు బదిలీ చేస్తూ ఎస్పీ నిర్ణయం తీసుకున్నారు. అతని వ్యవహారంపై విచారణ నిర్వహించాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.

బుడమేరుకు భారీ వరద ప్రవాహం

విజయవాడ : ఏపీకి భారీ వర్ష సూచన ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో.. సామాజిక మాధ్యమాల్లో ఒక ప్రచారం ప్రారంభం అయ్యింది. విజయవాడలోని బుడమేరుకు భారీ వరద ప్రవాహం వచ్చిందంటూ ప్రచారం నడుస్తోంది. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గత ఏడాది విజయవాడలో వరదలు సంభవించిన సంగతి తెలిసిందే. బుడమేరుకు గండిపడి విజయవాడ జలదిగ్బంధంలో చిక్కుకుంది. ప్రాణ నష్టం తో పాటు ఆస్తి నష్టం జరిగింది. సీఎం చంద్రబాబు వారం రోజులపాటు వరద సహాయక చర్యల్లో ఉండిపోవాల్సి వచ్చింది. అందుకే ఇప్పుడు బుడమేరుకు మరోసారి వరద ప్రవాహం అంటూ పెద్ద ఎత్తున ప్రచారం నడుస్తుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అయితే అది పుకారు మాత్రమేనని.. బుడమేరుకు ఎలాంటి ప్రమాదం సంభవించలేదని జిల్లా అధికారులు ప్రకటించారు. గత ఏడాది సెప్టెంబర్ లో విజయవాడలో వరద ముంచెత్తిన విషయం ఇంకా కళ్ళ ముందు కదలాడుతూనే ఉంది. బుడమేరు వాగుకు గండ్లు పడి వరద పోటెత్తగా.. దానికి కృష్ణ వరద కూడా తోడు కావడంతో విజయవాడ జలదిగ్బంధంలో చిక్కుకుంది. వారం రోజుల తర్వాత అక్కడ పరిస్థితి యథాస్థితికి వచ్చింది. అయితే నాడు ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. రోజుల తరబడి ఇళ్లకు పరిమితం అయ్యారు. ఆహారానికి కూడా అవస్థలు పడ్డారు. మంచినీరు కూడా దొరకకుండా పోయింది. రోజుల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయితే నాటి పరిస్థితిని గుర్తుచేసుకొని తాజాగా జరుగుతున్న ప్రచారంతో ఆందోళనకు గురయ్యారు విజయవాడ ప్రజలు. అయితే తాజాగా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు పడుతున్నాయి. అటు తెలంగాణలో సైతం భారీ వర్షాలు నమోదు అవుతున్నాయి. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో సైతం విపరీతమైన వర్షాలు పడుతున్నాయి. ఈ క్రమంలో బుడమేరులో నీటి ప్రవాహం పెరిగింది. కానీ గండ్లు పడే స్థాయికి మాత్రం లేదు. దీంతో సామాజిక మాధ్యమాల్లో బుడమేరుకు మళ్లీ వరద అంటూ ప్రచారం ప్రారంభం అయింది. విజయవాడ నగర ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల్లో ఉండే వారి బంధువులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. దీంతో కృష్ణాజిల్లా అధికారులు ప్రకటన జారీచేశారు. బుడమేరుకు మళ్లీ వరదనే పుకార్లను ఎవరు నమ్మవద్దు అంటూ విజ్ఞప్తి చేశారు. బుడమేరుకు ఎలాంటి ముంపు ప్రమాదం లేదని చెప్పుకొచ్చారు. ప్రజలు భయాందోళనలు చెందవద్దని కోరారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యల్లో భాగంగా బుడమేరు పరివాహక ప్రాంతాలపై నిఘా పెట్టింది. పర్యవేక్షణకు గాను అధికారులను నియమించింది

జగన్‌కు బిగిస్తున్న ఉచ్చు

విజయవాడ : ఏపీ లిక్కర్ స్కాంలో మాజీ ముఖ్యమంత్రి జగనే సూత్రధారి అని సిట్ అధికారుల విచారణలో వెల్లడైంది. లిక్కర్ పాలసీలో మార్పు, అక్రమార్కుల నియామకాలు వంటి కీలక నిర్ణయాలన్నీ ఆయన్న కనుసన్నల్లోనే జరిగాయని సిట్ అనుబంధ చార్జ్‌షీట్లో వెల్లడించింది. ఈ కేసులో జగన్ సన్నిహితులు పలువురు అరెస్ట్ అయినా మద్యం కుంభకోణంపై టీడీపీ, జనసేన ముఖ్యులెవరూ మాట్లాడటం లేదు. చట్టం తన పని తాను చేసుకుని పోతుందన్నట్లు వ్యవహరిస్తున్నారు. మిత్రపక్షాలు సైలెంట్ అయినా బీజేపీ నేతలు మాత్రం వైసీపీని టార్గెట్ చేస్తున్నారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మాధవ్ సహా కాషాయ నేతలు బిగ్ బాస్ జగన్ అంటూ ముప్పేట దాడి చేస్తున్నారు. అసలు బీజేపీ అంత దూకుడు ప్రదర్శించడానికి కారణమేంటి? లిక్కర్ స్కాంలో జగన్ పాత్రపై సిట్ చార్జ్‌షీట్. ఆంధ్రప్రదేశ్‌లో అయిదేళ్లపాటు సాగిన మద్యం కుంభకోణంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ పాత్ర ఉందని సిట్ అధికారులు తమ అనుబంధ చార్జ్‌షీట్లో స్పష్టంగా పేర్కొంది. మద్యం వ్యాపారాన్ని అక్రమ సంపాదనకు రాజమార్గంగగా మార్చుకోవడానికి మాజీ సీఎం జగన్ ఎలాంటి అనుచిత నిర్ణయాలు తీసుకున్నారో వెల్లడించింది. ఉన్నతాధికారుల సిఫార్సులను పట్టించుకోకుండా నియామకాలు చేపట్టారని స్పష్టం చేసింది. సీఎంఓ మాజీ కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీల ప్రమేయానికి సంబంధించి సిట్ అభియోగాలు మోపింది. తాజాగా అనుబంధ ఛార్జ్ షీట్ దాఖలు చేసిన సిట్. తాజాగా విజయవాడ ఏసీబీ కోర్టులో సిట్ అధికారులు అనుబంధ చార్జ్ షీట్ దాఖలు చేశారు. గతంలో వేసిన చార్జ్‌షీట్లో ఏడుగురు వ్యక్తులు, 9 సంస్థలపై అభియోగాలు మోపగా.. అధనంగా ముగ్గురు నిందితులపై అభియోగాలు మోపింది. తాజా ఛార్జ్ షీట్లో హవాలా లావాదేవీలు, డొల్ల కంపెనీలకు సంబంధించిన నకిలీ డైరెక్టర్ల వివరాలు పొంద

సినిమా

శ్రీలీల మొదటి సినిమాకి ముహూర్తం ఫిక్స్

తెలుగు మూలాలు ఉన్న శ్రీలీల మొదటగా కన్నడ మూవీతో ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. కిస్ సినిమాతో కన్నడ సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ఈ అమ్మడు తెలుగులో రాఘవేంద్ర రావు పెళ్లి సందడి సినిమాతో ఎంట్రీ ఇచ్చిన విషయం తెల్సిందే. పెళ్లి సందడి సినిమాతో నటిగా మంచి గుర్తింపు దక్కించుకుంది, డాన్స్‌తో మెప్పించడంతో ఒక్కసారిగా పాపులారిటీని సొంతం చేసుకుంది. శ్రీలీలకు ధమాకా సినిమాతో ఒక్కసారిగా పాపులారిటీ దక్కింది. ఆ సినిమా కమర్షియల్ విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో శ్రీలీల ఒకే సారి అరడజను సినిమాలు చేసే అవకాశం దక్కించుకుంది. ఆ సినిమాల్లో కొన్ని మంచి విజయాన్ని సొంతం చేసుకోగా, మరికొన్ని సినిమాలు నిరాశ పరిచాయి. అయినా కూడా శ్రీలీల వెనక్కి తిరిగి చూసుకోకుండా సినిమాలు చేస్తూ వచ్చింది. మహేష్ బాబుతో గుంటూరు కారం సినిమా చేయడం ద్వారా టాలీవుడ్‌లో మరింత పాపులర్ అయింది. అదే సమయంలో పుష్ప 2 లో ఐటెం సాంగ్ చేయడం ద్వారా పాన్ ఇండియా స్టార్‌గా నిలిచింది. పుష్ప 2 లో చేసిన కిస్సిక్ పాట కారణంగా శ్రీలీల హిందీలో రెండు మూడు సినిమాల్లో నటించే అవకాశాన్ని దక్కించుకుంది. మొదటగా ఈమె ఆషికి 3 సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. అనురాగ్ బసు దర్శకత్వంలో ఆషికి 3 అనే టైటిల్‌తో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నట్లు వార్తలు వచ్చాయి. కానీ ఇటీవల చిత్ర యూనిట్ సభ్యులు సినిమాకు మరో టైటిల్ అనుకుంటున్నట్లు ప్రకటించారు. అంతే కాకుండా ఆషికి 3 టైటిల్ అంటూ వస్తున్న వార్తలను కొట్టి పారేశారు. శ్రీలీల ఫ్యాన్స్ మాత్రమే కాకుండా హిందీ ప్రేక్షకులు ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కార్తీక్ ఆర్యన్ హీరోగా శ్రీలీల హీరోయిన్‌గా రూపొందుతున్న ఈ రొమాంటిక్ లవ్ స్టోరీకి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తుందనే విశ్వాసంను ప్రతి ఒక్కరూ వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ సినిమాకు మంచి బజ్ క్రియేట్ అయింది. శ్రీలీల బాలీవుడ్‌లో నటిస్తున్న మొదటి సినిమా కావడంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. అంచనాలకు తగ్గట్లుగా ఈ సినిమా కమర్షియల్‌గా భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుందా అనేది చూడాలి. పలు కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చిన ఈ సినిమాను ఫైనల్‌గా ఇదే ఏడాది చివర్లో క్రిస్మస్ కానుకగా విడుదల చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే క్రిస్మస్ బరిలో ఆలియా భట్ నటిస్తున్న ఆల్ఫా మూవీ ఉంది. లేడీ స్పై థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఆల్ఫా సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి.

టాలీవుడ్ వైపు మణిరత్నం..గీతాంజలి-2!

మణిరత్నం తెలుగు సినిమా తెరకెక్కించి మూడు దశాబ్దాలకు పైగానే అవుతోంది. 1989లో నాగార్జున కథానాయకుడిగా గీతాంజలి తెరకెక్కించి గొప్ప విజయాన్ని అందించారు. దర్శకుడిగా తెలుగులో తొలి చిత్ర మదే. అప్పటికే మలయాళం, తమిళ్ లో సినిమాలు చేసారు. కన్నడ లో కూడా ఎంట్రీ ఇచ్చేసారు. దీంతో తెలుగు సినిమా ఎప్పుడు చేస్తున్నారు? అన్న సమయంలో టాలీవుడ్ లోనూ షురూ చేసి సర్ ప్రైజ్ చేసారు. అయితే ఆ తర్వాత మళ్లీ మణిరత్నం తెలుగు ఇండస్ట్రీ వైపు చూడలేదు. కేవలం సొంత పరిశ్రమ అయిన తమిళ చిత్రాలకే పరిమితయ్యారు. మధ్యలో హిందీ చిత్రాలు కొన్నింటిని టచ్ చేసారు. అవి కూడా ఓ ఎంట్రీలాగే చేసారు. గీతాంజలి తర్వాత తెలుగు సినిమా చేయాలని ఎన్నో వేదికలపై అభిమానులు అభ్యర్థించినా ఆయన మాత్రం కరుణించలేదు. తాను ఏ సినిమా తీసిన కోలీవుడ్ లోనే తీస్తాను? అన్నట్లు పనిచేసారు. అక్కడ తీసిన చిత్రాలనే తెలుగులోనూ అనువదించారు. అయితే ఆయన డైరెక్ట్ చేసిన ప్రతీ సినిమా తెలుగులో తప్పక అనువాదమవుతుంది. పాన్ ఇండియా వైడ్ ఆయనకున్న గుర్తింపు కారణంగా హిందీ సహా మరికొన్ని భాషల్లోనూ విడుదలవు తుంటాయి. దర్శకుడిగా ఆయన చేసిన సినిమాలు తక్కువే అయినా? ఆణిముత్యాల్లాంటి చిత్రాలెన్నో. అలాగని ఫ్లాప్ లు లేవని కాదు. అలాంటి అట్టర్ ఫ్లాపులు కూడా ఉన్నాయి. పొన్నియన్ సెల్వన్ ని డ్రీమ్ ప్రాజెక్ట్ గా చేసి సక్సస్ అయ్యారు. అయితే అటుపై చేసిన థగ్ లైఫ్ మాత్రం దారుమైన ఫలితాన్ని చవి చూసింది. చివరికి మీడియా ముఖంగా క్షమాపణలు సైతం చెప్పాల్సి వచ్చింది. నాలుగు దశాబ్దాల సినీ కెరీర్ లో మణిరత్నం నోట ఏనాడు క్షమా పణ అనే మాట రాలేదు. తొలిసారి థగ్ లైఫ్ విషయంలో క్షమాపణ తప్పలేదు. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంట్రెస్టింగ్ విషయం వెలుగులో కి వచ్చింది. మణిరత్నం ఓ తెలుగు సినిమా చేయాలనుకుంటున్నట్లు కోలీవుడ్ మీడియాలో ఓ వార్త తెరపైకి వచ్చింది. అదీ అక్కినేని వారసుడు నాగచైతన్యతో తన మార్క్ ప్యూర్ లవ్ స్టోరీ చేయాలనుకుంటున్నా రుట. తండ్రికి గీతాంజలి తో హిట్ ఇచ్చిన మణిసార్ తనయుడికి కూడా అలాంటి లవ్ స్టోరీ హిట్ ఇవ్వాల నుకుంటున్నారేమో.

విశ్వంభర వస్తుంది.. అనిల్ ఆగుతాడా?

ఆరు పదుల వయసులో కూడా మెగాస్టార్ చిరంజీవి వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఇప్పటికే విశ్వంభర షూటింగ్ ను పూర్తి చేసిన చిరూ, ప్రస్తుతం హిట్ మిషన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ కమర్షియల్ ఎంటర్టైనర్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ రెండు సినిమాల్లో విశ్వంభర సినిమా ముందుగా ప్రేక్షకుల ముందుకు రానుందని అందరికీ తెలుసు. విశ్వంభరపై భారీ అంచనాలు బింబిసార తర్వాత వశిష్ట నుంచి వస్తున్న సినిమా కావడంతో పాటూ యంగ్ అండ్ టాలెంటెడ్ డైరెక్టర్ తో చిరంజీవి సినిమా చేస్తుండటం, చాలా కాలం తర్వాత చిరూ చేస్తున్న సోషియో ఫాంటసీ జానర్ మూవీ కావడం వల్ల విశ్వంభరపై భారీ అంచనాలున్నాయి. కానీ ఎప్పుడైతే సినిమా నుంచి మేకర్స్ టీజర్ ను రిలీజ్ చేశారో అప్పట్నుంచి సినిమాపై నెగిటివిటీ వచ్చింది. టీజర్ లోని వీఎఫ్ఎక్స్ పై వచ్చిన ట్రోల్స్, విమర్శలకైతే లెక్కే లేదు. దీంతో చిత్ర యూనిట్ ఏకంగా వీఎఫ్ఎక్స్ కంపెనీని కూడా మార్చేసింది. అయితే ఇప్పుడు విశ్వంభరకు సంబంధించిన వీఎఫ్ఎక్స్ వర్క్స్ ఓ కొలిక్కి వచ్చాయని తెలుస్తోంది. అందులో భాగంగానే చిరంజీవి పుట్టినరోజు అయిన ఆగస్ట్ 22న సినిమా నుంచి ఓ కొత్త టీజర్ తో పాటూ రిలీజ్ డేట్ ను కూడా అనౌన్స్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. అందులో భాగంగానే ఇప్పటికే టీజర్ ను కూడా కట్ చేశారని, డైరెక్టర్ వశిష్టకు సన్నిహితులైన కొందరు ఆ టీజర్ చూసి అతన్ని ప్రశంసించారని టాలీవుడ్ లో వార్తలు వినిపిస్తున్నాయి. సో మెగాస్టార్ బర్త్ డే కు విశ్వంభర నుంచి ఇప్పటికే గిఫ్ట్ రెడీ అయిపోయింది. విశ్వంభర డైరెక్టర్ వశిష్ట ఫ్యాన్స్ కు ట్రీట్ ఇస్తే మెగా157 డైరెక్టర్ అనిల్ మాత్రం ఊరుకుంటారా? దాన్ని మించేలా సినిమా నుంచి అదిరిపోయే కంటెంట్ ను ఫ్యాన్స్ కు మెగాస్టార్ బర్త్ డే గిఫ్టుగా ఇవ్వాలని ప్లాన్ చేస్తున్నారట. మరి ఈ ఇద్దరిలో మెగాఫ్యాన్స్‌ను, మెగాస్టార్ ను ఎవరు ఎక్కువగా మెప్పిస్తారో చూడాలి.

కాకులు దూరని కీకారణ్యంలో చిక్కుకున్న నటి

అడవిలో వెళుతుంటే అకస్మాత్తుగా వర్షం కురిస్తే, ఆపై వాగు వంకలు పొంగి పొర్లితే, అక్కడ ఏదైనా చెట్టు ఆపదలో నీడగా మారి కాపాడితే, అలాంటి గొప్ప అనుభవం ఎవరికైనా ఎప్పుడైనా ఎదురైందా...! ఇంచుమించు అలాంటి గమ్మత్తయిన అనుభవాన్ని ఎదుర్కోవడంలోని ఆనందాన్ని తన సొంతం చేసుకుంది సంయుక్త మీనన్. అడవులు కొండలు కోనలు దాటుకుంటూ ట్రెక్కింగ్ కి వెళ్లడమే కాదు.. ఈ సాహసయాత్రను ఫోటోల రూపంలో డాక్యుమెంట్ చేసి వాటిని అభిమానుల కోసం సోషల్ మీడియాల్లో షేర్ చేస్తోంది. పచ్చని అడవి.. పైగా వర్షం కురుస్తోంది. వాతావరణం అంతా తేమగా ఉంది. ఆ ప్రదేశంలో నేల చిత్తడిగా ఉందని సంయుక్త షేర్ చేసిన ఫోటోలను బట్టి అర్థమవుతోంది. అక్కడ ఒక భీకరమైన వట వృక్షం.. దాని వేళ్ల మీదుగా ఒక మార్గం కూడా వేసి ఉంది. బహుశా అలాంటి ఎగ్జోటిక్ లొకేషన్ లో ఫోటోలు దిగడం, వాటిని అభిమానులకు షేర్ చేసే అవకాశం దక్కడం సంయుక్త మీనన్ ని చాలా థ్రిల్ కి గురి చేసింది. ఇక వర్షంలో ప్రయాణిస్తోంది గనుక సంయుక్త కూడా హెయిర్ తడిసి వెట్ గా కనిపిస్తోంది. అయితే అడవిలో ప్రయాణం నిజంగా ఒక సాహసం. పైగా వర్షంలో ప్రయాణిస్తే అది మరీ ప్రమాదకరం. ఒక్కోసారి హాలీవుడ్ సినిమాల్లో చూపించినట్టు వింతైన అనుభవాలు ఎదురు కావొచ్చు. దారిలో పురుగు పుట్రను కూడా దాటుకుని వెళ్లాల్సి ఉంటుంది. మార్గం సరిగా ఉండదు కనుక ఇబ్బందులు ఎదురవుతాయి. కానీ ట్రెక్కింగ్ అంటేనే అలాంటి కఠినమైన అనుభవాల సారం. దానిని సంయుక్త బాగానే మ్యానేజ్ చేసేస్తోంది. కెరీర్ లో బ్లాక్ బస్టర్ చిత్రాల్లో నటించిన సంయుక్త యువతరం హార్ట్ బీట్ గా మారింది. స్వయంభు, బెంజ్ (తమిళం), అఖండ 2, రామ్ (మలయాళం) హైందవ, మహారాగ్ని (హిందీ), నారీ నారీ నడుమ మురారి లాంటి క్రేజీ చిత్రాల్లో నటిస్తూ సంయుక్త బిజీ బిజీగా ఉంది.

అందాల భాగ్యం క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్

గత ఏడాది రవితేజ హీరోగా వచ్చిన మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ఉత్తరాది ముద్దుగుమ్మ భాగ్యశ్రీ బోర్సే. ఈ అమ్మడు హిందీ చిత్రం యూరియాన్ 2 తో 2023 లో తెరంగేట్రం చేసింది. ఆ సినిమా పెద్దగా ఆడకున్నా కూడా గుర్తింపు తెచ్చి పెట్టింది. ఆ తర్వాత కొన్ని సంస్థలకు మోడలింగ్ చేయడం ద్వారా దర్శకుడు హరీష్ శంకర్ దృష్టిలో పడింది. నైజీరియాలోని లాగోస్ లో భాగ్యశ్రీ బోర్సే చదివింది. ఇండియా తిరిగి వచ్చిన తర్వాత బిజినెస్ మేనేజ్మెంట్ లో డిగ్రీ చేసింది. ఆ సమయంలోనే మోడలింగ్ వైపు అడుగులు వేసింది. పలు కంపెనీలతో కలిసి బ్రాండ్ అంబాసిడర్గా వ్యవహరించడంతో మంచి గుర్తింపు సొంతం చేసుకుంది. ముఖ్యంగా క్యాడ్‌బరీ డైరీ మిల్క్ సిల్క్ యాడ్ ద్వారా ఈమెకు మంచి ఫాలోయింగ్ దక్కింది. యాడ్స్ ద్వారా వచ్చిన గుర్తింపు కారణంగా సినిమాల్లో ఆఫర్లు దక్కాయి. రెండేళ్లుగా సినిమాలు చేస్తున్న ఈ అమ్మడికి సరైన బ్రేక్ దక్కలేదు. హిందీలో రెండు సినిమాలు, తెలుగులో రెండు సినిమాలు చేసిన భాగ్యం ఇప్పటి వరకు మంచి విజయాన్ని సొంతం చేసుకోలేక పోయింది. అయితే సినిమా సినిమాకు నటిగా మంచి గుర్తింపు దక్కించుకుంటున్న ఈ అమ్మడు ముందు ముందు స్టార్ హీరోల సినిమాల్లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా నటించే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ అమ్మడి యొక్క సినిమాలు ఏమీ లేవు. కానీ రెండు మూడు చర్చల దశలో ఉన్నాయి. ఇటీవలే ఈమె కింగ్డమ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా భాగ్యశ్రీ రెగ్యులర్‌గా అందమైన ఫోటోలు షేర్ చేస్తూ ఉంటుంది. వైట్ స్లీవ్‌లెస్ టాప్ ను ధరించిన భాగ్యశ్రీ ఒక రెస్టారెంట్‌లో కూల్ అండ్ స్వీట్‌గా ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తూ ఆకట్టుకుంది. సింపుల్ అండ్ క్యూట్ లుక్‌లో భాగ్యశ్రీ చాలా అందంగా ఉందని నెటిజన్స్ అంటున్నారు. సాధారణంగా చాలా మంది హీరోయిన్స్ మినిమం మేకోవర్ అయితే తప్ప బయటకు రారు. కానీ ఈమె మాత్రం మేకప్ లేకుండానే బయటకు వచ్చింది, మేకప్ లేకున్నా ఈమె చాలా అందంగా ఉందని నెటిజన్స్ అంటున్నారు. సినిమాల్లో చూసిన దానికంటే ఇలాగే మరింత అందంగా ఉందని కొందరు అంటున్నారు. మొత్తానికి భాగ్యశ్రీ అందం ఓ రేంజ్ లో ఉండటంతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. భాగ్యశ్రీ బోర్సే ముందు ముందు మరిన్ని అందమైన ఫోటోలను షేర్ చేయాలని కామెంట్స్ చేస్తున్నారు.

కొత్త షెడ్యూల్ కోసం భారీ ప్లాన్స్

టాలీవుడ్ లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న సినిమాల్లో రాజమౌళి దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా రూపొందుతున్న ఎస్ఎస్ఎంబీ29 కూడా ఒకటి. ఫారెస్ట్ అడ్వెంచర్ డ్రామాగా పాన్ వరల్డ్ సినిమాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో మహేష్ కొత్త లుక్ లో చాలా డిఫరెంట్ గా కనిపించనున్నారని ఇప్పటికే ఆయన లుక్ చూస్తుంటే తెలుస్తోంది. మామూలుగా అన్ని సినిమాలనూ అనౌన్స్ చేశాకే సెట్స్ పైకి తీసుకెళ్లే రాజమౌళి ఈ సినిమాను మాత్రం ఎలాంటి అనౌన్స్‌మెంట్ లేకుండా చాలా సైలెంట్ గా పూజా కార్యక్రమాలతో మొదలుపెట్టి శరవేగంగా షూటింగ్ ను పూర్తి చేస్తున్నారు. దీంతో సినిమాకు సంబంధించిన అనౌన్స్‌మెంట్ విషయంలో ఫ్యాన్స్ చాలా కాలంగా ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పలు షెడ్యూళ్ల షూటింగ్ ను పూర్తి చేసుకున్న ఎస్ఎస్ఎంబీ29 ఇప్పుడు తర్వాతి షెడ్యూల్ కు సిద్ధమవుతుంది. అందులో భాగంగానే ఆగస్ట్ 21 నుంచి మేకర్స్ ఈ సినిమా కొత్త షెడ్యూల్ ను ప్లాన్ చేశారని తెలుస్తోంది. ఈ షెడ్యూల్ లో పలు కీలక సన్నివేశాలను ప్రధాన పాత్రధారులపై తెరకెక్కించనున్నారట. కాగా రీసెంట్ గా ఈ సినిమా నుంచి మహేష్ బర్త్ డే సందర్భంగా ఓ ప్రీ లుక్ ను రిలీజ్ చేయగా దానికి ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. రూ.1000 కోట్ల భారీ బడ్జెట్‌తో.. యాక్షన్ అడ్వెంచర్ గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయి ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రల్లో నటిస్తుండగా, మరికొందరు ఇంటర్నేషనల్ యాక్టర్లు కూడా ఈ ఎస్ఎస్ఎంబీ29లో భాగమయ్యే అవకాశాలున్నాయి. సుమారు రూ.1000 కోట్ల భారీ బడ్జెట్ తో రూపొందుతున్న ఈ సినిమాను కె.ఎల్ నారాయణ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.



చీర కట్టులో వింక్‌బ్యూటీ అందం చూశారా?

మలయాళ సినిమా 'ఒరు అదార్ లవ్'తో ఒక్కసారిగా స్టార్‌డం దక్కించుకున్న ముద్దుగుమ్మ ప్రియా ప్రకాష్ వారియర్. తక్కువ సమయంలోనే ఈ అమ్మడు మోస్ట్ పాపులర్ కావడానికి ప్రధాన కారణం ఒరు అదార్ లవ్ లోని పాటలో ముద్దుగన్ పేల్చడం, కన్ను గీటడం అనే విషయం తెల్సిందే. ఓవర్ నైట్‌లో సోషల్ మీడియా సెన్సేషన్ అయిన ఈ వింక్ బ్యూటీ సినిమాల్లో వరుసగా నటించింది. మొదటి సినిమా ఒరు అదార్ లవ్ ఫ్లాప్ కాగా, ఆ తర్వాత సినిమాలన్నీ కూడా బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడ్డాయి. ఒకటి రెండు సినిమాలు కాస్త పర్వాలేదు అన్నట్లుగా నిలిచినా ఓవరాల్‌గా హీరోయిన్‌గా ప్రియా ప్రకాష్ వారియర్‌కి కచ్చితంగా తీవ్రంగా నిరాశను మిగిల్చాయి అనడంలో సందేహం లేదు. ఆమె నటిగా మరిన్ని సినిమాలు చేస్తుందా లేదా అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా ఉంది. ఓవర్ నైట్ స్టార్‌డం దక్కడంతో సోషల్ మీడియాలో మిలియన్‌ల కొద్ది ఫాలోవర్స్‌ను దక్కించుకున్నారు. దాదాపుగా 77 లక్షల మందిని ఫాలోవర్స్‌గా కలిగి ఉన్న ఈ అమ్మడు రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఎక్కువగా స్కిన్ షో ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలిచే ఈ అమ్మడు అప్పుడప్పుడు చీర కట్టు ఫోటోల వల్ల వార్తల్లో నిలుస్తూ ఉంటుంది అనే విషయం తెల్సిందే. తాజాగా ఈమె ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేసిన ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా చీర కట్టు ఫోటోల్లో ఈ అమ్మడి అందంకు ప్రతి ఒక్కరూ ఫిదా అవుతున్నారు. ఈ స్థాయి అందంగా ఉన్న ప్రియా ప్రకాష్ వారియర్‌కి అదృష్టం కలిసి రావడం లేదని, అందుకే ఆఫర్లు పెద్దగా రావడం లేదని కొందరు అంటున్నారు. చేసిన చిన్నా చితకా సినిమాలు పెద్దగా కలిసి రావడం లేదు. అందుకే ప్రియా ప్రకాష్ వారియర్ ప్రస్తుతం పెద్దగా సినిమాలు చేయడం లేదు. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఉన్న ఈఅమ్మడు ముందు ముందు మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నారు. ముఖ్యంగా ఇలాంటి అందమైన చీర కట్టు ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటుంది. ఈసారి చీర కట్టులో కాస్త ఓల్డ్ గెటప్‌లో, ఏజ్ ఎక్కువ ఉన్న సాదారణ గృహిణి మాదిరిగా ప్రియా ప్రకాష్ ఫోటోలు ఉన్నాయి. అందమైన ప్రియా ప్రకాష్ వారియర్ ఇలా కూడా చాలా అందంగా ఉందని కొందరు అంటున్నారు. నడుము అందం చూపిస్తూ ప్రియా ప్రకాష్ వారియర్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

ఏడాది తర్వాత నోరు విప్పిన టిల్లు లిల్లీ

డీజే టిల్లు సినిమాతో సిద్దు జొన్నలగడ్డ ఒక్కసారిగా స్టార్ అయ్యాడు. హీరోగా ఆయనకు మంచి క్రేజ్‌ను తెచ్చి పెట్టిన సినిమాగా డీజే టిల్లు నిలిచింది. ఆ సినిమా సూపర్ హిట్ నేపథ్యంలో వెంటనే ఫ్రాంచైజీలో టిల్లు స్క్వేర్ సినిమాను తీసుకు వచ్చారు. టిల్లు స్క్వేర్ సినిమాకు పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. సితార ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌లో వచ్చిన ఈ ఫ్రాంచైజీలో మరో సినిమా సైతం వచ్చే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. డీజే టిల్లు సినిమాలో హీరోయిన్‌గా నేహా శెట్టి నటించగా, టిల్లు స్క్వేర్ సినిమాలో అనుపమ పరమేశ్వరన్ నటించిన విషయం తెల్సిందే. టిల్లు స్క్వేర్‌లో లిల్లీ పాత్రలో నటించిన అనుపమ తన అందంతో పాటు, కొన్ని రొమాంటిక్ సీన్స్‌తో సర్‌ప్రైజ్ చేసింది. అంతకు ముందు ఎప్పుడూ అలాంటి పాత్రను అనుపమ చేయలేదు. అనుపమ మరీ ఇంత బోల్డ్‌గా కనిపించింది ఏంటి అంటూ అంతా సర్‌ప్రైజ్ అయ్యారు. ఆ సినిమాకు మంచి రెస్పాన్స్ వచ్చినప్పటికీ అనుపమ ఇమేజ్‌కి డ్యామేజ్ ను కలిగించింది అంటూ చాలా మంది చాలా రకాలుగా విమర్శించారు. అనుపమ పరమేశ్వరన్ విషయంలో కొందరు ప్రశంసలు సైతం కురిపించారు. కానీ అంతకు ముందు అనుపమ చేసిన సినిమాలను పోల్చుతూ చాలా మంది చేసిన విమర్శలు చర్చనీయాంశం అయ్యాయి. లిల్లీ పాత్రకు అవసరం ఉన్నా లేకున్నా కాస్త ఎక్కువగానే రొమాంటిక్ సీన్స్‌లో అనుపమ పరమేశ్వరన్ నటించిందని, అందుకోసం ఆమెను ఎలా ఒప్పించారో అర్థం కాలేదు అంటూ కామెంట్స్ చేస్తున్న వారు చాలా మంది ఉన్నారు. ఆ సమయంలో సిద్దుతో రిలేషన్‌లో ఉన్న కారణంగానే అనుపమ ఆ సీన్స్ కి ఒప్పుకుందనే వార్తలు వచ్చాయి. టిల్లు స్క్వేర్‌లో అనుపమ పరమేశ్వరన్ చేసిన పాత్ర గురించి చాలా కాలంగా వార్తలు వస్తూనే ఉన్నాయి. ఇప్పుడు అనుపమ ఆ విషయమై స్పందించింది. తాను టిల్లు స్క్వేర్ లో చేసిన పాత్ర విషయంలో అసంతృప్తిగా ఉన్నట్లు పేర్కొంది. అయితే సినిమా హిట్ కావడం సంతోషాన్ని కలిగించింది అని అంది. ఆ సినిమాలోని పలు సీన్స్ చేసే సమయంలో నేను కంఫర్ట్‌గా లేను, అయినా కూడా చేయాల్సి వచ్చింది. ఆ పాత్ర బాగా లేదని నేను అనడం లేదు, కానీ ఆ పాత్ర సెట్ కాలేదని మాత్రం నేను బలంగా నమ్ముతున్నాను. ఆ సీన్స్ లో, ఆ పాత్రలో నన్ను నేను చూసుకున్నా కాస్త ఇబ్బందిగానే ఉంది అన్నట్లుగా అనుపమ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

మద్యం లొల్లి!

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

తణుకు : వసతిగృహ నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. తణుకు సాంఘిక సంక్షేమ వసతి గృహం ఆమె పరిశీలించారు. వర్షం నీరు చేరడంతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం సమీప బీసీ కళా శాల బాలికల వసతి గృహానికి విద్యార్థులను తరలించారు. ఆ సమయంలో వసతిగృహ సంక్షేమాధికారి లేకపోవడంతో తహసీల్దార్ అశోక్‌వర్మ, మునిసిపల్ కమిషనర్ రామ్‌కుమార్ పరిస్థితిని చక్కదిద్దడంతో కలెక్టర్ అభినందించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్‌డబ్ల్యువోను హెచ్చరించారు. అనంతరం తాత్కాలిక వసతి కల్పించిన బీసీ కళాశాల వసతి గృహంలో విద్యార్థినులతో మాట్లాడారు. జిల్లా సాంఘిక సంక్షేమాధి కారి రామాంజనేయరాజు, వసతిగృహ అధికారి అరుణ, తహసీల్దార్ డీవీ ఎస్ఎస్ అశోక్‌వర్మ, మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ పాల్గొన్నారు.

రోగులకు సేవతో కూడిన వైద్యం అందించాలి

రోగులకు సేవతో కూడిన వైద్యం అందించాలని కలెక్టర్ నాగరాణి అన్నా రు. జిల్లా కేంద్ర ఆస్పత్రినిఆమె తనిఖీ చేశారు. ఆసుపత్రి అభివృద్ధి పనులు, డ్రెయిన్లు, మరుగుదొడ్లు నిర్మాణాలను పరిశీలించారు. పలు వైద్య విభాగాలు పరిశీలించి రోగులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. వార్డుల్లో రోగులకు అందుతున్న సేవలు, ఇబ్బం దులను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల కొరత, సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.సాయి కిరణ్, ఆర్ఎంవో ఏవీఆర్ఎస్.తాతారావు, పలు విభాగాల వైద్యులు ఉన్నారు.

రైవస్ కాలువే ప్రత్యామ్నాయం

విజయవాడ : నగరంలోని రెండు నియోజకవర్గాలకు రైవస్ కాల్వ అనుసంధానమవుతుంది. ప్రకాశం బ్యారేజీ నుంచి మొదలయ్యే కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ పోలీసు కంట్రోల్ రూమ్ దగ్గర మూడు పాయలుగా చీలుతుంది. బందరు కాల్వగా, రైవస్ కాల్వగా, ఏలూరు కాల్వగా రూపాంతరం చెందుతుంది. రైవస్ కాల్వ పశ్చిమ నియోజకవర్గం నుంచి ప్రారంభమవుతుంది. ఇది సెంట్రల్ నియోజకవర్గంలోని శివారు ప్రాంతాల మీదుగా దిగువకు వెళ్లి బుడమేరులో కలుస్తుంది. తూర్పు నియోజకవర్గం కాల్వకు ఎగువన ఉండటం వల్ల మేజర్ అవుట్ ఫాల్ డ్రెయిన్లను రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, ఆటోనగర్ గుంటుతిప్ప డ్రెయిన్ల మీదుగా రైవస్ కాల్వకు అనుసంధానం చేయొచ్చు. ఈ కాల్వ నగరం నుంచి దిగువకు ప్రవహిస్తుండటం వల్ల వర్షపు నీటిని సునాయాసంగా దిగువకు తీసుకెళ్లవచ్చు.

వర్షపు నీటిని తేలిగ్గా మళ్లించవచ్చు

బందరు, ఏలూరు కాల్వలను దిగువ ప్రాంతాల్లో సాగు, మంచినీటి కోసం ఉపయోగిస్తారు. వెలగలేరు నుంచి వచ్చే బుడమేరు దిగువకు డ్రెయినేజీ నీటి పంపింగ్‌కు ఉపయోగపడుతుంది. ఏలూరు కాల్వను కూడా డ్రెయినేజీ పంపింగ్‌కు ఉపయోగిస్తున్నారు. రైవస్ కాల్వను డ్రెయినేజీ కాల్వగా కాకుండా స్ట్రామ్ వాటర్ డ్రెయిన్‌గా ఉపయోగించుకోవడం ద్వారా నగరంలో వర్షపు నీటిని తేలిగ్గా దిగువకు పంపే అవకాశం ఉంటుంది.

మెగా స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ కోసం ఏం చేయాలి?

మెగా స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ కోసం.. నగరంలోని ఇతర స్ట్రామ్ వాటర్ డ్రె యిన్లు, మేజర్ అవుట్ ఫాల్ డ్రెయిన్లను విస్తరించి వర్షపునీటి పారుదలకు వాలుగా రైవస్ కాల్వలో కలిసేలా ఏర్పాటు చేయాలి.

కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్ కాల్వలోకి వచ్చే నీటిని నియంత్రించడానికి వీలుగా తుమ్మలపల్లి కళాక్షేత్రం దిగువన రెగ్యులేట్ చేయటానికి లాకులను ఏర్పాటు చేయాలి. వర్షాకాలంలో నీటిని మళ్లించటానికి వీలుగా చర్యలు చేపట్టవచ్చు.

చిక్కడపల్లిలో బంగారం దోపిడి

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గత కొంత కాలంగా వరుస దొంగతనాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో దోపిడీ దొంగలు స్వైరవిహారం చేస్తున్నారు. వరుస చోరీలతో నగర వాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. ఇటీవల జరిగిన చందానగర్ ఖజానా జ్యువెలరీ దుకాణంలో భారీ చోరీ జరిగిన సంగతి తెలిసిందే. దీనిని మరువక ముందే.. కొన్ని రోజుల క్రితం కేపీహెచ్‌బీ కాలనీలోని 7వ ఫేజ్‌లో ఎంఐజీ 14లో నివాసముంటున్న రిటైర్డ్ తహసీల్దార్ ఇంట్లో భారీ చోరీ జరిగింది. తహసీల్దార్ ఇంట్లో దొంగ ముఠా ప్రవేశించి భారీగా బంగారు ఆభరణాలను అపహరించారు. తాజాగా తెల్లవారుజామున నగరంలో మరో దొంగతనం జరిగింది. హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలోని ఓ ఇంట్లో భారీగాబంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. చిక్కడపల్లిలో నివాసముంటున్న రిటైర్డ్ ఉద్యోగి నారాయణ ఇంట్లో తెల్లవారుజామున దొంగలు చొరబడ్డారు. ఇంట్లో ఉన్న 36 తులాల బంగారు ఆభరణాలతో పాటు విలువైన వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ చోరీపై బాధితుడునారాయణ చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. చోరీ జరిగిన ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దొంగల ముఠాను చేధించి అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బాలిక రేప్ కేసులో నటి అరెస్ట్

తిరువనంతపురం : ఆమెకు 16 ఏళ్లు.. సినిమాల్లో నటించడం అంటే ఇష్టం.. అది వాళ్లకు సాకుగా మారింది.. సినిమాల్లో అవకాశం ఇప్పిస్తామంటూ నమ్మబలికారు.. దీంతో వారి మాయమాటలకు ఆ బాలిక పడిపోయింది.. సినిమాల్లో ఎలాగైనా నటించాలని.. చివరకు వాళ్ల దగ్గరకు వెళ్లింది.. అలా వెళ్లిన ఆమెపై హీరోయిన్ సమక్షంలో.. నలుగురు అఘా?యిత్యానికి పాల్పడ్డారు.. ఇది జరిగిన పదేళ్ల తర్వాత ఆ యువతి.. తనపై జరిగిన అఘాయిత్యం గురించి తల్లిదండ్రులతో చెప్పి.. పోలీసులను ఆశ్రయించింది.. ఇంతకాలం భయంతో గడిపిన ఆ యువతి.. తల్లిదండ్రులతో కలిసి పోలీసులను ఆశ్రయించింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు.. బాలికపై అత్యాచారం కేసులో ఓ హీరోయిన్ ను అరెస్ట్ చేయడం సంచలనంగా మారింది. సినిమాల్లో అవకాశం ఇప్పిస్తానంటే నమ్మి చెన్నై వచ్చిన 16 ఏళ్ల బాలికపై నలుగురు వ్యక్తులు అత్యాచారానికి ఒడిగట్టారని.. ఈ కేసులో మలయాళ సినీ నటి మిను మునీర్ (51) ను పోలీసులు అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. పదేళ్ల క్రితం మిను మునీర్ సినిమాల్లో నటించేలా చేస్తానని చెప్పి తన బంధువు కుమార్తె అయిన 14 ఏళ్ల బాలికను చెన్నై తీసుకొచ్చింది.. ఆ తర్వాత ఓ ప్రైవేటు హోటల్‌లో ఆ బాలికను ఉంచింది. ఆ సమయంలో నలుగురు వ్యక్తులు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. వారి నుంచి తప్పించుకున్న బాధితురాలు పదేళ్ల తర్వాత ఈ ఏడాది మార్చిలో పోలీసులకు ఫిర్యాదు చేసింది.. ఈఘటనపై కేసు నమోదు చేసిన చెన్నై తిరుమంగళం ఆల్ ఉమెన్ పోలీసులు నటి మిను మునీర్‌ను గురువారం అరెస్టు చేశారు.. అనంతరం చెన్నైకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఆ యువతికి 26 ఏళ్లని ఆ బాలిక గతసంవత్సరంకేరళలో ఫిర్యాదు చేసిందని పోలీసులు తెలిపారు. 2014లో పాఠశాల సెలవుల్లో, తన కుమార్తెను తనదూరపుబంధువు మినుతో కలిసి సినిమాలో పాత్ర కోసం చెన్నైకి పంపిందని బాధితురాలి తల్లి ఆరోపించింది.

ఇళ్ల మధ్య సెల్ టవర్ వద్దు..

ముసునూరు : మండలంలోని అక్కిరెడ్డిగూడెంలో నివాస గృహాల మధ్య నిర్మిస్తున్న సెల్ టవర్‌ను తక్షణమే నిలిపివేయాలని స్థానికులు అధికారులను కోరారు. కలెక్టర్ వెట్రిసెల్వి, నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న, ఎంపీడీవో సత్యనారాయణలకు స్థానికులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం ప్రజాభిప్రాయ సేకరణ గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మీసత్యనారాయణ, ఇన్‌చార్జ్ కార్యదర్శి సయ్యద్ మోబీనల ఆధ్వర్యంలో గ్రామసభ జరపగా సభకు హాజరైన 200 మంది సెల్ టవర్ ఏర్పాటును వ్యతిరేకిస్తున్నట్టు అధికారుల సమక్షంలో సంతకాలు చేసి తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఏలూరు : నగర పంచాయతీలు, మున్సిపాల్టీలు, కార్పొ రేషన్‌లు.. ఎక్కడైనా బార్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఎంచక్కా ఉదయం 10 గంటల నుంచి అర్ధరాత్రి వరకు 14 గంటలు పాటు వ్యాపారం చేసుకోవచ్చు. ఆనాటి వైసీపీ ప్రభుత్వం పాటించిందీ.. వేలం పాట. ఇప్పటి కూటమి ప్రభుత్వం పాటించబో తుందీ.. లాటరీ విధానం. పాత మద్యం పాలసీ మదింపు చేసి మరిన్ని నిర్ణయాలు. తద్వారా అదనపు ఆదాయం రాబట్టాలనేదే అసలు లక్ష్యం. ఇంకోవైపు వైన్‌షాపు పక్కనే మినీ బార్ (పర్మిట్ రూమ్)లు. ఇదే మద్యం వ్యాపారుల్లో కొంత గందర గోళానికి దారితీసింది. ఇంతకుముందు మాదిరిగా బార్‌లు ఏర్పాటు చేసుకుంటే దానికి తగ్గట్టుగానే మద్యం వ్యాపారం చేసుకునే పరిస్థితులు లేవని, ఎవరైనా కొత్త మొఖాలు చూసుకోండంటూ ఇంతకు ముందే బార్ యజమానులుగా ఉన్న వారంతా ఎక్సైజ్ అధికారుల ఎదుట తేల్చేశారు. గతంలో ఉన్నట్లుగా బార్‌లు సంఖ్య ఉంటుందా, లేకుంటే మరింత పెరుగుతాయా.. ఇదే సందిగ్ధం. నూతన మద్యం పాలసీ కాస్త కొంత మంది వ్యాపారుల చెంప చెళ్లుమనిపించింది. పాలసీలో అనేక ఆంక్షలు విధించింది. పాత పద్ధతిని మార్చే శారు. మద్యం అమ్మకాల ద్వారా అత్యధిక ఆదా యం లభించాలనే లక్ష్యంతోనే వ్యవహరించారు. ఏకంగా ఒకవైపు కొత్తగా బార్‌ల లైసెన్సులు పొందాలంటే దరఖాస్తు రూపంలో రూ.ఐదు లక్షలు నాన్ రిఫండబుల్ (వెనుకకు ఇవ్వని) కింద చెల్లించాల్సిందే. ఇంకోవైపు ఒక బార్‌కి నాలుగు దరఖాస్తులు వస్తేనే తప్ప లాటరీ విధానం అమ లులో ఉంటుందని షరతు విధించారు. ఇంతకు ముందు బార్ లైసెన్సు పొందేందుకు ఈ వ్యాపా రంలో అనుభవం ఉన్న హేమాహేమీలు రంగం లోకి దిగేవారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే దానికి అనుకూలంగా ఉన్న నేతలు, ఎమ్మెల్యేలు రంగం లోకి దిగి బార్‌లు, వైన్‌షాపులు సొంతం చేసు కోవడం ఆనవాయితీగా మారింది. గత ప్రభుత్వం లో ఒక బార్ లైసెన్సు గడువు ఐదేళ్లుగా ఉండేది. తాజా మద్యం విధానంలో ఈ గడువు కాస్త మూడేళ్లకు కుదించారు. అంటే ప్రతీ ఏడాది జాగ్రత్తగా వ్యాపారం చేసుకుంటేనే ఒడ్డెక్కేది. కానీ కూటమి ప్రభుత్వం ఒక వైపు బార్ లైసెన్సు విధానంలో మార్పులు, చేర్పులకు దిగింది. ఇంకో వైపు ప్రభుత్వం నిర్దేశించనట్లుగానే మాత్రమే అమ్మ కాలు సాగించాలని, 99 రూపాయల రకం అమ్మ కానికి వీల్లేదని కఠిన ఆంక్ష విధించింది. ఇంకోవైపు బార్‌లకు లైసెన్సులు ఇస్తూనే మరోవైపు దీనికి సమాంతరంగా పర్మిట్ రూమ్‌లను అనుమతించడం ఒక్కసారిగా మద్యం వ్యాపారులను షాక్‌కు గురి చేసింది. ఒక్కొ బార్‌కు స్థాయిని బట్టి 15 నుంచి 20 మంది రోజూవారీ పనిచేయడానికి నియమిం చుకోవాల్సి ఉంది. తగినంత విస్తీర్ణంలో మాత్రమే బార్‌లు ఏర్పాటు చేయాలి. దీనికి అదనంగా కరెంటుతో సహా వివిధ ఖర్చులు ఉండనే ఉంటాయి. కానీ కొత్త విధానం ప్రకారం అమల్లోకి వచ్చే బార్‌లు ఇంతకుముందులా కాకుండా ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకు తెరిచి ఉంచేలా కొంత సడలింపు ఇచ్చారు.

సిక్కోలులోను భర్తను చంపి..

శ్రీకాకుళం : ప్రియుడి మోజులో మాంగళ్య బంధం అడ్డుగా ఉందన్న కారణంగా ఓ భార్య.. మర్డర్ స్కెచ్ వేసింది. ప్రియుడితో కలిసి భర్తను చంపేసి చేతులు దులిపేసుకుంది. కానీ చేసిన పాపం వెంటాడటంతో ప్రియుడితోపాటు కటకటాల పాలైంది. ఈ షాకింగ్ ఘటన శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో జరిగింది. టెక్కలి డీఎస్పీ డి.లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం..శ్రీకాకుళం పాతపట్నంలోని మొండిగొల్లవీధికి చెందిన నల్లి రాజు (34)కు ఎనిమిదేళ్ల కిందట మౌనిక అనే యువతితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు అబ్బాయిలు సంతానం. అయితే మౌనికకు స్థానికంగా ఉండే గుండు ఉదయ్ కుమార్‌తో ఇటీవల వివాహేతర సంబంధం ఏర్పడింది. అటు ఉదయ్‌కుమార్‌కు కూడా అప్పటికే వివాహం జరిగింది. వీరి వ్యవహారం మౌనిక భర్తకు తెలియడంతో తీరు మార్చుకోవాలని భార్యను వలుమార్లు మందలించాడు. అయితే మౌనికలో మార్పురాకపోగా ప్రియుడితో కలిసి భర్త అడ్డు తొలగించాలని ప్లాన్ వేసింది. ఉదయ్‌కుమార్ కూడా తన భార్యకు విడాకులిచ్చి ఇద్దరూ కలిసి జీవించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఉదయ్ కుమార్ ఆడవేషం ధరించి రాజును రాత్రి వేళ నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లడానికి వాట్సప్‌లో మెసేజ్‌లు పంపించాడు. రాజు తిరస్కరించడంతో ఈ ప్రయత్నం విఫలమైంది. రాజు మత్తులో ఉండగా ఇంట్లోనే చంపాలని మరో కుట్ర పన్నారు. అనంతరం ఇంట్లోనే రెండు రోజుల పాటు మౌనిక భర్త రాజుకు ఆహారంలో నిద్ర మాత్రలు కలిపింది. ఆగస్టు 5వ తేదీన అర్ధరాత్రి రాజు నిద్రపోయిన తర్వాత ఉదయ్‌తోపాటు మల్లిఖార్జున్ అనే మరో వ్యక్తికి ఫోన్ చేసి పిలిపించింది. నిద్రలో ఉన్న రాజు కాళ్లను మౌనిక, మల్లిఖార్జున్ కదలకుండా గట్టిగా పట్టుకోగా, ఉదయ్ అతని ముఖంపై దిండుతో అదిమి ఊపిరిఆడకుండా చేసి హత్య చేశారు. ఆ తర్వాత రాజు బైక్‌ను స్థానిక ఎస్సీ కాలనీలో ఉంచారు. ఉదయ్, మల్లికార్జున్‌లు మరో బైక్‌పై రాజు మృతదేహాన్ని తీసుకొచ్చి రాజు బైక్ ఉంచిన ప్రాంతంలో పడేసి వెళ్లిపోయారు. ఈ తర్వాత భర్త కనిపించడంలేదంటూ మౌనిక కుటుంబసభ్యులకు ఫోన్ చేసి నాటకం మొదలెట్టింది. ఆగస్టు 7న ఉదయం స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మౌనిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసుపెట్టారు. సీసీ కెమెరాలు పరిశీలించగా అసలు గుట్టురట్టైంది. దీంతో ఉదయ్‌కుమార్, మల్లికార్జున్‌తోపాటు మౌనికను అరెస్ట్ చేసి తమదైన శైలిలో ప్రశ్నించగా నేరం అంగీకరించారు

చేపల సీడ్ పంపిణీకి గ్రీన్‌సిగ్నల్

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం - ఈసారి ముందస్తుగానే టెండర్ల ప్రక్రియ షురూ

యాదాద్రి : మత్స్యకారులకు ఆర్థికంగా చేయూత ఇచ్చేందుకు ఉచితంగా చేపపిల్లల పంపిణీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు నెలాఖరులోగా టెండర్లు పూ ర్తి చేసి, సెప్టెంబరు 15లోగా చేప పిల్లల పంపిణీ ప్రక్రియను పూర్తిచేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. తాజాగా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతోంది. ఈ నేపథ్యంలో చేపపిల్లల పంపిణీకి ప్రభుత్వం ఆమోదముద్ర వేయడంతో మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో చేప పిల్లల పంపిణీకి అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. వారంలో రోజుల్లోగా సాగునీటి శాఖల నివేదిక మేరకు జిల్లాలోని చెరువుల్లో నీటి సామర్థ్యాన్ని బట్టి చేప పిల్లలు పంపిణీచేయనున్నా రు. మత్స్యకారులకు ప్రభుత్వం ఏటా ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తోంది. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలోనూ చేప పిల్లల పంపిణీకి సంబంధిత శాఖ అధికారులు ప్రణాళికను రూపొందించారు. జిల్లా హైదరాబాద్ నగరానికి చేరువలో ఉంది. ప్రతీ ఆదివారం జిల్లాలోని ప్రధాన రహదారాలపై జోరుగా చేపల విక్రయాలు జరుగుతుంటాయి. అంతేగాక మత్స్యకారులు ఇక్కడి నుంచి నగరానికి చేపలు తరలించి అక్కడ విక్రయిస్తుంటారు. మార్కెటింగ్ సౌకర్యం కూడా ఉండటంతో చేపల పెంపకంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టిపెట్టింది.

సామర్థ్యం ప్రకారం చేప పిల్లల పంపిణీ...వానాకాలం సీజన్‌లో ప్రస్తుతం భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చాలా చెరువుల్లోకి నీరు చేరిం ది. ఈ నేపథ్యంలో చేపలు పెంచేందుకు వీలున్న చెరువుల్లో పిల్లలను (సీడ్) వదిలేందుకు మత్స్యశాఖ అధికారులు నిర్ణయించారు. జిల్లాలో మొత్తం 1,115 చెరువులు ఉన్నాయి. ఈ సీజన్‌లో భారీ వర్షాలు కురిసిన పక్షంలో జిల్లావ్యాప్తంగా 2.16కోట్ల చేప పిల్లలను చెరువుల్లో వదిలేందుకు మత్స్యశాఖ అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు రూపొందించారు. జిల్లావ్యాప్తంగా 142 మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో 134 పురుష సభ్యుల సంఘాలు ఉండగా, మొత్తం 8,336 మంది మత్స్యకారులు ఉన్నా రు. మరో తొమ్మిది మహిళా సంఘాల్లో 593 సభ్యులు ఉన్నారు. వీరంతా చేపల పెంపకం, విక్రయంపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరికి ఉచితంగా ప్రభుత్వం చేపపిల్లలను పంపిణీ చేస్తోంది. గతంలో జిల్లా వ్యాప్తంగా 400 చెరువుల్లో చేపలను పెంచారు. ఈ సీజన్‌లో కూడా నీటి వనరుల నిల్వను బట్టి సుమారు 550 చెరువుల్లో చేపల పెంపకానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మత్స్యకారులు చేపలు విక్రయించేందుకు వీలుగా మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు కూడా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ముందస్తుగానే టెండర్ల ప్రక్రియ

గత ఏడాది చేప పిల్లల పంపిణీకి ఆలస్యంగా టెండర్ల ప్రక్రియ మొదలైంది. చేపపిల్లలను అక్టోబరులో పంపిణీ చేయడంతో చెరువుల్లో చేపలు ఎదగలేదు. దీంతో మత్స్యకారులు అనుకున్నమేర లాభాలను పొందలేకపోయారు. చెరువుల పరిమాణానికి మించి చేపపిల్లలను(సీడ్) వేస్తుండటంతో ఆశించిన స్థాయిలో అవి ఎదగక మత్స్యకారులు ఉపాధి కోల్పోయారు.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తుగానే టెండర్లు ఖాయం చేసేందుకు సన్నాహాలు ప్రారంభించింది. గత అనుభవాల దృష్ట్యా ఈ సీజన్‌లో చెరువుల్లో నీటినిల్వ ఆధారంగా చేప పిల్లలను వదిలేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని చెరువుల పరిమాణం, నీటి లభ్యతపై మత్స్యశాఖ సమగ్ర సమాచారాన్ని సేకరిస్తోంది. ఈ మేరకు నివేదిక అందించాలని తహసీల్దార్లకు జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా వ్యాప్తంగా ఎన్ని ఎకరాల్లో చెరువులు ఉన్నాయి? శిఖం భూమి ఎంత? ఎంతమేరకు నీటినిల్వ ఉంది? అనే సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్నారు. తహసీల్దార్లు ఇచ్చిన నివేదిక ఆధారంగా చెరువుల్లో చేపపిల్లలను వదలనున్నారు. జిల్లాలోని చెరువుల్లో కట్ల, రోహు, మ్రిగాల, కామన్‌కార్ప్ రకాల సీడ్‌ను, రొయ్య పిల్లలను వదలనున్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

అచ్చంపేట :రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉంది. పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే పట్టణాలు, గ్రామాల అభివృద్ధికి బాటలు వేస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపా ధి కల్పన, గనులశాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో రూ.3 కోట్లతో నిర్మించిన మునిసిపల్ కార్యాలయ భవనాన్ని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కలెక్టర్ బదావత్ సంతోష్‌లతో కలిసి ఆయన సోమవారం ప్రారంభించారు.

ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఈ భవనం ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలోనే ఇంత సుందరమైన మునిసిపల్ భవనాన్ని ప్రారం భించడం చాలా సంతోషంగా ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కృషితోనే ఇంతటి గొప్ప భవనాన్ని నిర్మించుకున్నామని తెలిపారు. ప్రతీ నివాసానికి శుద్ధమైన తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాల న్నారు. వర్షాకాలంలో మురు గు కాల్వలను తప్పకుండా శుభ్రం చేయాలని సూచించారు.

రాజకీయ సేవకు ప్రతిఫలం సస్పెన్షన్

అలంపూరు : రాజకీయ సేవలో తరించేందుకు వెళ్లిన ముగ్గురు అర్చకులపై వేటుపడింది. సహకరిం చిన ఈవోపై కుడా చర్యలు తీసుకుంటూ ఉ త్తర్వులు జారీ అయినట్లు తెలిసింది. శ్రీజోగు ళాంబ ఆలయంలో పనిచేసే ప్రముఖ అర్చకులు విక్రాంత్‌శర్మ, వెంకటస్వామి, కృష్ణమూర్తి ఈనెల 6న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సోదరుడి కూతురికి బుగ్గన రాజేందర్ కుమా రుడికి డోన్ పట్టణంలో జరిగిన వివాహంలో ఆశీర్వచనాలు అందిస్తూ కనిపించారు. నిబం ధనల ప్రకారం ఆలయ అర్చకులు ప్రైవేట్ కా ర్యక్రమాల్లో పాల్గొనరాదు. కానీ ఇవేవీ పట్టించుకోకుండా వెళ్లినందుకు వారికి ఇటీవల నో టీసులు జారీ చేసింది. తాజాగా ఆ ముగ్గురినీ సస్పెండ్ చేస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఇందుకు బాధ్యుడిని చేస్తూ ఈవో పురేందర్‌ను అక్కడి నుంచి బదిలీ చేశారు. రాజకీయ సేవకు ప్రతిఫలమే ఈ చర్యలు అ ని భక్తులు భావిస్తున్నారు. పురేందర్ స్థానం లో గంగాపురం ఆలయ ఈవోగా ఉన్న దీప్తిని ఇక్కడకు బదిలీ చేశారు.

మత్తు పదార్థాల నియంత్రణకు కృషి

గద్వాల : జిల్లాలో మత్తు పదార్థాల బారిన పడకుండా అ ధికారులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. కలెక్టరేట్‌లో మిషన్ పరివర్తన మత్తు పదార్థాల వినియోగం, నిర్మూలన కోసం సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాల వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం, ఆలోచనశక్తి సామర్థ్యాన్ని దెబ్బతీసి ఆరోగ్యం, ఆలోచనాశక్తి సామర్థ్యాన్ని, దెబ్బతీసే ఆరోగ్యానికి హాని కలిగిస్తుందని హె చ్చరించారు. మాదకద్రవ్యాల క్రయవిక్రయాలు గుర్తిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్య లు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి సునంద, జిల్లా ఉపాధి కల్పనాధికారి డాక్టర్ ప్రియాంక, ఎల్డీఎం శ్రీనివాసరావు, డీపీఆర్‌వో ఆరీఫుద్దీన్, పౌరసంబంధాల శాఖ మేనేజర్ విమల తదితరులు ఉన్నారు.

ఐక్యంగా పోరాడుదాం : ఎస్పీ

గద్వాల క్రైం : మాదకద్రవ్య దుర్వినియోగం లేని సమాజాన్ని నిర్మించడానికి ఐక్యంగా పోరాడాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. నషా ము క్త్ భారత్ అభియాన్-2025లో భాగంగా మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా సా మూహిక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్య దుర్వినియోగం, దుష్ప్రభావాల గురించి విస్తృత అవగాహన కల్పించే లక్ష్యంతో దేశవ్యాప్తంగా న షా ముక్త్ భారత్ అభియాన్(ఎన్ఎంబిఏ)ను ప్రభుత్వం అమలు చేస్తుదన్నారు. కార్యక్రమంలో సాయుధ దళ డీఎస్పీ నరేందర్‌రావు, కార్యాలయ ఏవో సతీష్, ఆర్ఐ వెంకటేష్, డీసీఆర్బీ ఎస్ఐ షుకూర్, సిబ్బంది ఉన్నారు.

2,050 హెక్టార్లలో వరి పంట మునక

ఏలూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో గత రాత్రి నుంచి భారీగానే వర్షాలు కురిశాయి. కొంత వర్షాలు శాంతించినా తిరిగి సాయంత్రం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా సార్వా వరి సాగులో 2,050 హెక్టార్లలో వరి పంట ముంపునకు గురైందని జిల్లా వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. భీమడోలు మండలంలో 140, ఉంగుటూరు 1,740, దెందులూరు 20, పెదపాడు 32, నిడమర్రు 118 హెక్టార్లలో వరి పంట మునిగిపోయింది. దాదాపు 1135 రైతులకు చెందిన ఈ వరి పంట వివిధ దశల్లో ఉండగా ముంపునకు గురైందని, ప్రస్తుతం వరి పంటకు నష్టం వాటిల్లే అవకాశాలు లేవని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. జిల్లాలో సరాసరి వర్షపాతం 65.5 మి.మీ గా నమోదైంది. ఉంగుటూరు 159.6, పెదవేగి 134.6, భీమడోలు 103.6, ఏలూరు అర్బన్ 97.8, దెందులూరు 89.4, ద్వారకాతిరుమల 89.4, జీలుగుమిల్లి 88, ఏలూరురూరల్ 85, ముసునూరు 78.8, కామవరపుకోట 75.6, పెదపాడు 70, చింతలపూడి 57.2, చాట్రాయి 55.6, లింగపాలెం 53.6, టి.నరసాపురం 47.2, ముదినేపల్లి 45.6, ఆగిరిపల్లి 45.2, నూజివీడు 41.4, బుట్టాయిగూడెం 20.4, కొయ్యలగూడెం 16.2, పోలవరం 10.6, కుక్కునూరు 8.4 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.

ఫామ్ హౌస్ లో యవ్వారం..

హైదరాబాద్ : హైదరాబాద్ నగర శివారులోని ఓ ఫామ్‌హౌస్.. ఆ ప్రాంగణంలో చాలా కార్లు ఆగి ఉన్నాయి.. వాళ్లు చూడటానికి ఇక్కడి వాళ్లు అస్సలే కాదు..